# మా భూమి



వాసిరెడ్డి...సుంకర...

# మా భూమి

**(నాటకం)**

**సుంకర సత్యనారాయణ**

**వాసిరెడ్డి భాస్కరరావు**

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

**విజయవాడ**

**MAA BHOOMI (Drama)**

**- by Sunkara Satyanarayana & Vasireddy Bhaskara Rao**


| | | |
|---|---|---|
| ప్రచురణ నెం. | : | 2350/196-9R |
| ప్రతులు | : | 1000 |
| గత ముద్రణలు | : | 1947, 1948, 1957, 1962, 1972, 1980 |
| | | 1984, 1996, 2005 |
| పదో ముద్రణ | : | మే, 2015 |



© **విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ**


వెల : **₹ 80/-**

**ప్రతులకు**


**విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**

33-22-2, చంద్రం బిల్డింగ్స్

చుట్టుగుంట, విజయవాడ-520 004

ఫోన్ : 0866-2430302

Email : vphpublish@gmail.com

**విశాలాంధ్ర బుక్‌హౌస్**

విజయవాడ, విశాఖపట్నం,

అనంతపురం, గుంటూరు

తిరుపతి, కాకినాడ, ఒంగోలు

శ్రీకాకుళం, కడప, విజయనగరం



**హెచ్చరిక :** ఈ పుస్తకంలో ఏ భాగాన్నైనా పూర్తిగా కానీ, పాక్షికంగా కానీ కాపీరైట్ హక్కు కలిగినవారి నుండి లేక ప్రచురణకర్తల నుండి ముందుగా రాతపూర్వక అనుమతి పొందకుండా ఏ రూపంగా వాడుకున్నా కాపీరైట్ చట్టరీత్యా నేరం.



**ముద్రణ : విశాలాంధ్ర విజ్ఞాన సమితి ముద్రణాలయం - విజయవాడ**

# మా మాట

**'మా** భూమి' నాటకం 1947లో ప్రథమ ముద్రణ పొందింది. ఇది పదో ముద్రణ. వీరోచిత తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం నేపథ్యంలో ఆంధ్ర ప్రాంతానికి చెందిన కృష్ణాజిల్లా రచయితలు వాసిరెడ్డి భాస్కరరావు, సుంకర సత్యనారాయణ 'మా భూమి' నాటకాన్ని రచించారు. ఈ నాటకం తెలుగునాట ప్రేక్షకులను ఎంతో చైతన్యపరిచింది. ఉర్రూతలూగించింది. ఉద్యమానికి ఊపునిచ్చింది. పోరాటేతర ప్రాంతాల ప్రజల నైతిక మద్దతును కూడగట్టింది. ఆనాటి ప్రభుత్వానికి వెన్నులో వొణుకు పుట్టించింది. నిషేధానికి గురయింది.

నేడు ఈ నాటకం రంగస్థలం నుండి తెరమరుగయినప్పటికీ ప్రచురణలు పొందుతూనే ఉందంటే దాని చారిత్రక నేపథ్యం అంత గొప్పది. ఈ నాటక రచనలో సిద్ధాంత బలాన్ని, జవాన్ని కూర్చడంలో వామపక్ష 'జర్నలిజం' పితామహులు చంద్రం (మద్దుకూరి చంద్రశేఖరరావు)గారు, అద్భుత ప్రదర్శనగా రూపొందించటంలో ప్రజానాట్యమండలి తొలితరం నాయకులు, సుప్రసిద్ధ దర్శకులు డాక్టర్ గరికపాటి రాజారావుగారు కీలకపాత్ర పోషించారు.

ఈ నాటకానికి ఇంత గొప్పదనం ఎలా వచ్చిందో నేటితరం అవగాహన చేసుకునేందుకు సహాయపడాలనే ఉద్దేశంతో కొన్ని అంశాలను నాటకం చివర అనుబంధంగా చేర్చాం. మా భూమి నాటకాన్ని నిషేధించినప్పుడు నాటి ఆంధ్ర ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి డాక్టర్ గరికపాటి రాజారావు " 'మా భూమి' ప్రదర్శనపై మద్రాసు ప్రభుత్వపు నిషేధం" అని ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటనను, నాటకంలో ప్రధాన పాత్ర పోషించిన నాటి ప్రజానాట్యమండలి కళాకారులు, ప్రముఖ

సినీనటుడు, రచయిత డాక్టర్ మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి రచించిన 'ప్రజాపోరాటాల రంగస్థలం ఆంధ్ర ప్రజానాట్యమండలి' పుస్తకంలోంచి మా భూమి నాటకానికి సంబంధించి ఆయన అనుభవాలు, అభిప్రాయాలను 'చారిత్రాత్మక మా భూమి నాటకం' పేరుతో ఒక వ్యాసాన్ని, 1948లో నవోదయ వారపత్రికలో శ్రీశ్రీ రాసిన సమీక్షను, 1948 జనవరి అభ్యుదయ సంచికలో కొడవటిగంటి కుటుంబరావు రాసిన "తెలంగాణ స్వేచ్ఛా సంగ్రామ చరిత్ర 'మా భూమి' " సమీక్షను, 1975 సెప్టెంబర్ 12న ఈనాడు దినపత్రికలో నాటి సంపాదకులు ఎ.బి.కె. ప్రసాద్ రాసిన "మా భూమిలో 'మా భూమి'ని చొప్పించి 'భూమికోసం' నడిపించిన సుంకర" వ్యాసాన్ని చేర్చాం. నాటకంలోని కొన్ని ప్రధాన ఘట్టాల నాటి ఫోటోగ్రాఫ్‌లను అనుబంధంలో చేర్చాం.

ఈ సమాచారాన్ని సేకరించడంలో సహకరించిన ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు పులి సాంబశివరావుగారికి, ప్రజాసాహితీ సంపాదకులు కొత్తపల్లి రవిబాబుగారికి, కోరిన వెంటనే ఈ ప్రచురణకు ముందుమాట రాసిచ్చిన ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి గౌరవాధ్యక్షులు, అందరూ ఆప్యాయంగా 'అన్న' అని పిలుచుకునే నల్లూరి వెంకటేశ్వర్లుగారికి అభివందనాలు తెలుపుకొంటున్నాం.

తెలుగు ప్రజలు నేడు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలవారీగా భౌతికంగా విడిపోయారు. రెండు రాష్ట్రాల ప్రజలూ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఉత్పత్తి సాధనాలలో కీలకమైన భూమి తిరిగి పాలక వర్గాల చేతుల్లో బందీ అవుతోంది. ఈ క్రమాన్ని ప్రతిఘటించే పోరాటశక్తులు సంఘటితం కావలసిన ఈ తరుణంలో తెలుగు ప్రజల మహోన్నతమైన చారిత్రక, సాంస్కృతిక పోరాట వారసత్వానికి ప్రతిరూపమైన ఈ నాటకాన్ని ఒక 'చైతన్య జ్ఞాపిక'గా, 'పోరాట దీపిక'గా మీ చేతుల్లో ఉంచుతున్నాం.

**ప్రచురణకర్తలు**

29-4-2015,

విజయవాడ.

# ముందుమాట

## తెలుగు నాటక రంగంలో గుణాత్మకమైన మార్పు తెచ్చిన "మా భూమి" నాటకం

"నైజామ్ నవాబు నిరంకుశ పాలనను ఎదిరించి నల్గొండ జిల్లాలో జరిగిన ప్రజా పోరాటమే మా భూమి  నాటక ఇతివృతం. ఆ పోరాటంలో 52 మంది ప్రాణాలు కోల్పోయారు. 8500 మంది జైళ్ల పాలయ్యారు. 64 మంది స్త్రీలు మానభంగానికి గురయ్యారు. ఆ మహోజ్జ్వల పోరాటమే మేమీ నాటకాన్ని వ్రాయుటకు ప్రోత్సహించింది" అని రచయితలు మా భూమి తొలి ముద్రణ (1946) పీఠికలో వ్రాసుకొన్నారు.

మా భూమి నాటకం సాంఘికమైనా అది ఒక చారిత్రాత్మక నాటకంగా మనం భావించాలి. ఆనాటి తెలంగాణా ప్రజల జీవిత వాస్తవిక చిత్రణే మా భూమి నాటకం. తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటానికి దర్పణం.

ఈ నాటకంలో గ్రామీణ ప్రాంతాలలో వివిధ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యంగా తీర్చిదిద్దబడిన పాత్రలు, బిగువైన సన్నివేశాలు, సహజమైన సంభాషణలు, పాత్రోచితమైన భాష, మాండలికాలు, సామెతలు, ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి.  సందర్భోచితంగా ఉన్న పాటలు, ప్రేక్షకుల్ని ఉత్తేజపరుస్తాయి, ఉద్రేకపరుస్తాయి. ఇంత విశిష్టమైన నాటకం తెలుగు నాటక రంగంలో మరొకటి లేదనటం అతిశయోక్తి కానేకాదు.

ఆ రోజుల్లో సాంఘిక నాటకాలు రచిస్తున్నప్పటికినీ  కుటుంబ సమస్యలు, మానవతా సంబంధాలు, మానసిక ప్రవృత్తులు వగైరా సామాన్య ఇతివృత్తాలతో వ్రాయబడుతుండేవి. దోపిడికి, పీడనకు వ్యతిరేకంగా వర్గ

దృక్పథంతో నాటక రచనలు చేయడం తెలుగునాటక రంగంలో మా భూమితోనే ప్రారంభమైంది. మా భూమి నాటక రచన తెలుగు నాటక రంగాన ఒక కొత్త ఒరవడిని ప్రారంభించిందని చెప్పవచ్చు.

హిందూ-ముస్లిం ఐక్యత, జనాభాలో సగంగా వున్న మహిళలు, ఉద్యమాలలో కూడా ముందుండాలనీ, ప్రజా ఉద్యమాలలో సామాన్యులే అసామాన్యపాత్ర నిర్వహించగలరనే విషయాలను నాటకంలో స్పష్టం చేయడం ద్వారా మా భూమి ఇతివృత్తానికి మరింత పుష్టి చేకూరింది.

కొన్ని గొప్ప నాటకాలు చదువుకునేందుకు మాత్రమే ... ప్రదర్శన కష్టతరం ... మరికొన్ని నాటకాలు ప్రదర్శనలో మాత్రమే గొప్పగా వుంటవి. కాని 'మా భూమి' నాటకం చదువుటకూ, ప్రదర్శనకూ అనువైన గొప్ప నాటకం.

**సుంకర, వాసిరెడ్డి గార్లు 1946లో మా భూమి నాటకాన్ని రచించారు. 1947లో అది ముద్రితమైంది. 1948 జనవరి లో ఆనాటి మద్రాసు ప్రభుత్వం మా భూమి నాటకాన్ని నిషేధించింది.** ఆమధ్యకాలంలోనే 'మా భూమి' నాటకాన్ని ప్రజానాట్య మండలి రాష్ట్ర దళం డా॥ రాజారావు దర్శకత్వంలో, కృష్ణాజిల్లా దళం కోడూరి అచ్చయ్య దర్శకత్వంలో, వివిధ ప్రాంతాలలో ప్రదర్శనలు ఇవ్వసాగారు. అదే సమయంలో వివిధ ప్రాంతాలలో **మాభూమి ప్రదర్శించే స్థానిక దళాలు సుమారుగా 120 ఏర్పడ్డాయట. మాభూమి నిషేధించబడే నాటికి సుమారు ఒక సంవత్సర కాలంలో 980 ప్రదర్శనలు ఇవ్వబడ్డాయి. సుమారు 20 లక్షలకు పైగా ప్రజలు మాభూమి నాటకాన్ని చూశారట.** ఇంత కొద్ది కాలంలో ఇన్ని ప్రదర్శనలు ఇవ్వడం, లక్షలాది మంది ప్రజలు వీక్షించడం, తెలుగు నాటకరంగంలో అద్వితీయం. **టిక్కెట్లతో ప్రదర్శనలు ఇచ్చిన రాష్ట్ర, కృష్ణాజిల్లా దళాల ప్రదర్శనలకు "హౌలుఫుల్" అని బోర్డులు పెట్టేవారట.** కొన్ని సందర్భాలలో ప్రేక్షకుల కోరికపై ఒకే రోజు రెండు ప్రదర్శనలు ఇచ్చిన సందర్భాలు కూడా ఉన్నాయట. తెలుగు రాష్ట్రేతర ప్రాంతాలు షోలాపూర్, పూనా, బొంబాయి, అహ్మదాబాద్, మద్రాసు మొదలగు నగరాలలో కూడా ప్రదర్శనలు ఇవ్వబడ్డాయి. ఆనాటి ప్రముఖ

కవులు, నటులు, రాజకీయ నాయకులు, పాలకులు అందరితో ప్రశంసింపబడిన నాటకం 'మా భూమి'.

"సామాన్యుల్ని, నిరక్షరాసుల్ని గూడా చైతన్య పరచగలిగేది దృశ్య కావ్యం నాటకం మాత్రమే" అనే దానికి నిదర్శనమే 'మా భూమి' నాటకం. వేలాది మంది సామాన్య ప్రజల్ని తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటంలోకి మాభూమి నాటకం ఉరకలెత్తించింది. మద్రాసులో మాభూమి నాటక ప్రదర్శన చూసి ఆనాటి మంత్రి బెజవాడ గోపాలరెడ్డి నిద్రాణమైన జాతిని మేల్కొలుపుతుందీ నాటకం అని ప్రశంసించి అర్థవెయ్యి నూటపదహార్లు బహూకరించారు. మంత్రులు వేముల కూర్మయ్య, కళా వెంకటరావు గార్లు వేనోళ్ల కొనియాడి యీ నాటకం వాడ వాడలా ప్రదర్శించాలన్నారు. ఇలా పొగిడిన కొద్ది రోజులకే "ఈ నాటకం ప్రజల మనస్సులను పాడుచేస్తున్నది." అని చెప్పి 1948 జనవరిలో 'మా భూమి'ని మద్రాసు ప్రభుత్వం నిషేధించింది. సుమారు 70 సంవత్సరాల నాడు జరిగిన తెలంగాణా రైతాంగ వీరోచిత పోరాటాన్ని ఈనాటి ప్రజలకు తెలియజేయడానికి ఈనాడు కూడా ప్రదర్శించదగిన నాటకం 'మా భూమి'. ఇప్పటికి తొమ్మిదిసార్లు ముద్రించబడింది 'మా భూమి' నాటకం. వేలాది కాపీలు ప్రజల మధ్యకు వెళ్ళాయి. అయినా ఈ నాటకం యొక్క ప్రాధాన్యతను గుర్తించి విశాలాంధ్ర ప్రచురణాలయం వారు 10వ ముద్రణ వేస్తున్నందుకు వారికి మనసారా అభినందనలు తెలుపుదాము.

ఒంగోలు,
20-4-2015.

**నల్లూరి వెంకటేశ్వర్లు**
ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి
పునర్నిర్మాణ కమిటీ ప్రధాన కార్యదర్శి
మరియు ప్రస్తుత గౌరవాధ్యక్షులు

# రచయితలు



## సుంకర సత్యనారాయణ

**జననం : ఈడ్పుగల్లు, 23, మార్చి 1909**

**మరణం : 9, సెప్టెంబర్ 1975**

అభ్యుదయ రచయిత, నాటకకర్త, అలహాబాద్‌లో హిందీ విద్యాభ్యాసం, 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలు శిక్ష అనుభవించారు. వాసిరెడ్డి భాస్కరరావుతో కలిసి – ముందడుగు, పరివర్తన, అపనింద నాటకాలను రాసి, తానే ప్రయోక్తగా ప్రజానాట్యమండలి ఆధ్వర్యాన నాటక ప్రదర్శనలు ఇచ్చారు. 'మా భూమి' ప్రసిద్ధ నాటక కళాఖండాన్ని రాశారు. కష్టజీవి, తెలంగాణా, అల్లూరి సీతారామరాజు, అమరజీవి లెనిన్, అమరయోధులు తదితర బుర్రకథలూ, వీర కుంకుమ, గిత్తలబేరం నాటకాలూ రాశారు. వీరి ఇతర ముఖ్య రచనలు 'నూరు కాకుల్లో', 'మా భూమి' రెండవ భాగంగా 'గెరిల్లా' నాటకం రచించారు. సినిమా రంగంలో ప్రవేశించి పల్లెటూరు, నమ్మినబంటు, భూమికోసం – మొదలైన సినిమాలకు సంభాషణలు రాశారు.



## వాసిరెడ్డి భాస్కరరావు

**జననం : వీరులపాడు, 2, సెప్టెంబర్ 1914**

**మరణం : 1, నవంబర్ 1957**

అభ్యుదయ రచయిత, జాతీయవాది. ఇంగ్లీష్, హిందీ భాషలలో నిష్ణాతులు. సుంకర సత్యనారాయణ గారితో కలిసి మా భూమి, ముందడుగు, అపనింద నాటకాలు రాశారు.

పత్రికా సంపాదకత్వంలో వీరిది విశిష్ట మార్గం. కమ్యూనిస్టు ఉద్యమానికి ఆకర్షితులయ్యారు. ప్రజలను అభ్యుదయ మార్గం వైపు నడిపించటానికి కృషి చేశారు. తన యావదాస్తినీ కమ్యూనిస్టు పార్టీకి విరాళంగా ఇచ్చారు. తను నమ్మిన సిద్ధాంతాల ప్రచారం కోసం రచనలు చేశారు. ప్రజలకు స్ఫూర్తినిచ్చే ప్రసిద్ధ నాటకాలు, బుర్రకథలు, పాటలు రాశారు. చలనచిత్ర రంగంలో కూడ మంచి రచయితగా రాణించారు. వీరి మరణానంతరం సహచరులు సుంకర సత్యనారాయణ గారు ఒక్కరే రచనా వ్యాసంగం నిర్వహిస్తూ 'కోతల రాయుడు' నాటకం రాసి వీరికి అంకితం చేశారు.

# మనవి

**ఇ**ది మా మూడో నాటకం. మా మొదటి నాటకం 'ముందడుగు'. ఈ నాటకానికి ఆంధ్ర ప్రజానీకం ఇచ్చిన బ్రహ్మాండమైన స్వాగతమే మమ్మల్ని 'అపనింద' రాయడానికి ప్రోత్సహించింది. 'ముందడుగు' మూడువేల ప్రతులు మొదటి మూడు మాసాల్లోనే ఖర్చు అయిపోయాయి.

ఇంతలోనే మద్రాసు అడ్వైజరీ ప్రభుత్వం ఈ నాటక ప్రదర్శనాన్ని నిషేధించింది. ఇందుకు నిరసన తెల్పుతూ ఆంధ్ర ప్రజానాట్యమండలి ఆదేశానుసారం 15-8-46వ తేదీన ఆంధ్రదేశమంతటా 'ముందడుగు దినోత్సవం' జరుపబడింది. తీర్మానాలు ప్యాసుజేశారు. టెలిగ్రాములు పంపించారు. రాయబారాలు నడిపారు. ఆంధ్రదేశంలో ప్రథమ శ్రేణికి చెందిన పత్రికలు, సాహితీ సభలు, కవులు, నటకులు 'ముందడుగు'ను ఏకగ్రీవంగా అభినందించారు. కాంగ్రెసు మంత్రుల కోరికపై 'ముందడుగు' ఇంగ్లీషు అనువాదాన్ని కూడా పంపాం.

'మా భూమి'ని కూడా 'ముందడుగు' కంటె మరో ముందడుగు అని ఆంధ్ర ప్రజలందరూ అభినందించారు. అచ్చువేసిన రెండువేల ప్రతులూ మొదటి రెండు మాసాల్లోనే అయిపోయాయి. ఆంధ్రదేశంలో ఇప్పటికి 125 'మా భూమి' నాటకదళాలేర్పడి, వేయికిపైగా ప్రదర్శనాలిచ్చాయి. ఇప్పటికి సుమారు 20 లక్షలమంది ప్రజలకీ నాటకం చూపబడింది. కాంగ్రెసు మంత్రుల ఆధ్వర్యం క్రింద మద్రాసులో ఈ నాటకం ప్రదర్శింపబడి, వారిచే మన్ననలు బడసింది. కాని ప్రజా ప్రభుత్వ హయాంలో కూడా అధికారులు

కొందరు ఇంకా నిరంకుశంగానే ప్రవర్తిస్తున్నారు. 'మా భూమి' ప్రదర్శనం పశ్చిమ గోదావరి జిల్లాలో మొదట నిషేధింపబడింది. ప్రజాందోళన ఫలితంగా మాభూమి, ముందడుగులపై ఈ నిషేధం కొంత ఆలస్యంగానైనా రద్దు అయినందుకు సంతోషిస్తున్నాం.

నల్లగొండ జిల్లాలో జరిగిన ప్రజాపోరాటాన్ని గురించి ఈ నాటకం వ్రాయబడింది. ఆ పోరాటంలో 240 గ్రామాలపై పోలీసు దాడులు జరిగాయి. 8,500 మంది అరెస్టు అయ్యారు. 15,390 మంది నైజాం ప్రభుత్వ హింసాకాండకు గురి అయ్యారు. రు. 12 లక్షల 25 వేల విలువ గల ఆస్తి లూటీ చేయబడింది. 52 మంది వీరులు ప్రాణాలను కోల్పోయారు. నైజాం కిరాతకుల చేతుల్లో 74 మంది స్త్రీలకు - మన తెలుగు సోదరీమణులకు - మానభంగం జరిగింది. వీరిలో యిద్దరు మరణించారు. ఈ మహోజ్జ్వల పోరాటమే మమ్మల్ని ఈ నాటకం రాయడానికి ప్రోత్సహించింది.

నైజాం నిరంకుశత్వాన్ని ఎదిరించి వీరోచితంగా పోరాడిన, పోరాడుతున్న తెలంగాణా సోదరులకు 'మా భూమి' ఏమాత్రం తోడ్పడినా మా ప్రయత్నం ఫలించిందని భావిస్తాం.

ఈ నాటక రచనకు మమ్ములను మొదటినుంచి ప్రోత్సహించి ఎప్పటికప్పుడు తగు సలహాలనిచ్చి మాచే ఈ నాటకం పూర్తి చేయించింది శ్రీ మద్దుకూరి చంద్రశేఖరరావుగారు. వారికి మా యందున్న వాత్సల్యానికి సర్వదా కృతజ్ఞులం.

**- రచయితలు**

1947,
విజయవాడ.

# ‘మా భూమి’పై ప్రముఖుల అభిప్రాయాలు

‘మా భూమి’ చదివాను. రచయితలకు నా ధన్యవాదాలు, తెలంగాణా ప్రజల వాస్తవిక స్థితిని ఎంతో చక్కగా చిత్రించారు. ఆంధ్రభాషలో ఇది ఉత్తమోత్తమ నాటకంగా ఉంటుంది. ఆంధ్రప్రజలను, ముక్కోటి ఆంధ్రులను ఐక్యపరిచే నాటకంగా ఉంటుంది. తెలంగాణా ప్రజల పోరాటానికి చేయూత నివ్వడానికి మద్రాసు ఆంధ్రులను ఉద్రూతలూగించే నాటకం. హిందూ–ముస్లిం ఐక్యత, ప్రజాపోరాటాల్లో స్త్రీలు ముందంజ వేయడం, సామాన్యజనం – గొల్ల యల్లమంద, మంగలి రాముడు. నూతన జీవితాన్ని నిర్మించుకోవడానికి ముందుకు రావడం – ఇది అంతా కండ్లకు గట్టినట్లు వాస్తవికతను చిత్రించారు. ఇది చదువుతూ ఉన్నప్పుడు సోవియట్ నాటకాలను చదివినప్పుడెంత సంతోషించానో అంతకన్నా ఎక్కువ సంతోషం పొందాను. కడకు మన తెలుగులో కూడా ప్రజల వాస్తవిక జీవిత చిత్రాన్ని అచ్చుటిలాగానే వ్రాయగలిగినామని సంతృప్తి కలిగింది.

‘ఇట్టి ఉత్తమోత్తమ నాటకాన్ని రచించినందులకు రచయితలకు నా ధన్యవాదాలు.’

**– పుచ్చలపల్లి సుందరయ్య**

“నాటకాన్ని రచయితలు చక్కగా రచించారు. భూత, భవిష్యత్కాలములను దృష్టిలో ఉంచుకొని రచయితలు ఈ నాటకం ద్వారా చక్కని ప్రబోధం కలిగించినవారయ్యారు. ఈ నాటకం నన్ను తన్మయుణ్ణి చేసింది.”

**– హరి నాగభూషణం**

"నాటకంలో రచయితలు సోదర తెలుగు ప్రజల బాధలను అద్భుతంగా చిత్రించారు."

**– మునిమాణిక్యం నరసింహారావు**

"నాటకములు ప్రజానీకమును కార్యశూరులుగా జేయగలవిగా నుండవలెను. 'మా భూమి' నాటకం నిజంగా ఈ పరీక్షలో నెగ్గినదని నేను మనస్సాక్షిగా చెప్పగలను."

**– పంద్రంగి కేశవరావు**

" 'మా భూమి' నాటకం తెలంగాణా జీవితాన్ని ఎంతో సహజంగా, సజీవంగా చిత్రించుతోందని నా అనుభవాన్నిబట్టి చెప్పుచున్నాను."

**– రావి నారాయణరెడ్డి**

" 'మా భూమి' తెలంగాణా ప్రజల్లో అసమర్థతను పారద్రోలి తెలంగాణాలో ఒక విప్లవజ్యోతిని వెలిగించుతోంది. ఆంధ్ర నాటకరంగంలో ఒక కొత్త శకం ప్రారంభమయింది."

**– కొప్పరపు సుబ్బారావు**

"ఈ నాటక రచన కొద్దిలో మిక్కిలి అందంగా ఉంది. ఇందులో అచ్చమైన తెలుగు జాతీయము కుప్పలుకుప్పలుగా ఉంది. ఈ 'మా భూమి'లో ఉన్న భాష తెలుగుఁగడ్డతోఁ బుట్టిన భాష. 'చూడబోతే కుచ్చీకాయ లేరు', 'పట్టుమని పదేండ్లన్నా', 'ఎనిమిదెకరాల గడ్డ', 'ఎందుకొచ్చిన నోటిరంకురా బాబూ', 'బొక్కెడుకండ' – ఇల్లాంటి లోకములో ఉన్న మాటలు సర్వదా ఉన్నవి; ఏరి వెయ్యాలని వేసినవి కావు. 'ఆ పిల్ల నెత్తిన ముందా చిట్టెడు గింజలు పడేదాకా నాకేం తోచదు' – ఇల్లాంటి మాటలు ఎన్ని ఉన్నవో చెప్పలేను.

"మఱి లోకోక్తులు సందర్భోచితంగా బహు రమణీయంగా ఎన్నో ఉన్నవి. 'మనకున్నదాంట్లోనే కాసిని వాళ్ళకిచ్చి కాసుక తాగమందాం', 'గానుగలోదే గంటెడు'. మేము కవులమని బొమ్మలు విఱుచుకొని, పద్యాలు వ్రాసి, ఏనుగుఁలెక్కి

గండపెండెరాలు వేయించుకొనే కవులల్లో ఎంతమందికి ఈ అచ్చమైన, జాతీయమైన తెలుగు భాష తెలుసు?

"ఈ నాటకము బందగీ సమాధితో మొదలుపెట్టుతుంది. చివర సమాధులతోఁ పూర్తి అవుతుంది. ఒక కావ్యానికి ఆద్యంతాలు ఇంత చక్కగా బిగించడం ఒక శిల్పపు నేర్పు.

"ఈ నాటకంలో బహుగుణాలు ఉన్నవి. పాత్రపోషణ కమ్మచ్చున లాగినట్లున్నది. మఠి దాదా యొక్క పాత్ర పోషణ సునిశితంగా ఉంది.

"నాటకమంతా మిక్కిలి రసవంతంగా ఉందని ఇదివరకే వ్రాశాను. నాటకంలో వీరరసం, చివరి అంకంలో మొదటి భాగమంతా శోకరసం, చివరకు వీరరస స్థాపన, సమాధుల దగ్గర నిల్చొని వీరారెడ్డి, సుభాన్, రాముడు మాట్లాడే మాటలు వింటే శోక రసం పొంగి వస్తుంది. అంత చక్కగా ఉంది యీ రచన.

'ఈ కవులు చిరాయుష్కులై, యిల్లాంటి నాటకాలింకా వ్రాయాలని, జాను తెలుగుతల్లికి హారతులెత్తాలని ఆశిస్తున్నాను.'

**– విశ్వనాథ సత్యనారాయణ**

"రచనలో విమర్శకు తావు లేదు. నగారా బాదే సమాసాలే కవిత్వం అనుకునేవారికి ఎంతమందికి ఈ జాతీయమైన తెలుగు తెలుసు? ఈ కవులు Idiom చాలా బాగా పట్టుకున్నారు. వీరి రచనలు చూశాక మేం కవులమని చెప్పుకోడం సిగ్గుగా ఉంది. తిక్కన తర్వాత మళ్ళీ ఈనాడు జాతీయమైన భాష విన్నాం. ఆనాటి తెలుగు ఔన్నత్యం పునరుద్ధరించబడుతూందని ఈ కవులు రుజువు చేశారు. రైలుబండి నడకలాగా ఈ కవులు సంవాదం బహుచక్కగా నడిపారు. బీద రైతుల బాధలు చిత్రించారు. నైజాంలో దేశముఖులకు యింకా గోరీ కట్టలేదు. కాని, యిందులో కట్టారు. రామాయణం వాల్మీకి ముందుగానే గానం చేశాడు. నిజమయింది. అలాగే, ఈ సత్యకవుల వాక్కు త్వరలో ఫలిస్తుందని నమ్ముతున్నాను."

**– పింగళి లక్ష్మీకాంతం**

"ఓరుగల్లును 'మా భూమి'గా చేసి, ముక్కోటి తెలుగు బిడ్డలు ఏకమై విశాలాంధ్ర స్థాపించేందుకు ఇటువంటి నాటకాలు కృషి చేయాలని కోరుతున్నాను."

**– కళా వెంకట్రావు**

"ఈ నాటకం చూడకముందు యింత అద్భుతంగా ఉంటుందని అనుకోలేక పోయాను. 'దున్నే వాడిదే భూమి' అనే సత్యాన్ని యింత చక్కగా చూపించారు. ఈ నాటకం మన గ్రామాల్లో ప్రదర్శిస్తే బీదరైతులు, వ్యవసాయ కూలీలు 'దున్నే వాడిదే భూమి' అనే సూత్రాన్ని ఆచరణలో పెట్టి తీరుతారు. త్వరలోనే అటువంటి శాసనం వస్తుందనీ, మధ్యదళారీలు తొలగింపబడుతారనీ నేను ఆశిస్తున్నాను."

**– వేముల కూర్మయ్య**

"ఈ కథలో ప్రజలనేక కష్టాలు పడ్డారు. నష్టాలనుభవించారు. ఈ విషాదాన్నంతా సంఘంగా మార్చుకున్నారు. ఐక్యమయ్యారు. పోరాడారు. విజయం పొందారు. మన గ్రామాల్లో కూడా యివి నిత్యం జరుగుతున్నవే. జగన్నాథరెడ్డివంటి దేశముఖులు ఒక్క నైజాంలోనే కాదు; మన ప్రాంతాల్లో కూడా ఊరూరా ఉన్నారు. ఇందులో దినందినం నిరుపేదలు పడే కష్టాలు చూశాం. హృదయాలు ద్రవించాయి. కన్నీళ్ళు కార్చాం."

**– బెజవాడ గోపాలరెడ్డి**

".... ఈ నాటకం చదివిన – చూచిన ప్రతి వ్యక్తీ సోదర తెలంగాణా ప్రజల దురవస్థలకు ఉద్రిక్తుడవుతాడు. వారి ప్రతిఘటనా శక్తిని జూచి ఉత్సాహ, ఉద్రేకాలతో ముందు కురుకుతాడు. ఈ తెలంగాణా 'మా భూమి' ఇక ఈ దౌర్జన్యాలను, దోపిడీలను అచట సాగనీయం, వారి స్వతంత్ర పోరాటానికి సాయపడతాం' అని దీక్ష బూనేటట్లు చేస్తుందీ నాటకం.

ప్రజల నిత్యజీవితాన్ని ఇంత వాస్తవంగా, ఇంత రసవత్తరంగా చిత్రించ గలగడానికి వారిని ప్రోత్సహించినది ఒక అభ్యుదయ దృక్పథమే కాదు; జీవన్మరణ సంగ్రామం సాగిస్తున్న తెలంగాణా ప్రజ వారిని ఉత్సాహపరచి ఉంటుంది.

"ముందడుగుతో ఆంధ్ర నాటకరంగంలో ముందడుగువేసిన ఈ రచయితలు ఈ రచనలో మరింత ప్రతిభావ్యుత్పత్తులను చూపారు. రచనలోనేమి, శిల్పంలోనేమి ఎంతో అభివృద్ధిని కన్పర్చారు.

"హృదయ ముద్రూతలూగించే పాటలు కొన్ని ఉన్నాయి. పాత్రోచిత సంభాషణలూ, ఒడలు గగుర్పొడచి రక్తముప్పొంగించే సన్నివేశాలతో నాటకం నిండివుంది. ఆంధ్ర నాటకరంగానికి, అభ్యుదయ సాహిత్యానికి రచయితలు మరొక కానుక అర్పించారీ రచనతో.

"ప్రతిభావంతంగా ఈ నాటకం రచించిన రచయితలు అభినందనీయులు.

".... ఈ నాటక రచనా, ప్రదర్శనా, యువరచయితలనూ, నటకులనూ అభ్యుదయకర పద్ధతుల్లో పెట్టడానికి ప్రోత్సహించుతుందని విశ్వసిస్తున్నాను."

**- తుమ్మల వెంకట్రామయ్య**

(ప్రజాశక్తి 13-7-47)

"ఆంధ్ర ప్రజానాట్యమండలివారు ప్రదర్శించిన 'పరివర్తన' 'మా భూమి' నాటకాలను చూశాను. ఈ నాటకాలు రెండూ రెండే... ఈ ప్రదర్శనాలు నేను మరువలేనివి."

**- మల్లంపల్లి సోమశేఖరశర్మ** (ఆంధ్రప్రభ 7-12-47)

"ఇంతవరకు అనేకమందిమి అనేక నాటకాలు చూశాం. కాని నా ఉద్దేశంలో అవేవీ నాటకాలు మాత్రం కావనీ, ఇదొక్కటే కళాన్వితమైన నాటకమనీ నా అభిప్రాయం."

**- లింగమూర్తి**

"ఈ నాటకం చూచాక ప్రతి నాటకకర్తా, ప్రజలనింతగా ఆకర్షించే లాగునా, మంత్రముగ్ధుల్ని చేసే విధంగానూ వ్రాయగలగాలని కోరుకోవాలి. నేను ఈ నాటకాన్ని మూడు తడవలు చూచాను. మొదటిసారి చూచినప్పుడెంత బాగుందో, మూడోసారి చూచినప్పుడు కూడా అంతే బాగుంది."

**- నార్ల వెంకటేశ్వరరావు**

"సోదర తెలంగాణా ప్రజలు అష్టకష్టాలూ పడుతున్నారు. దుర్భర పరిస్థితులకు లోనవుతున్నారు. వీటినుంచి బయటపడాలంటే మనలో ధైర్యస్థయిర్యాలు రేకెత్తాలి. దానికి ఈ నాటకం మహత్తరంగా పనిచేసింది. అంతా విషాదం, అంతా సంతోషం ఉంటే నాటకం రక్తికట్టదు. ఇందులో అన్ని రసాలూ ఉన్నాయి. ఇంత అద్భుత రచనను తీసికొని ప్రజానాట్యమండలి వారు ప్రదర్శించడం మన అదృష్టం."

**– గాడిచర్ల హరిసర్వోత్తమరావు**

"ఎటువంటి సాంఘిక నాటకం ఆదర్శప్రాయమో, దేనికొరకు నేను ఇంతకాలంనుంచీ కలలుగంటున్నానో, అటువంటి నాటకాన్ని ఈనాడు చూడగలిగినందుకు నాకు చాలా ఆనందంగా ఉంది. శ్రీ గురజాడ అప్పారావు గారే ఈ నాటకాన్ని చూచి ఉన్నట్లయితే, తాము పడ్డ కష్టాలన్నీ ఫలించినాయి' అని ఉండేవారని నా భావం. నాటకాన్ని చూస్తూ ఉంటే ఉత్సాహం, ఉద్రేకం కలిగించాలి. అటువంటి నాటకాన్ని ఈనాడు మనం చూచాం.

'ఇక్కడ కూర్చున్నంతసేపూ నాటకం చూస్తున్నట్లులేదు. ఈ దృశ్యాలన్నీ మన కళ్ళయెదుట జరుగుతున్నట్లే ఉంది. చాలా సంతోషం కలిగింది. ఈ నాటకం రచించినవారిని, ప్రదర్శించినవారిని నేను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను."

**– గిడుగు సీతాపతి**

# ‘మా భూమి’

(నాటకం)

# పాత్రలు

| నంబరు | పాత్రలు | పరిచయం | వయస్సు |
|---|---|---|---|
| **1.** | వీరారెడ్డి | కథానాయకుడు | **35** |
| **2.** | దాదా సాహెబ్ | రైతులు | **55** |
| **3.** | సుభాన్ | రైతులు | **24** |
| **4.** | రామిరెడ్డి | రైతులు | **26** |
| **5.** | జగన్నాథరెడ్డి | దేశముఖ్ | **45** |
| **6.** | వెంకట్రావు | పట్వారీ (కరణం) | **50** |
| **7.** | మస్తాన్ | రౌడీ | **30** |
| **8.** | రాముడు | దేశముఖ్ సేవకుడు | **35** |
| **9.** | యల్లమంద | గొల్ల | **40** |
| **10.** | సీతమ్మ | వీరారెడ్డి భార్య | **27** |
| **11.** | కమల | వీరారెడ్డి చెల్లెలు | **14** |
| **12.** | అమీన్ | సబ్ ఇన్‌స్పెక్టరు | **32** |

ఇద్దరు ముగ్గురు పోలీసులు

# 1

# బందగీ సమాధి

(సబ్జా మొక్కలు, సన్నజాజులు వగైరా రకరకాల పూలమొక్కలతో సమాధి అలంకరించి ఉంటుంది. వీరారెడ్డి, దాదాసాహెబ్ ఒక ప్రక్కన, సుభాన్, రామిరెడ్డి మరోప్రక్కన నుంచుని ఉంటారు. వీరారెడ్డి భార్య సీతమ్మ, చెల్లెలు కమల సమాధిపై అగరువత్తులు వెలిగిస్తూ ఉంటారు. తెర లేస్తుంది. అందరూ కలిసి పాడుతూ ఉంటారు.)

భాయీ బందగీ,
నీ జీవితమే జీవితము
    భాయీ బందగీ
వీరయోధుడా హారతులివిగో
క్రూర నిరంకుశ దేశముఖుల ఈ
దారుణ హింసల రూపు మాపగా
పోరాటంబున ప్రాణా లొసగిన
    నీవే అమర జీవివోయీ
    మార్గదర్శివోయీ ॥భాయీ॥
విప్లవ జ్యోతిని వెలిగించితివి
తెలంగాణను నీవే
ఇంటింటను నీవే
మా హృదిలో నీవే॥

(కమల, సీతమ్మ వీరారెడ్డి ప్రక్కన వచ్చి నుంచుంటారు. పాట అయిపోయిన తర్వాత అందరూ తమ చేతుల్లో ఉన్న పువ్వులు సమాధిపై చల్లుతారు.)

**సుభాన్** : (నాలుగు వైపుల తేరిపారజూచి) ఏం జనం తెంపు లేదు!

**రామి** : ఓహ్! జనమేమిటి, ఇసుకేస్తే రాలేటట్టు ఉందా?

**దాదా** : వచ్చే బండికి, దిగే బండికి అంతులేదు. ఏ చెట్టుకింద చూచినా బండే! నిరుడే అనుకుంటే, అంతకు రెట్టింపు జనం వచ్చింది ఈ యేడు.

**వీరా** : అవును, ఏయేడు కాయేడు పెరిగిపోతూ ఉంది. ముందు ముందు ఇంకా వస్తారు.

**దాదా** : ఎనకటి రోజుల్లో రేపాల తిరుణాలకి, సోమప్ప తిరుణాలకి ఇట్లాగే వచ్చేవాళ్ళు.

**రామి** : ఆఁ ఏం వచ్చేవాళ్ళో. కొరివి తిరణాల మాగొప్ప తిరణాలని నిరుడు పనిమాల బండి గట్టుకెల్లా. తీరా చూడబోతే కుచ్చీకాయ లేరు.

**దాదా** : అక్కడ ఒకచోటే ఏంటి? ఇప్పుడే తిరణాల కెల్లినా అంతే.

**సుభాన్** : నిజమే దాదా!

**రామి** : అయితే, మన బందగీ ఉర్సుకి జనం ఇట్టా పొర్లివస్తుందేమిటి?

**దాదా** : ఏమో బాబు, ఈ చిత్రమంతా అల్లాకే తెలవాలి.

**వీరా** : ఇందులో పెద్ద చిత్రమేముంది దాదా? బందగీ పేరు రోజురోజుకీ ప్రజల్లో పాకిపోతూ ఉంది. అందుకే దూరదూరాన్నుంచి ఈ తిరణాల చూడ్డానికి జనం వస్తున్నారు.

**సుభాన్** : బందగీ చచ్చిపోయి ఇంకా పట్టుమని పదేళ్ళన్నా గాలా. అప్పుడే అతన్ని గురించి అనేక ఊళ్ళల్లో వింతవింతగా చెప్పుకుంటున్నారు.

**వీరా** : అప్పుడే ఏమయింది? ముందుముందింకా చెప్పుకుంటారు.

**రామి** : ఏం ఎందుకని?

**వీరా** : అవును, అతను చేసిన త్యాగం అలాంటిది. ఆ రోజుల్లో ఒక్కడే దేశముఖుతో ఎదిరించి పోట్లాడాడంటే మాటలా?

**సుభాన్** : అందులో విసునూరు దేశముఖు అంతవాడితో!

**రామి** : మూణ్ణాల్లు బతికినా అట్టా బతకాలి.

**సుభాన** : ఆయనకు తోడు అట్టాంటోళ్ళు ఇంకా పదిమంది ఉంటే కనబడేది ఈ దేశముఖు తడాఖా.

దాదా : ఏదో మనం అట్టా అనుకోవడమే గాని, ఎంతమంది అయితే మాత్రం ఏం జేస్తారా మహారాజుని?

రామి : ఏం, అంతలావు మొగాడా?! ఎంతమందిని చంపుతాడు?

సుభాన్ : ఎందుకు చంపడు, ఇట్టాంటి మన దాదాలంతా చేతులు ముడుచుక కూచుంటే ఏం చెయ్యకుండా?

దాదా : చేశామో, చేయలేదో, మా కాలం ఏదో గడిచిపోయింది. ఇక మీ పడుచోళ్ళు చేసే తలకిందులేమిటో చేయండి, అదీ చూద్దాం.

సీత : అసలీ తగాదాకు మూలమేంటో?

సుభాన్ : ఏముంది, పదిమందిలో ఔననిపించుకోవడమే.

సీత : పదిమందిలో మంచి అనిపించుకుంటే, ఆయన సొమ్మేంబోయింది?

వీరా : ఎందుకు బోదు? పదిమందీ బందగీచుట్టూ చేరితే, ఇక దేశముఖు మొఖం చూసేదెవడు?

కమల : అతను పైకివస్తే ఇంకా వీడి పెత్తనం ఎలా సాగుతుంది వదినా?

దాదా : మన సుభాన్ ఈడుకే ఆ ఊరోళ్ళందరితో సెబాస్ అనిపించుకున్నాడు.

కమల : అంత చిన్న వయస్సులోనే ఆ ఊళ్ళో ఏ తగాదా వచ్చినా తీర్పు చెప్పేవాడటగా దాదా?

దాదా : ఊళ్ళో తగాదాలేమిటమ్మా, చివరకు మొగుడూ పెండ్లాం మధ్య కీచులాడుకున్నా అతని దగ్గరకే వచ్చి చెప్పుకొనేవాళ్ళు. అదేం పుటకో! ఎవళ్ళకీ నొప్పి తగలకుండా తీర్మానం చేసి పంపించేవాడు. అట్టాంటోణ్ణి వాళ్ళ పొట్టన బెట్టుకున్నారు.

సీత : అంత బుద్ధిమంతుణ్ణి చంపడానికి ఎవడికి చేతులాడినయ్యో?

సుభాన్ : (కోపంగా) తాగుబోతు, డబ్బుకు గడ్డిదిని ఖూనీ చేశాడు.

సీత : ఎవడు అంత పాపాని కొడిగట్టింది?

కమల : ఎవడోగాదు, వాళ్ళ అన్నే వదినా!

సీత : చాల్లే పిచ్చిపిల్లా, తమ్ముణ్ణి ఎక్కడన్నా అన్న జంపుతాడూ? ఏమిటా మాటలు?

దాదా : నిజమేనమ్మా, అమ్మాయి జెప్పింది నిజమే. కసాయిముండాకొడుకు

వాళ్ళ అన్నే చంపించాడు.

రామి : అట్టాంటి దుర్మార్గుణ్ణి పగలకోసినా పాపం లేదు.

వీరా : వాడి పనిబట్టడం ఎంతసేపు, అసలీ తగాదా బెట్టిన దేశముఖుకి బుద్ధి చెప్పాలిగాని.

సీత : వాడి కడుపుగాల. అన్నచేతనే తమ్ముణ్ణి చంపించాడంటే వాడెంత మాయముండాకొడుకో? అసలీ తగాదా భాగాల దగ్గిరొచ్చిందా?

వీరా : భాగాల దగ్గిర తగాదా ఏముంది? అయిదుగు రన్నదమ్ములూ తలా నాలుగెకరాలూ పంచుకున్నారు. ఇంటికి పెద్దోడని అబ్బాసలీకి జ్యేష్ఠ భాగంకింద ఇంకో నాలుగెకరాలు ఎక్కువ కూడా ఇచ్చారు.

దాదా : ఏం ఇస్తే ఏం ఫాయిదా? వాళ్ళ పరువెక్కడ దక్కనిచ్చాడు? తాగి తందనాలాడి తనకిచ్చిన ఎనిమిదెకరాల గడ్డా పాడుజేసుకున్నాడు.

వీరా : వాడు తాగితేం, తలకుపోసుకుంటేం? అదెవడికి గావాలి? మళ్ళీ వచ్చి నాకు భాగం పెడ్తారా, చస్తారా అని తయారయ్యాడుగా.

రామి : మళ్ళీ ఏ మొకంతో వచ్చాడు సిగ్గులేక. భాగం అంటే అంత అడ్డగోలుగా ఉందా ఏమిటి?

సుభాన్ : ఎందుకుండదు? వెనకమాల దేశముఖు భుజం వేసుకుంటే ఎన్ని ఆటలైనా ఆడొొచ్చు.

దాదా : నా బోటోడైతే అప్పుడే గుడ్లు తేలేసేవాడు. కాని ఆడిదేం ధైర్యమో! పన్నెండేళ్ళు ఢీ అంటే ఢీ అని దేశముఖుకు ఎదురుతిరిగి పోట్లాడాడు.

సీత : ఒక్కడే అన్ని రోజులు ఎట్టా పోట్టాడాడో!

వీరా : ఏముంది? నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది. చుట్టుపట్ల మన నాలుగూళ్ళ జనం (సమాధివైపు చూచి) ఈయనమీద ఈగ వాలనిచ్చారా?

దాదా : సద్దొన్నం మూట బుజానేసుకుని కాళ్ళు కండెలు కట్టేటట్టు పన్నెం డేళ్ళు కచేరీ చుట్టూ తిరిగాడు.

సీత : పన్నెండేళ్ళే!

కమల : ఎన్నాళ్ళు తిరిగితే ఏం వదినా, చివరికి బందగీయే గెల్చాడుగా.

**రామి** : గెల్చాడూ? ఇవన్నీ పెద్దోళ్ళకి మాకే తెలియవ్. నీకెట్టా తెలిసినయ్ అమ్మాయ్?

**సీత** : (చిరునవ్వుతో) దాని కెందుకు తెలియవ్. ఇంటో అన్న ఉన్నాడుగా నూరిపోయడానికి. (కమలతో) కానియ్ తర్వాత సంగతి కూడా నీవే చెప్పు.

**కమల** : (ముసిముసి నవ్వులతో) నేను చెప్పడమెందుకు? అన్నయ్యనే అడగరాదూ? నాకు చెప్పినట్టే నీక్కూడా చెప్తాడుగా.

**సీత** : (సిగ్గుతో) నేర్చావులే మాటలు. నోరుముయ్!
(అందరూ నవ్వుతారు)

**రామి** : ఇంతకీ తర్వాత ఏమి జరిగింది దాదా?

**దాదా** : బందగీ గెల్చాడని కబురు తెలియగానే చుట్టుపక్కల నాలుగూళ్ళల్లో పండుగ జేసుకున్నారనుకో.

**సుభాన్** : ఏం పండగజేసుకుంటే ఏం లాభం?

**సీత** : ఏం?

**వీరా** : ఏముంది? బందగీ గెల్చాడంటే దేశముఖుకి నిద్రబట్టలేదు. ఇక తన పచ్చిదోపిడీ సాగదనుకున్నాడు. కుట్రలు పన్నాడు.

**సుభాన్** : ఎన్ని కుట్రలు పన్నినా చివరకు దొంగేడ్పు ఏడ్చాడుగాని నెరీదుగా వస్తే వాడి బతుకు బైటపడేది.

**సీత** : ఏం జేశాడేంటి?

**వీరా** : మిసల్ (రికార్డు) తెచ్చుకోడానికి పాపం ఒకరోజు బందగీ ప్రొద్దున్నే కచ్చేరీకి బయల్దేరాడు. సరిగ్గా ఇక్కడికే – మనం ఇప్పుడు నుంచున్న చోటికే వచ్చాడు. కంచెలో దాకునున్న దేశముఖు రౌడీలు అమాంతంగా ఒక్కసారి కత్తులతో బందగీ మీద పడ్డారు. బందగీ తల తెగిపోయి నేలమీద పడింది. నెత్తురు కాలవ గట్టింది.

**సీత** : రామ రామ, కటిక చచ్చినోళ్ళెంతపని జేశారు!

**దాదా** : ఊళ్ళో ఆ రోజున ఒకరింట్లో కూడా పొయ్యి రాజలేదు.

**రామి** : (ఆవేశంగా) ఎందుకు? మనదీ ఒక బతుకే, ముండబతుకు!

**సుభాన్** : కాకపోతే, ఇంతపనీజేసి ఊళ్ళో యింకా ఆ దేశముఖు ఎన్ని గుండెలతో ఉంటాడు?

**దాదా** : ఏం జేస్తాం? గుడ్లనీళ్ళు గుడ్లల్లో గుక్కొని కుళ్ళికుళ్ళి ఏడ్చాం. అంతా కలిసి తలా ఒక చేయివేసి ఎట్టాగైతేం చివరికీ గోరీ కట్టించాం.

**సుభాన్** : లోపల లోపల కుళ్ళి చచ్చేకంటే అంతా ఒక్కసారే కట్టగట్టుకొని చస్తే పోయేదిగా?

**రామి** : అంతా ఎందుకు చావాలి? ఈ గోరీ పక్కనే ఆ దేశముఖు గోరీ కూడా కడితే అందరి పీడా వదిలేది.

**సీత** : బందగీ అట్టాంటి పుణ్యాత్ముడు కనుకనే ఈ పూజలు జరుగుతా ఉన్నాయి.

**వీరా** : వట్టి వట్టి పూజలు చేసినంత మాత్రాన ఒరిగేదేముంది? బందగీ దేనికోసం బలైపోయాడో మనం దాన్ని సాధించినప్పుడే అతని ఆత్మకు శాంతి కలుగుతుంది.

**రామి** : ఇక చూద్దాం వీడి ఆటలెన్నాళ్ళు సాగుతయ్యో!

**సుభాన్** : ఎన్నాళ్ళో ఎందుకు? మనాళ్ళు నలుగురూ కలిస్తే రేపీపాటికి పూడ్చిపెట్టం!

**దాదా** : ఎందుకొచ్చిన నోటిరంకురా బాబూ! గోడలకు చెవులుంటాయి. ఈ గొడవంతా మళ్ళీ ఆ దొరకు తెలిస్తే...

**సుభాన్** : ఏం, తెలిస్తే?

**రామి** : చంపుతాడా? చంపనీ, ఈ ముండ బతుక్కంటే ఆ చావు మేలు.

**దాదా** : తొందరపడితే పనులవుతయ్యా! దేన్కైనా ఆ గడియ రావాలి.

**కమల** : ఏ పని అయినా మన ప్రయత్నం లేకుండా ఎలా అవుతుంది దాదా?

**దాదా** : నిజమే అనుకో అమ్మా! కాని, ఏం జేస్తాం? ఆయన బలవంతుడు. మనకు రెక్కాడితేగాని, డొక్కాడదు. వాడు తల్చుకుంటే మన్ని చీమల్లాగా నలిపేస్తాడు.

**వీరా** : చీమలన్నీ కలిసి ఒక పెద్ద పామును చంపివేయడల్లా! మనం అంతా కలిస్తే వీడి బ్రతుకూ అంతే.

**దాదా** : అది నిజమే అనుకో నాయనా! ముందు మనాళ్ళంతా కలిసి రావాలిగా మరి?

**రామి** : ఏం జేస్తారేం కలిసిరాక?

**సుభాన్** : కడుపులో కాల్తుంటే అంతా కలిసొస్తారు.

**వీరా** : ఏం దాదా! మన ఊళ్ళో ఇంతమంది జనం ఉన్నామా, అంతా ఆరుగాలం చెమటోడ్చి కష్టపడి పనిచేసే వాళ్ళమేగదా? ఇందులో ఒక్కడి కొంపైనా కాస్తి పచ్చగా ఉందేమో చెప్పు?

**రామి** : అందాకా ఎందుకు? బొక్కెడు కండున్నవాణ్ణి ఒక్కణ్ణి జూపెట్టు మనూళ్ళో.

**దాదా** : అసలు తిండి ఉంటేనా కండ ఉండటానికి?

**సుభాన్** : వండిన గింజంతా సర్కారే లాక్కుపోతా ఉండె. లెవి అంట లెవీ.

**వీరా** : ఒక్క లెవీయేనా, పైన కార్పొరేషన్ (ఖుష్ఖరీని) పేరుతో దోచుకునే దెంత?

**దాదా** : అందాకా ఎందుకు, నా తిప్పలు చూడరాదు? దేశముఖు దగ్గర మా పెద్దపిల్ల పెళ్ళికెప్పుడో రెండు బస్తాలు నాగుకు తెచ్చాను. ఏటా తీర్చేది తీరుస్తానే ఉండా, పెరిగేది పెరుగుతానే ఉంది.

**వీరా** : మరి నీవే చెప్పు. ఇక మనం ఎలా బతకాలో.

**దాదా** : ఇంకా ఒకటే బతకడం. ఇట్టాగే ఎండెండి ఎప్పుడో ఒకరోజు రాలిపోవడమే.

**రామి** : ఇంకా నయం. మన వీరారెడ్డి బావ రాసిచ్చాడు గాబట్టి సరిపోయింది. లేకపోతే మన పటేల్ కూడా తిమ్మాపురం పటేల్‌లాగా తఖ్తారాసి పెట్టినందుకు ఇంటికి 50 రూపాయలు గోళ్ళూడగొట్టి వసూలు చేసేవాడే.

**సుభాన్** : ఎట్టా జస్తాం? కదిలితే లంచం, మెదిలితే లంచం. బాడిగ తోలుకొని బ్రతుకుదామన్నా బండిపట్టాలు కూడా కరువేనాయె!

**రామి** : నీ గోడు నా గోడు ఆలకించే దెవడు? ఆ వచ్చిన నాలుగు జతలూ వాళ్ళే పంచుకున్నారు.

వీరా : ఒక బండి పట్టాలేమిటి? మన పని అంతా కొనబోతే కొరివి, అమ్మబోతే అడవిగా ఉంది. మనకు కావాలసిందేది దొరుకుతూ ఉంది?

కమల : దేనిమాట ఎలా ఉన్నా రాత్రిపూట కాసేపు చదువుకుందామంటే దీపంలోకి చమురుకూడా లేదాయె!

సీత : చదువూ చట్టుబండలూ.. చివరకు బిడ్డ మాడుకు పెడదామంటే రవ్వంత కొబ్బరినూనె కూడా కరువే అయిపోయింది.

దాదా : నిజమేనమ్మా, నిజమే. యేముంది. చెప్పుకుంటే మానంబోయే, చెప్పుకోకపోతే ప్రాణంబోయె నన్నట్టుంది మన బతుకు. ఇంట్లో ఒక చీరె ఉంటే మీ పిన్నీ, చెల్లెలూ చెరిసగం చింపి కట్టుకుంటున్నారు. పోనీలే అమ్మా! ఎందుకొచ్చిన గొడవ. చెప్పుకొంటం కూడా నామర్దా.

సీత : కాస్తి కుడి ఎడమే కాని అందరిపనీ అంతే ఉందిలే దాదా! (వీరా రెడ్డివైపు తిరిగి) వచ్చి చాలా సేపయింది. వెళ్తాం. అబ్బాయి గోల చేస్తా ఉంటాడు.

(సీతమ్మ, కమల బయల్దేరుతారు)

వీరా : రామిరెడ్డీ! అమ్మాయినీ, వాళ్ళనీ అక్కడిదాకా పంపించి ఎడ్లకి నీళ్ళు బెట్టి కాస్త మేతేసిరా.

(కమలా, సీతమ్మలతోపాటు రామిరెడ్డి కూడా వెళతాడు)

సుభాన్ : యేం దాదా, మరి యేమంటావు? మనూళ్ళో కూడా సంఘం పెట్టుకుందామా?

దాదా : మీ మాట లింటావుంటే సంగం బెట్టుకోవడమే మంచిదనిపిస్తా ఉంది. కాని మనూళ్ళో తలకొక మాట. నిర్వాకమై చస్తుందా అని...

వీరా : మరేం పర్వాలేదు దాదా, మీ బోటివాళ్ళు పైన కాస్తి ఊతమిస్తే చాలు. ఆ పని అంతా మేమే చేస్తాంగా.

దాదా : ఏమో బాబు. ఈ కాలపు వాళ్ళ సంగతులు మాకేం తెలుస్తాయి? సుభానేమో సంగం బెట్టుకుందా మంటాడు. వాడన్నేమో వద్దంటాడు.

సుభాన్ : ఎందుకు వద్దనడు? సంఘం బెట్టుకుంటే ఆయన పిచ్చికళలు సాగవుగా మరి. మన పదిమందితోపాటు నిలిస్తే నిలుస్తాడు. లేకపోతే

పోయి ఆ దేశముఖు చంకకిందనే దూరనీ.

**దాదా** : మళ్ళీ మనలోనే కొందరిటూ, కొందరటా? అయితే ఇక నిర్వాహక మైనట్టే!

**వీరా** : డబ్బుకోసం గడ్డితినే రకం ఎవళ్ళో నలుగురు ప్రతి ఊళ్ళోనూ ఉంటారు. అందుకని సంఘం బెట్టుకోకుండా మానుకుంటామా? (యల్లమంద ప్రవేశం, మడిచికట్టిన ఎర్రంచు మొద్దు పంచ (గొల్లకట్టు), చేతిలో కర్ర, కర్రకు అన్నపుదుత్త, రొండున సగం కాల్చిన ఆకుచుట్ట, చెకుముకి సంచి, పాత చెప్పులు, లావాటి తలగుడ్డ, బుజాన గొంగళి, చేతులకు వెండి మురుగులు, రెండు చెవులకు పోగులు, కొసచెవుకి జంపు, ఎడమచేతికి దండకడెం).

**యల్ల** : (వస్తూనే) ప్రొద్దున్నే లేసి వోడిమొగం చూసిన్నో, కట్టానికి కట్టం దప్పలా, నట్టానికి నట్టం దప్పలా (అంటూ చెప్పులూ, కర్ర, గొంగళి ఒక ప్రక్కనబెట్టి తలగుడ్డ దీసి బందగీ సమాధికి దండంబెట్టి చెంపలు వేసుకుంటాడు.

**వీరా** : ఏం యల్లమందా? ఇంతపొద్దెక్కిందాకా ఉన్నావేం?

**సుభాన్** : ఏముంది? ఏదో జరిగి ఉంటుంది.

**దాదా** : వాలకం చూస్తే అట్టాగే ఉంది.

**యల్ల** : ఏముంది సిన్నయ్యా!మాబోటోళ్ళం మత్తానయ్య కింద బతికేటట్టు లేదు. తల్లిముండమొయ్య ఎంత అదరగండం, భూమిమీద ఆగేటట్టున్నాడా?!

**వీరా** : (ఆదుర్దాగా) ఏం? ఏమన్నాడేంటి?

**యల్ల** : అంటవేంది? సూడు, గూబకిబెట్టి నూకిందు.

**సుభాన్** : (యల్లమంద చెంపమీద చేయివేసి చూస్తూ ) ఏం పొయ్యేకాలం వచ్చింది ఇట్టాగొట్టాడు?

**యల్ల** : ఆడెవడో ఇయ్యాల గరిడీకి జచ్చిండంట!

**వీరా** : ఎవడు?

**యల్ల** : ఆఁ అడుగాడే. ఇంకెవడు జచ్చిండు, ఆ పోలీసు అమీనే!

**వీరా** : అయితే ఇంకేం. వేటపోతు కోసం యల్లమంద మందమీద వచ్చి పడి ఉంటారు.

**యల్ల** : వచ్చినాళ్ళు దేన్నో ఒకదాన్ని పట్టకపోతే ఒక ఏడ్పు ఏడ్చి ఊరకుందును. (సుభాన్‌వైపు తిరిగి) నలుగురెదవనాయాళ్ళను యెమ్మటేసుకొచ్చి, నీ అన్న మత్తానయ్య దేవరపోతును పట్టుకెళ్ళాడుగందా! ఎట్టా జావాలి?

**దాదా** : అరే పాపం, ఆ దేవరపోతును వదిలిపెట్టి, ఇంకోదాన్ని అయినా చావమనకపోయావ్.

**యల్ల** : 'నీ బానిచోణ్ణి బాబూ! కాల్‌మొక్తా, దాన్ని వదిలిపెట్టి ఇంకోదాన్ని తీసికెళ్ళ'మంటేనే గూబ అదరేసిండు. (కండ్ల వెంట నీళ్ళు తిరుగుతాయి).

**దాదా** : ఆరి బద్మాష్!

**వీరా** : ఈ బద్మాషీ ఇలా సాగిపోవాలసిందేనా? ఏం దాదా! ఎంతకాలమని చేతులు ముడుచుక్కూచుందాం?

**సుభాన్** : ఎంతకాల మేమిటి? అప్పుడే యల్లమంద కఱ్ఱ తిరగేసి నట్టయితే ఆ కాసిని జలుబు నీళ్ళూ వదిలేయి.

**యల్ల** : కడుపు మండిపోయింది. (చేతిలో కఱ్ఱ చూపెడుతూ) ఈ వంక కఱ్ఱ తిరగేసి దెబ్బకు పండబెట్టేవాణ్నే బిడ్డణ్ణి. నిన్ను జూసి ఊరుకోవాలి సొచ్చింది సుబానయ్యా!

**సుభాన్** : అన్నయితేం, తమ్ముడైతేం? ఇట్టాంటి ముండమోపి పనులు చేసేటప్పుడు.

**యల్ల** : ఎంత చెడ్డా ఒక పేగున పుట్టినోళ్ళుగా!

**వీరా** : మన కలాంటిదేమీ లేదు యల్లమందా! అన్నయితేం? కొడుకయితేం? చివరకు – కన్నతండ్రి అయితేం? మనకు ద్రోహం చేసేటప్పుడు! మనం అంతా ఒక్కటే. కష్టానికి, సుఖానికి మనతో పాటు ఉన్నవాడే మనవాడు. దేశముఖు చంక కింద ఎవడు దూరినా, వాడు మనకు శత్రువే. కులమేదయితేం? బీదవాళ్ళంతా ఒకటే!

**సుభాన్** : అంతే! మనమంతా ఒక తల్లిబిడ్డల్లాగా ఉండాలి. ఉంటే అంతా ఉంటాం, పోతే అంతా పోతాం.

(మస్తాన్ ప్రవేశం)

**మస్తాన్** : (దాదా వైపు జూసి) సలాం ఆలీకం.

**దాదా** : ఆలీకం సలాం.

**మస్తాన్** : ఓయ్. ఈ గొల్లాయనకూడా ఇక్కడి కెప్పుడో వచ్చాడే!

**యల్ల** : తిరణాల్లో ఏమన్నా తేరగా వస్తే నూక్కు పోదామని వచ్చా.

(మస్తాన్ యల్లమంద వైపు కోరచూపులతో చూస్తూంటాడు.)

**దాదా** : మస్తాన్! ఎందుకు పాపం యల్లమందను గొట్టావట? అతను లబ్బున ఏడుస్తున్నాడు.

**మస్తాన్** : వాడి వేషాలు నీకేం తెలుసు? కాలు కదిపితే వీడి మంద దొరగారి పొలాల్లో తిరగాలీ? దొరగారి కవసరమై ఒక మేక పిల్లను తీసికెల్తే ఏం? వీడి అమ్మా మొగుడు సొమ్మంతా పోయిందా?

**దాదా** : తీసికెళ్తే తీసుకెళ్ళావ్‌లే. ఆ దేవరపోతునే తీసుకెళ్ళడ మెందుకు?

**మస్తాన్** : దేన్ని బట్టుకున్నా దేవరపోతే అంటాడు. వాడికేం ఎన్ని అబద్దాలైనా ఆడతాడు.

**యల్ల** : తల్లి సిగదరగ, తెల్లారి లేస్తే నా కదే కూడు మరి.

**సుభాన్** : అతని ఇష్టమైతే ఇస్తాడు. లేకపోతే లేదు. అసలు కొట్టడానికి ఈయ నెవరంట?

**మస్తాన్** : చాల్లే, దయగల మొనగాడివి బయల్దేరావ్, నీ పాటి నాకూ తెలుసు.

**సుభాన్** : ఏంటి నీకు తెలిసింది, గొల్లాయన్ని గూబ అదరగొట్టడమా?

**మస్తాన్** : నేను గాబట్టి అంతటితో పోయింది. ఇంకొకడైతే.

**సుభాన్** : ఏం అయితే?

**మస్తాన్** : దొరకు జెప్పి నిలువునా వీడి తిత్తి ఒలిపించే వాడు.

**యల్ల** : అబ్బో! ఈ ధర్మతండ్రికి పేదోళ్ళమీద ఎంత దయ?

**మస్తాన్** : చూడవయ్యా వీరారెడ్డీ, చూడు, వీడి తల్లో ఎంత పొగరుందో.

**యల్ల** : దొరగారి గడీలో తేరగా తింటంటే పొగరెక్కింది నాకు!

**మస్తాన్** : (పండ్లురుముతూ) ఖబడ్దార్.

**యల్ల** : తస్సదియ్య నక్కను జూసినాడల్లా యేటగాడే. గడీలో అడుగు బొడుగు ముడుసులేరక తినేవాళ్ళు కూడా పెద్ద మొగోళ్ళే.

**మస్తాన్** : ఏమిటిరా యిప్పుడు కూసినకూత, భోసడిక (అంటూ యల్లమంద మీదికి వస్తాడు).

**వీరా** : (అడ్డంవచ్చి) ఏం? లోకువోడనా మరీ మీదకెల్లన్నావ్? కాస్తి మర్యాద దక్కించుకోవాలి.

**మస్తాన్** : మధ్య నీవెవడవోయ్ అడ్డం రావడానికి? అసలు నీకేం సంబంధం?

**వీరా** : నాకు సంబంధం ఉంది. ఇవ్వాళ అతన్ని గొట్టావ్ రేపు నన్ను గొడ్తావ్?

**యల్ల** : ఇక కొట్టాలిసిందే మూడు ముంతలు.

**మస్తాన్** : ఇట్లాగే వాగుతా ఉంటే కొడ్తానా కొట్టి చూపిస్తానా?

**సుభాన్** : ఏమిటి పిడకలా?

**దాదా** : (మస్తాన్ చేయిపట్టుకొని లాగుతూ) నీ దారిన నీవు పోరాబాబూ, ఎందుకొచ్చిన పీడ.

**మస్తాన్** : (చేయి విదిలించుకుంటూ సుభాన్‌వైపు చూచి కోపంగా) థూ, నీ బతుకు తగలెయ్య, పుట్టావ్, ముసల్మాన్ పుటక. (గబగబా వెళ్ళిపోతాడు).

**యల్ల** : ఇక తోలుదుగానిలే రాళ్ళచేలో గుంటక.

**దాదా** : ఓరి నీ వెర్రిగాల, ఊరుకో. ఈ మంటమీద దొర దగ్గరికిబోయి ఈ కాస్తికే గంపంత చేస్తాడు. ఇదెట్టాగూ చిలికి చిలికి గాలివానవుద్ది.

**యల్ల** : ఏమయితే? కానియ్. చెడ్డ చేనికి మూడు మంచెలా ఏందే?

**సుభాన్** : అయితే అయింది. ఈసారి ఐసాపైసా తేల్చుకోవాల్సిందే.

**వీరా** : ఔను మరి. ఎన్నాళ్ళని ఓపికపడతాం? వంగినకొద్దీ నెత్తికెక్కి తొక్కుతూ ఉంటే!

**దాదా** : ఏమో నాయనా!

**వీరా** : మరేం భయంలేదు దాదా! మనమంతా ఇలా కలిసికట్టుగా ఉంటే వాడు చేసి చచ్చేదేంలేదు.

**యల్ల** : ఏంది సిన్నయ్యా, సావుకు రెండు సావులా ఏందే?

**దాదా** : సరే కానీయండి. అయ్యేదేదో అవుద్ది. అన్నిటికీ అల్లాయే ఉండాడు. (అంతా బయల్దేరబోతూ ఉంటారు. యల్లమంద గొంగళి, ముంత సర్దుకుంటూ ఉంటాడు. ఇంతలో తలగుడ్డ జుట్టుకుంటూ హడావిడిగా రామిరెడ్డి ప్రవేశం).

**రామి** : పిరికినాయాళ్ళు కుక్కల్లాగా పారిపొయ్యారు. నుంచుంటే తెలిసేది. వాళ్ళ పస నా పస.
(దాదా, సుభాన్, యల్లమందలు ఎగాదిగా రామిరెడ్డివైపు చూస్తూ ఉంటారు).

**వీరా** : ఏమిటి రామిరెడ్డీ! ఎవళ్ళూ పారిపోయింది?

**రామి** : ఎవళ్ళు జచ్చారు? ఆ అడవా రకమే. మన దేశముఖు ముఠా.

**సుభాన్** : ఇంతకూ అసలు జరిగిందేమిటి?

**రామి** : ఏముంది? కొట్టి పారిపొయ్యారు, ముండల్లాగా.

**దాదా** : అసలు నీవు ఆ లుచ్చాల జోలికెందుకు పోయావు బాబూ?

**రామి** : ఏముంది? ఇవ్వాళ ఆ గాడిదకొడుకులంతా తప్పతాగి ఉన్నారు. ఆ దుకాణాలు దాటేసరికి అమ్మాయి వెనకమాల జేరి, నోటికొచ్చిన పిచ్చి కూతలల్లా కూస్తున్నారు. తీరా వెనక్కి తిరిగి చూద్దునుగదా – వీళ్ళు, ఆమోయిన పక్కనున్న బండి వసికొయ్య పీకి వెంటతగిలా. పారిపోతా పారిపోతా చేతగాని నాయాలెవడో రాయి విసిరాడు. (అంటూ తలమీద చేయిబెట్టి చూపుతాడు).

**సుభాన్** : (రామిరెడ్డి తలగుడ్డ తీసి చూస్తూ) అరే! పెద్దగాయం కూడా పడిందే!

**యల్ల** : అమ్మో, గాయమే!

**రామి** : నెత్తురు కూడా కారింది. బండికాడి కెళ్ళాక నెత్తురంతా కడిగి అక్కయ్య గుడ్డమసి పెట్టింది.

**దాదా** : ఇంకా నయం, అసలు నవరగంతకే తగలాలిసింది; కాస్తలో తప్పిపోయింది. మరీ మనూళ్ళో సైతాను రాజ్యం అయిపోయింది.

**యల్ల** : దెబ్బ దేందిలే? ఇయ్యాల తగిల్తే రేపు మాస్తది. అడాలోళు అచ్చోసిన

ఆంబోతులకుమల్లే ఆడోళ్ళమీది కూడా ఎగబడుతుండ్రి. ఇంకెందుకంట బతికి?

**సుభాన్** : నిజమే యల్లమందా! పరువుబోయాక ఇంకా బతికెందుకు?

**వీరా** : అయితే ఇంకేం? పరువుగా బ్రతకాలంటే, అంతా సంఘంలో చేరతాం అని ప్రమాణం చేయండి.

**సుభాన్** : తప్పకుండా మనం అంతా సంఘంలో చేరాలిసిందే. రేపటి నుంచి ఇల్లిల్లు తిరిగి అందర్నీ సంఘంలో చేర్పించాలిసిందే.

**యల్ల** : ఓ నేనూ సంగం బడతా.

**దాదా** : పదిమందితో చావు పెళ్ళిలో సమానం. మీతోపాటు నేనూ; కానీయండి.

**వీరా** : బోలో; ఆంధ్రమహాసభకీ జయ్!

తెలుగు బిడ్డా మేలుకోవోయ్,

నైజాము

తెలుగుబిడ్డా లేచి రావోయ్ ॥తెలుగు॥

బందగీ రక్తంబు చింది జ్వాలై లేచి

జాగీరుదారులను ఊగించి వేసింది ॥తెలుగు॥

రుద్రమాంబ ప్రతాపరుద్రులకు వారసుడ

పౌరుషము చూపి పరువు నిలబెట్టరా ॥తెలుగు॥

ఈ భూమి నీదెరా ఈ గనులు నీవెరా

ఎవడు ఈ నైజాము – ఎవరు ఈ దొరలంతా ॥తెలుగు॥

మాడి చచ్చేవారి మతములన్నీ ఒకటె

కొంపలార్చేవారి కుట్రలో పడబోకు ॥తెలుగు॥

కదిలించి బలగాన్ని ఎదిరించి వైరులను

శక్తి చూపించగల సమయమిదే లేలెమ్మ ॥తెలుగు॥

# 2

# దివాణం

(రెండు కుర్చీలు, ఒక డ్రాయరు, ఒక బెంచీ ఉంటాయి. మంగలి రాముడు ముందుగా వచ్చి, బల్లలు వగైరా తుడిచి సర్దుతూ ఉంటాడు. తెర లేస్తుంది. మస్తాన్ ప్రవేశం).

**మస్తా** : దొరగారున్నారా?

**రాము** : సలాం, సలాం, మత్తానయ్యా!

**మస్తా** : దొరగారేం జేస్తున్నారు?

**రాము** : అరుగో వత్తన్నారు.

(మస్తాన్ ఒక ప్రక్కకు రాముడొక ప్రక్కకు తప్పుకుంటారు. దేశముఖు జగన్నాథరెడ్డి ప్రవేశం. కోరమీసం, కాళ్ళకు బూట్లు, షేర్వానీ, షుర్వాల్ (చుడీదార్ పైజమా), నల్లటోపి (fur cap) చేతిలో సన్నటి వెండి పొన్నుకర్ర).

**మస్తా** : (నేలకు వంగి) ఆదాబ్ మారాజ్, ఆదాబ్.

**జగ** : ఏం? అక్కడనుంచేనా? (అంటూ కుర్చీలో కూర్చుంటాడు. రాముడు డ్రాయరు కిందగా వంగి దేశముఖు కాలిబూట్లు ఊడదీస్తూ ఉంటాడు).

**మస్తా** : జీ హాఁ సర్కార్! అక్కడినుంచే, ఆ గోరీ దగ్గరనుంచే బరాబర్ వస్తన్నా.

**జగ** : (సిగరెట్ కాల్చుకుంటూ) ఏం, ఎలావుంది? జనం ఏమాత్రం వచ్చారు?

**మస్తా** : రాకేం? పెద్ద ఉర్సులాగా సాగింది. ఎక్కడ చూచినా మనూరివాళ్ళే.

**జగ** : ఏమిటి? మనూరివాళ్ళా? చాటింపు వేయలా వెళ్ళగూడదని?

**మస్తా** : ఎందుకేయలా? మొన్ననే వేయించాం.

**జగ** : అయితే ఎలా వెళ్ళారు?

**మస్తా** : చాటు చాటుగా జచ్చారు.

**జగ** : ఆఁ అంత పొగరు దిగిందా వీళ్ళకీ?

**మస్తా** : ఎంతపొగరు దిగందే ఆ వీరారెడ్డి బండి గట్టుకొచ్చాడూ చెల్లెల్ని ఎక్కించుకొని.

**జగ** : వాడా? ఆ వెధవ! నరిసిరెడ్డి కొడుకు?

**మస్తా** : అసలు కథానాయకుడే ఆయన. పోయేవాడు తాను పోక ఇంటింటికీ తిరిగి అందర్నీ రేపెట్టి తీసికెళ్ళాడు.

(రాముడు బూట్లూడదీసి దులిపి అక్కడే పెట్టి లోపలికెళ్ళిపోతాడు).

**జగ** : ఏమిటి? నేను వద్దని చాటింపు వేయించడం, వీడు అందర్నీ తీసుకెళ్ళడమూనా? తేల్చుకుంటా వీడి హాజమేమిటో?

**మస్తా** : మరీ నీల్గి చస్తున్నాడు లెండి నాల్గచ్చరాలు వచ్చని.

**జగ** : వాడెంత, వాడిబిసాదెంత? నాలుగు తంతె సరి కోటకుబిల్చి. జావ్, బులావ్, పట్వారీకొ.

**మస్తా** : అచ్ఛా సాబ్ (సలాం చేసి వెళ్ళిపోతాడు).

(రాముడు గ్లాసులు, సారా సీసా తీసుకొచ్చి టేబిల్ మీద ఉంచుతూ ఉంటాడు. పోలీసు ప్రవేశం).

**పోలీ** : అదాబ్ మారాజ్. అమీన్‌సాబ్ వస్తా ఉన్నారు.

**జగ** : అచ్ఛా అచ్ఛా (దేశముఖు లేచి నుంచుంటాడు. అమీన్ ప్రవేశం) ఆదాబ్ అర్జ్‌హై.

**అమీ** : ఆదాబ్ అర్జ్ హై.

**జగ** : ఆయియే. తషరీఫ్ రఖ్కియే. (షేక్ హేండ్ యిచ్చి తీసుకోనిచ్చి తాను కూర్చుంటూ అమీన్‌ను కూర్చోమని సైగ జేస్తాడు.)

**అమీన్** : (కూర్చుంటూ) క్యా మహరాజ్, మాకీ తిరణాల్కి వచ్చి మూడురోజూ హయిపోయింది. బేగీ పోవాలీ.

**జగ** : అప్పుడే వెళ్తారా? ఉండండి రేపు వెళ్ళొచ్చు.

**అమీన్** : మీకీ హేప్టీ అయ్యా మహరాజ్. హిక్డా ఆరామ్‌గా కూచోని

మాటాసేస్తావ్. మాకి రేపూ నల్గొండ వెళ్ళాలి.

(రాముడు సారా గ్లాసుల్లో పోసి, ఇద్దరి ముందు పెడతాడు. ఇద్దరూ చెరొక గుక్కా తాగి, సిగరెట్టు కాలుస్తూ, మధ్య మధ్య తాగుతూ ఉంటారు.)

**జగ** : నిన్నటినుంచి మీరు తిరుణాల్లోనే ఉన్నారు. ఇవ్వాళ తప్పకుండా మీరిక్కడ ఉంటారని, గానా బజానా కూడా ఏర్పాటు చేశాను.

**అమీన్** : నహీఁ మహరాజ్ నహీఁ. ఈ దఫా మాకీ సర్కారీ పని హుంది. మళ్ళీ వస్తాన్. హిక్డా హయిదు రోజూ మఖాం చేస్తాం.

**జగ** : సరే, మీ యిష్టం.

**అమీన్** : మరి హేమ్టి మాదీ మాట?

(రాముడు ఇద్దరి ప్రక్కన నుంచుని విసురుతూ ఉంటాడు)

**జగ** : (ముసిముసి నవ్వులు నవ్వుతూ) దానికేంలెండి. (జేబులో నుంచి రెండువందల రూపాయల నోట్లు తీసి ఇవ్వబోతాడు).

**అమీన్** : హేమ్టి ఇది? మాకీ బిక్షం హిస్తుండావ్?

**జగ** : ఈ సారికి ఇలా పోనివ్వండి.

**అమీన్** : హేమ్టి మాటసేస్తావ్ మహరాజ్. నీకీ మాది హెంతా మదద్ ఇచ్చాం. హప్టే మర్సిపోయావ్.

**జగ** : ఎంత మాటన్నారు? ఏదో ఈసారికి ఇలా పోనీయండి. మళ్ళీ వస్తారుగా!

**అమీన్** : వస్తాం, చస్తాం, కోన్ జాన్తాహై? హవ్డామాట హప్డే.

**జగ** : దీనితో సరిపుచ్చుకుందురూ. అప్పుడే మా పని అయిందా? రేపు మళ్ళీ సర్కిల్ కిచ్చుకోవాలి. పుడ్తాహసీల్దార్ కిచ్చుకోవాలి. దువ్వం తాలూక్దార్ గారింట్లో పెండ్లికి నజరాన చెల్లించుకోవాలి. ఈ నెల్లోనే అవ్వల్ తాలూక్‌దార్‌గారు మా ఇలాకాకు షికార్ కూడా వస్తున్నారు, వారికి జల్సా చేయాలి. సుబేదార్‌గారు దౌరాకు బయల్దేరితే, ఎంతలేదన్నా మాకు అయిదారువేల రూపాయలు ఖర్చవుతాయి. మేం మాత్రం ఎన్నని యిచ్చుకుంటాం?

**అమీన్** : అవ్వల్ తాలుక్దార్కీ, దువ్వం తాలూక్దార్కీ హిస్తే మాకీ ఏం ఫాయిదా? మాదీమాటా మాకీ చెప్పాలిగాని.

**జగ** : మీరు కూడా మా యిబ్బంది కనిపెట్టకపోతే ఎలా? సరే కానీయండి. (మరో వందరూపాయల నోటుతీసి మొత్తం మూడువందల రూపాయలు యివ్వబోతాడు).

**అమీన్** : హిబ్బందీ మట్టీ, మీకీ హేమ్టీ. హింతా పెద్దా దేశ్‌ముఖ్ ఉండావ్. పైనా మీకీ పోలీస్ పటేల్ గిరీ హుంది. మాలీపటేల్ గిరీ ఉంది. సాల్‌కీ ముప్పైవేల్, నల్భైవేల్ ఆమ్‌దనీ (ఆదాయం) హుంది. పైనకొట్టే లంచం కొడ్తానే హుండావ్. మాకీ హొక్టీ వెయ్యా హిచ్చేందుక్కా హెన్కా ముందూ సేస్తుండావ్ క్యా మహరాజ్?

**జగ** : మీరలాగే అంటారు. కాని మా దివాణం ఎంత ఖర్చుందో మీకేం తెలుస్తుంది? ఎంత చెట్టుకు అంతే గాలి.

**అమీన్** : కాస్తీపన్కీ, కూస్తీపన్కీ, మాదీ మదద్ కావాలి. (కొంచెం ఆలోచించి) దాన్కీ నామ్ క్యాహై? ఆఁ హెంకమ్మా హెంకమ్మ గడీకి పిల్చి మీరూ దాన్కి పట్కోని హంగామా సేస్తే హప్డూ హదీ చచ్చిపోయింది. దాన్కీ కేసులో మీకీ మదద్ సేసినందుక్కా నాదీ నౌకరీ పోవడాన్కీ తయారయింది. హేమ్టుండి, మంచీకి మంచీలేదు. అచ్ఛా. ఈదఫా చూస్తామ్. (అంటూ బెదిరించి కుర్చీలోనుంచి లేవబోతాడు).

**జగ** : (అమీనును కుర్చీలో కూర్చోబెడుతూ) అది కాదంటున్నానా సరే. చూస్తానుండండి. (అంటూ లోపలికెళతాడు). (అమీన్ సారా త్రాగుతూ ఉంటాడు. దేశముఖు ప్రవేశం).

ఖర్చులో ఉన్నాను గాబట్టి అలా అన్నాను గాని లేకపోతే యేం ఉందిలెండి. (మొత్తం వెయ్యి రూపాయలు యిస్తూ) మీ సహాయం మా కెప్పుడూ అవసరమే.

**అమీన్** : (తీసుకొని షేర్వానీ జేబులో పెట్టుకుంటూ) అచ్ఛా మహరాజ్, మీకీ హండా మాదీ, మాకీ హండా మీది! వస్తాన్ ఆదాబ్ అర్జ్ (అంటూ కుర్చీలోంచి లేస్తాడు).

జగ : ఆదాబ్ ఆర్జ్. అరేయ్ రాముడూ! అమీన్ సాహెబ్‌గారు వెళ్తున్నారు గాని వెట్టివాణ్ణి బండివెంట వెళ్ళమని చెప్పరా.

రాముడు : సిత్తం దొరా.

(అమీన్ సాహెబ్, రాముడు వెళ్ళిపోతారు. దేశముఖు గ్లాసులో సారా బోసుకొని ఒక్కొక్క గుటకే తాగుతూ ఉంటాడు. పట్వారీ వెంకట్రావు, మస్తాన్‌ల ప్రవేశం. వెంకట్రావు కట్టుపంచ, చొక్కా, దానిపైన పాతకోటు, ఎర్రటి గళ్ళుగల తలగుడ్డ. బుజాన ఒక చిన్న తుండు, కాళ్ళకు పాపోసులు (ముచ్చెలు) చంకన దస్త్రం, కళ్ళకు జోడు, దేశ ముఖు, పట్వారీలు పరస్పరం నమస్కారాలు చేసుకుంటారు. పట్వారీని కూర్చోమని దేశముఖు సైగజేస్తాడు. వెంకట్రావు బల్లచివర కూర్చుంటాడు. మస్తాన్ నుంచోనే ఉంటాడు).

జగ : ఏమయ్యా, మనం చాటింపు వేయించినా లెక్కజేయకుండా వీళ్ళంతా ఉరుసు కెళ్ళారటగా?

వెంక : ఔను వెళ్ళారు చాటుచాటుగా దొంగ వెధవలు.

జగ : అయితే నీవేం జేస్తున్నావ్, కండ్లు మూసుకుని జపం చేస్తున్నావా?

వెంక : కాదు, దానికి తగిన ప్లాను ఆలోచిస్తున్నాను. (ముసిముసి నవ్వులతో) కళ్ళు మూసుకొని నిద్రబోయే ఘటమేనా ఇది?

జగ : ప్లానట! ప్లాను! దీనిక్కూడా ఒక పెద్ద ప్లానా? ఒక్కొక్కణ్ణి పిల్చి పిక్కలిరగ తన్నేదానికి.

మస్తాన్ : దొరవారు భలేమాట చెప్పారు. దెబ్బకుగానీ దెయ్యంవదలదు. లేకపోతే గుడ్డిగవ్వ ఖరీదు చేయని గొల్ల యలమందాయకూడా నా కెదురు తిరిగితే!

జగ : ఏమిటి? గొల్లోడు? గొల్లోడా ఎదురు తిరిగింది? బులావ్ గాడిదని... జావ్.

(మస్తాన్ సలాం కొట్టి సంతోషపడుతూ వెళ్ళిపోతాడు)

ఏం? వీరారెడ్డి మరీ పొగరు దిగి ఏడుస్తున్నాడటగా?

వెంక : ఔను, అసలు నాయకుడే అతను. ఇంటింటికి తిరిగి అందర్నీ సంఘంలో చేర్పిస్తున్నాడు.

జగ : సంఘం? సంఘమా? నా ఊళ్లో సంఘం బెట్టాడా?

వెంక : సంఘం బెట్టడమేమిటి? వాడింటిమీద ఇవ్వాళ జండా కూడా వెలిసింది.

జగ : అయితే ఇప్పుడుదాకా నీవేం జేస్తున్నావ్? ఎందుకు పీకించలా?

వెంక : పీకించేవాణ్ణే. కాని...

జగ : కాని.

వెంక : కాని, ఇదివరకంతటి తేలికకాదు. వ్యవహారం కొంచెం బెడిసింది.

జగ : ఏం?

వెంక : ఊరంతా ఏకమయ్యింది.

జగ : (కోపంగా) ఆఁ!

వెంక : కాపు, రెడ్డి, చాకలి, మంగలి సాహెబులు – చివరకు మాలమాదిగలు కూడా సంఘంలో చేరారనుకోండి.

జగ : ఏడ్చారు. గుడ్డికన్ను మూస్తే ఎంత, తెరిస్తే ఎంత? రేపీపాటికి ఒక్కొక్కణ్ణి నరికి పోగులేస్తాను. చూడు నా దెబ్బ.

వెంక : మీరు తల్చుకుంటే అంతేగాని, అదేం పాపమో ఈ సంఘం నాగజెముడు (పాము పడగచెట్టు) పురుగులాగా దేశమంతటా వ్యాపించిపోతూ ఉంది. ఏ ఊళ్ళో జూచినా ఇప్పుడిదే గోల. తీగలాగితే డొంక కదిలేటట్టుంది.

జగ : ఈ కుక్కలెన్ని మొరిగితే ఏముందయ్యా? (చిరునవ్వు నవ్వుతూ)పై నుంచి కిందిదాకా అసలు సర్కార్ మన చేతిలో ఉంది.

వెంక : అందుకనే. ఆ చేసే పనేమిటో వాళ్ళద్వారానే చేయిస్తే పీడాబోతుంది.

జగ : అదెట్లా?

వెంక : ఉందిగా, లెవీ సమస్య.

జగ : ఆఁ ఉంటే!

వెంక : అది సర్కారు పని. వాళ్ళకీ వాళ్ళకీ ముడిబెడదాం. మనం హాయిగా

ఒడ్డున గూర్చొందాం. తర్వాత కాగలపని గంధర్వులే తీరుస్తారు.

**జగ** : షహబాష్, మొత్తానికి కరణం బిడ్డవనిపించావయ్యా. బట్టతలకి మోకాలికి బలేగా ముడిబెట్టావ్.

(అంటూ సారా గ్లాసు వెంకట్రావ్ చేతికందిస్తాడు)

(రాముడు ప్రవేశం)

**వెంక** : (గ్లాసు తీసుకొని ఒక గ్రుక్క తాగి) ఈ ఘటానికి ఇలాంటి దొక లెక్కా? దొరవారి దయ ఉండాలి గాని....

(మస్తాన్, యల్లమందల ప్రవేశం. మస్తాన్ సలాం జేసి, ఒక ప్రక్కన నుంచుంటాడు. యల్లమంద వంగి దండంబెట్టి చేతులు గట్టుకొని ఒక మూల ఒదిగి ఉంటాడు.)

**జగ** : అరే రాముడూ! నీవు పోయి రైతుల్ని పిల్చుకురా (రాముడు సిత్తం దొరా, అంటూ దణ్ణంబెట్టి వెళ్ళిపోతాడు.)

**వెంక** : ఏంరా యల్లమందా, దొరగారికేటా నీవిచ్చే గొంగళ్ళెన్నిరా?

**యల్ల** : అయిదు బాబయ్యా.

**వెంక** : మరి ఈయేడెన్ని ఇచ్చావురా?

**మస్తాన్** : వాడి పని ఇచ్చేటట్టుందా ఇప్పుడు?

**యల్ల** : అదేందయ్యో మత్తానయ్యా అట్టంటావ్. అప్పుడే మూడిత్తినిగా.

**జగ** : తత్తిమా రెండెవడిస్తాడురా మదచ్చోద్. నీ తాత గాడిస్తాడా?

**యల్ల** : (దండం బెడుతూ) ఇచ్చుకుంటా దొరగారూ ఇచ్చుకుంటానండీ.

**మస్తాన్** : ఇంకా ఎప్పుడో ఇస్తాడంట ఒక పక్కన అప్పుడే ఉగాది పండగ వస్తా ఉంటే.

**యల్ల** : ఇచ్చుకుంటానులే బాబూ. ఈ నెల్లోనే ఇచ్చుకుంటా. దొరగారి మామూలు తప్పుద్దా.

**వెంక** : సరేగాని మందనెక్కడ ఆపుజేస్తున్నావురా?

**యల్ల** : నిరుడు పుల్లరికి డబ్బు దొరక్కపోతే యీరారెడ్డిగారి దగ్గర తీసుకొన్నా దొరా. ఆ డబ్బుకింద నిన్నా యియ్యాల ఆరి చేలోనే కుదరేసిన్నండి.

**మస్తాన్** : అరే లుచ్చా. ఎవణ్ణి అడిగి తోలావురా వీరారెడ్డి పొలంలోకి?

**యల్ల** : (దేశముఖుతో) రెణ్ణాల్లు దోత్తే ఆ బాకీ తీరద్ది అని పోయిన్నయ్యా. ఇయ్యాల దొరగారి చేలోకే పోనిత్తండాగా!

**మస్తాన్** : (వెంకట్రావ్‌తో) వీరారెడ్డి వాళ్ళ సంఘం పెద్ద గదా! అందుకని తోలాడులెండి.

**వెంక** : ఏంరా! సంఘంలో జేరబట్టేనా మస్తాన్‌ను గొట్టావట.

**యల్ల** : నేనా కొట్టింది! రామరామ. ఆయనే నన్ను కొట్టిండండి!

**వెంక** : తన్నులు దింటావ్. మాదచ్చోద్. నిజం జెప్పు.

**యల్ల** : అమ్మతోడండి. ఏ ఒట్టు బడితే ఆ ఒట్టు (దండం బెడుతూ) మాదేవర తోడండి.

**వెంక** : ఇంతకూ నీవసలు సంఘంలో చేరావా లేదా?

**యల్ల** : (చేతులు నలుపుకుంటూ బిక్కమొగం వేసి) నేనా అండీ సంగంలోనా అండీ... నేనా...

**మస్తాన్** : నీవేరా భోసడీక.

**యల్ల** : ఉఁ... ఉఁ... లే... లేదండి.

**వెంక** : అరె బద్మాష్. అబద్ధం ఆడుతున్నావ్, చెప్పు నిజం.

**జగ** : (గుడ్లెర్రజేసి) ఏయ్ మస్తాన్, ఊఁ (యల్లమందను కొట్టమని సైగ జేస్తాడు.)

**మస్తాన్** : (చొక్కా చేతులు పైకెగదీస్తూ) ఏమిటిరా లుచ్ఛా (చెంప బగలేసి) చేరలేదురా?

**యల్ల** : (దండం బెడుతూ) చేరిన్నండి దొరగారూ చేరిన్నండి. అందరూ చేరతంటే నేనూ చేరిన్నండి.

**జగ** : చేరావ్ లమ్డికె. చేరావ్.

**వెంక** : కట్టు గాడిద యాభై రూపాయల జరిమానా కట్టు.

**యల్ల** : పిల్లలు గలాణ్ణి సచ్చిపోతా. అసలే కరువు రోజులు బాబయ్యో. మీ పాదాలకు మొక్తా మీ బానిచోణ్ణి.

**వెంక** : (కాగితం మీదరాస్తూ) అయితే ఈ మాట కొప్పుకో.

**యల్ల** : ఏంది బాబూ?

**వెంక** : ఏముంది? "సంఘంలో చేరకపోతే చంపుతా మన్నారనీ, లెవీ ఎగొట్టమన్నారనీ" ఒప్పుకో. నీ జరిమానా మాఫ్‌చేస్తా.

**యల్ల** : రామ రామ. ఆ పాపం నేనెట్ట మూటగట్టుకోనండి? వారట్టనలేదండీ.

**జగ** : మస్తాన్! లోపలికి దీసికెళ్ళి వీణ్ని స్తంభానికి గట్టేసి బొమికలిరగదన్ను. అప్పుడుగాని ఈ గాడిదకి బుద్ధిరాదు.

(మస్తాన్ యల్లమందను మెడబట్టి లోపలికి గెంటుకెళతాడు. తెరలోనుంచి 'ఒప్పుకో ఒప్పుకో' అనే మస్తాన్ మాటలతోపాటు కర్రదెబ్బల ధ్వని, 'అమ్మో బాబో, చచ్చాన్రో నాయనో' అనే యల్లమంద ఆర్తనాదం వినబడుతూ ఉంటుంది).

**యల్ల** : (తెరలో) ఒప్పుకుంటానండి చంపకండి బాబో! మీ పాదాలకు మొక్తా. పిల్లలు గలాణ్ని. మీరు జెప్పినట్టే చేత్తా.

(దేశముఖు, పట్వారీలు వికటంగా నవ్వుతూ ఉంటారు. యల్లమందతో మస్తాన్ ప్రవేశం).

**వెంక** : ఆఁ-రా, ఈ కాగితం మీద అంగుష్టం వెయ్.

**మస్తాన్** : వెయ్ భోసడిక (అని చేయెత్తుతాడు, యల్లమంద వేలు ముద్ర వేస్తాడు). ఖబడ్దార్, వల్లు దగ్గిర బెట్టుకొని బతుకు పో, (యల్లమంద ఏడుస్తూ వెళ్ళిపోతూ ఉంటాడు). ఈ మధ్య వీడికి కాస్త వల్లు చిమచిమలాడింది.

**వెంక** : వీడిదేముంది? అసలాళ్ళంతా ఇంకా అలాగే ఉన్నారు.

**మస్తాన్** : ఇయ్యాళ్ళ ఒక్కొక్కడు నెత్తురు కక్కాలి రాని.

**జగ** : కానీ, నీ యిష్టం వచ్చినట్లుగానీ, నేను మళ్ళీ ఇప్పుడే వస్తాను. (దేశముఖు లోపలి కెడతాడు).

**వెంక** : రాము డెళ్ళి చాల సేపయిందే. రైతులింకా రాలేదు.

(అంటూ పొగచుట్ట ముట్టించి కాలుస్తూ ఉంటాడు.)

**మస్తాన్** : దొరలు. వాళ్ళ పని ఇప్పుడు పిలిస్తే వచ్చేటట్టుందా?

**వెంక** : అందరిమాట అలా ఉంచు, నీ తమ్ముడు కూడా అందులోనే కలిశాడటగా?

**మస్తాన్** : ఎందుకు కలవడు కాఫిర్ ముండా కొడుకు? ఆ వీరారెడ్డితో దోస్తీ

ఊరికే పోద్దా? (ప్రక్కను జూచి) అరుగో దిగుతున్నారు, దొరలు. (వీరారెడ్డి, రామిరెడ్డి, సుభాన్, దాదాల ప్రవేశం).

**దాదా** : సలాం మారాజ్.

**వెంక** : నూర్చుకుని యింట్లో పోసుకోగానే సరిపోయిందీ? ఎన్నిసార్లు కబురు పంపినా ఒకళ్ళూ లెవీ ఇవ్వరు.

**వీరా** : అసలు పండితేనా నూర్చి ఇంట్లో పోసుకోవడానికి?

**వెంక** : అదేమిటయ్యా వీరారెడ్డీ, చదువుకున్న వాడివి నీవుకూడా అలా మాట్లాడుతావ్. ఏది తప్పినా సర్కార్ లెవీ తప్పుతుందా?

**దాదా** : పండితే ఎందుకియ్యం. ఏటా యియ్యటంల్లేదండీ?

**సుభాన్** : సర్కార్ మాత్రం పండందే ఎట్లా వసూలు జేయమంటారు? (మస్తాన్ తమ్మునివైపు చురచుర చూస్తూ ఉంటాడు.)

**వెంక** : ఆ ఖానూన్ గొడవ నీకేం తెలుసునోయ్! కౌలంటే పాలంటే దొరగారితో పని గనుక, ఏదో ఒక విధంగా జెప్పి కొన్నాళ్ళు నెట్టికెళతాను. ఇదేం అడ్డగోలుగాదు, సర్కారుతో పని.

**రామి** : ఇంకా నెట్టికెళ్ళేదేమిటి? ఆ పండిన నాలుగు గింజలూ కాపలాబెట్టి కల్లం దగ్గిరే గుంజుకెళ్ళారాయె. మాకు మిగిలిందేముంది, పొల్లూ పొలకట్టేగా?

**వెంక** : మిడికావ్ లేవోయ్! అసలు మీరు బుద్ధిపూర్వకంగా యిస్తే ఎందుకు గుంజుకెళతారు? అయినమట్టుకు దిగమింగడమేగా మీ పని.

**సుభాన్** : పూట కూటికి గతిలేదుగాని, మేం దిగమింగి చచ్చేదేమిటి?

**వెంక** : అందాకా ఎందుకు? ముందు నీ మాట జెప్పు. ఆరేండ్ల కింద తీసుకున్న బాకీ నీ వింతవరకు తీర్చావ్?

**సుభాన్** : మా అయ్య జచ్చినప్పుడెప్పుడో ఒక బస్తా గింజలు నాగుకిచ్చావ్.ఆ బాకీకింద యిప్పటికి 14 బస్తాలు జమకట్టాను. ఇంకా 14 బస్తాలు బాకీ ఉందంటావ్. ఈ బాకీ మరి ఎప్పుడు తీరుద్దో ఏమిటో?!

**రామి** : ఒకటే తీరడం. ఇక నీవు జచ్చినప్పుడే తీరేది.

**వెంక** : మొదటే ఎక్కడికి పోయాయి ఈ తెలివితేటలు? ఆవేళ అయ్యోబాబో

అని కాళ్ళావేళ్ళా బడి పట్టుకెళ్ళడం, తీరా యివ్వాళ ఇవ్వాలిసొచ్చే టప్పటికి ఇదీ ఏడ్పు. ఇందులో నేనేమన్నా దగా జేశానంటావా? కావాలంటే నీ వీరారెడ్డితోనే లెక్క చూపించుకో.

**వీరా** : దీనికి లెక్కతో పనేముందిలెండి? ఆరు సంవత్సరాల క్రితం పట్టుకెళ్ళింది బస్తాగింజలు. ఇప్పటికి 14 బస్తాలిచ్చాడు. ఇంకా 14 బస్తాలివ్వాలంటే ఎలా ఇచ్చుకుంటాడు? ఇంతకంటె అన్యాయం యింకేం ఉంటుంది?

**వెంక** : అయితే యింకేం? నీవు మళ్ళీ కొత్తగా ఒక ఖానూన్ తయారుచెయ్.

**వీరా** : ఈ జరిగేదంతా ఖానూన్ ప్రకారమే జరుగుతుందా? పోలీసు అమీనుకు విందు చేయటానికి గొల్లోడి మేక నెత్తుకు రమ్మని ఏ ఖానూన్‌లో ఉంది?

**రామి** : భలేమాట చెప్పావ్. ఇంటికొక బండి ఎరువు ఊరికే వీరికివ్వాలని ఎక్కడ రాసిపెట్టుందో?

**సుభాన్** : (వీరారెడ్డివైపు జూచి) ఏం భాయ్? దున్నే దున్నే అరకలూడదీసిపోయి దొరగారి పొలం దున్నాలని కూడా ఖానూన్‌లోనే ఉందా?

**వీరా** : (వెంకట్రావుతో) ఖానూన్ కేం వచ్చెలెండి. నిరుడు మీ అమ్మాయి గారి పెండ్లికి యింటికి అయిదు రూపాయల చొప్పున వసూలుజేశారు గదా. యింకా ఖానూన్ ఏమిటండీ?

**వెంక** : చాల్లే పోసుకోలు కబుర్లు. తాతలనాటినుంచీ వచ్చే మామూళ్ళు ఇవ్వాళ పొమ్మంటే పోతయ్యా?

**సుభాన్** : వీలయితే ఖానూన్. లేకపోతే మామూల్. ఔనులే, ఎన్ని మామూళ్ళు లేకపోతే, ఇంత మేడ కట్టారు?

**దాదా** : ఎందుకు వచ్చిన పంచాయితీ ఇది సుభాన్? వచ్చిన పనేదో చూసుకోక.

**వెంక** : మీతో నాకెందుకొచ్చిన గొడవ ఇదంతా? ఏమోయ్ దాదాసాయిబూ! మీరంతా రేపు ప్రొద్దున్నే లెవీ ధాన్యం కొలవాలి. లేకపోతే ఇక మాట దక్కదు.

దాదా : కొలవ కేం జేస్తాంగానీ, అసలు పండందే ఏం జేస్తాం?

సుభాన్ : అసలు చెరువులో నీళ్ళు నిలిస్తేనా పండడానికి?

రామి : నిలిచినన్ని నిలుస్తయ్. వారికి చాలుగా. మనం ఏ గంగలోకలిస్తే ఎవరికేం బట్టింది?

వెంక : ఈ పిచ్చిపిచ్చి వేషాలేమీ సాగవ్. వడ్లు పండకపోతే జొన్నలు కట్టండి. జొన్నలు పండకపోతే సజ్జలు కట్టండి.

సుభాన్ : సజ్జలెవడికి పండినయ్ ఈ వూళ్ళో మీకే పండలేదాయె?

వెంక : అయితే, జొన్నలు గట్టండి.

దాదా : ఆ జొన్నగింజలు కూడా బెట్టపదున్నే పడ్డాయ్. అక్కడొక మొక్కా అక్కడొక మొక్కా మొలిస్తే, పండినవాడికి కాసిని వండాయ్: లేనివాడికి అదీ లేదు.

వెంక : బెట్టపదునులో వేయకపోతే పసరపదున్నే వేయకపోయారూ, ఎవడొద్దన్నాడు.

రామి : వద్దని ఎందుకనాలి? కట్టిన అరకల్ని ఊడదీయించి, ఆ పదునున్న నాలుగురోజులూ దొరగారి పొలం దున్నించుకున్నారు చాలదూ?

వెంక : ఏమిటి సోది? ఇన్నిటికీ కడ్తారా? చెంబూ, తప్పాళా బైటేయించాలా?

వీరా : ముందు నిరుడు వసూలుచేసిన మా లెవీ డబ్బు మా కివ్వండి. ఈ యేటి సంగతి తర్వాత చూద్దాం.

వెంక : ఆ డబ్బు ఇన్నాళ్ళుందా ఏమిటి? అప్పుడే ఇచ్చాం వార్ఫండుకి.

సుభాన్ : ఎవర్ని అడిగి ఇచ్చారు?

వెంక : నిన్నడిగి ఇచ్చేదేమిటోయ్? కావాలంటే, పోయి పంచాయితీ దారుల్ని కనుక్కో...

వీరా : అది మా డబ్బు. పంచాయతీదార్లెవరు దాన్ని ఖర్చు పెట్టడానికి?

రామి : ఐతే ఇంకేం? అత్తసొమ్ము అల్లుడు దానం జేశాడన్నమాట!

వెంక : ఎవడో ఒకడు చేశాడు. పోయి సర్కారునడుగు.

వీరా : సర్కారు నడిగేదానికి ఇక్కడిదాకా రావడమెందుకు? పదండి పోదాం. (వీరారెడ్డితోపాటు అంతా బయల్దేరబోతారు)

**వెంక** : ఏం అయితే మీరు లెవీ ఇవ్వరన్న మాటేగా?

**వీరా** : ముందు ఆరువందల యకరాలున్న మీరు గట్టండి.

**వెంక** : (కోపంగా దిగ్గునలేచి) ఏమిటీ?

**సుభాన్** : ఏమిటా? ఆరువందల యకరాలున్న మీరూ, ఇరవైవేల యకరాలున్న మీ దొరగారూ ముందు గట్టండి. తర్వాత మమ్మల్ని అడగండి.

**వెంక** : మా యిష్టం. కడతాం, కట్టం – మీరెవళ్ళురా అడగటానికి?

**వీరా** : మాటలు కాస్త జాగ్రత్తగా రానీ!

**మస్తాన్** : ఏయ్ (అంటూ వీరారెడ్డి మీదకు పోతాడు)

**సుభాన్** : ఖబడ్దార్!

(మస్తాన్ చటుక్కున ఆగిపోతాడు. వెంకట్రావు తెల్లమొగం వేసి వెనక్కి రెండడుగులేస్తాడు).

(తెర పడుతుంది)

# 3

# వీరారెడ్డి ఇల్లు

(వీరారెడ్డి చెల్లెలు కమల ఉయ్యాలతొట్టి నూపుతూ, పాడుతూ ఉంటుంది.)

జోజో సుందరరూపా
జోజో మా కులదీపా ॥జోజో॥
బాలచంద్రుని రీతి రణము
వైరిమూకల నుగ్గుజేసే
భారమున్నది వీరపుత్రా ॥జోజో॥
నీదు తెలుగుజాతి నణచు
నీచులందరి పారద్రోలి
శాశ్వతంబగు ప్రజల రాజ్యం
స్థాపనా చేయాలి నీవే ॥జోజో॥

(పాట పూర్తి అవుతూ ఉండగానే వీరారెడ్డి భార్య సీతమ్మ ప్రవేశిస్తుంది.)

**సీత** : ఈ పిచ్చి పాటలు పాడమంటే ఇక కూడూ నీళ్ళూ ఏం అక్కరలా.

**కమల** : లేం? నీకీ పాట ఏమీ బాగుండలేదా వదినా?

**సీత** : ఆ బాగూ ఓగూ మీ అన్నా చెల్లిలికి తెలియాలి. నాకేం తెలుస్తుందిలే అమ్మా!

(వీరారెడ్డి ప్రవేశం)

**కమల** : (లేచి కోపాన్ని నటిస్తూ) ఏమిటన్నయ్యా, నాకీ పిచ్చి పాటలన్నీ నేర్పావ్?

**వీరా** : పిచ్చిపాటలూ! పిచ్చిపాటలేమిటి?

**కమల** : వదిన అంటల్లా? పిచ్చి యన్నీ నాకు నేర్పి, మంచి పాటలన్నీ వదినకు నేర్పుకున్నావేం?

**సీత** : చాల్లే ఊరుకో....ఈ పిల్లకి మరీ పెద్దా చిన్నా లేకుండా బోయింది.

**కమల** : ఏం అన్నయ్యా! నేర్పవ్ నాకు కూడా?

**వీరా** : నేను నేర్పడమెందుకు, వదిన్నే నేర్పమను.

**కమల** : (జాలిగా బతిమాలుతూ) వదినా, నేర్పవ్?

**సీత** : నోరుముయ్ గాలిపిల్లా!

**కమల** : నీవు నేర్పకపోతే ఆగుతుందనుకున్నావేం? రోజూ నీవు పాడేటప్పుడు నేను వింటల్లా?

**వీర** : అయితే ఇంకేం, పాడు.

(కమలను పాడవద్దని సీతమ్మ మొగం చిట్లిస్తూ వ్రేలు చూపుతుంది)

**కమల** : (వదినవంక జూస్తూ, నవ్వుతూ ఉయ్యాల నూపుతూ)

జో అచ్యుతానంద జోజో ముకుందా

రార పరమానంద రామగోవిందా॥

**సీత** : నోరు మూస్తావా,, లేదా? అసలు నిన్ను....

(అంటూ మీది కెళుతుంది; కమల గంతులు వేసుకుంటూ వదినకు దొరక్కుండా ఉయ్యాలచుట్టూ తిరుగుతూ పాడుతూనే ఉంటుంది. వీరారెడ్డి పకపక నవ్వుతూ ఉంటాడు. పాట అయిపోగానే కమల నవ్వుకుంటూ అన్నచాటున చేరుతుంది.)

**సీత** : మీరుగాదూ, అసలు ఆ పిల్లకింత అలుసిచ్చింది? ఎక్కడికి పోతుందిలే మీ చాలు.

**వీరా** : మా అమ్మాయికి మా చాలు రాక మీ చాలు వస్తుందా?

**సీత** : కనబడతానే ఉందిగా వాదగొండి చాలు.

**కమల** : (అన్నచాటున ఉండే) మాది వాదగొండి చాలయితే మరి మీదో?

**సీత** : అట్టాగే పేలుతా ఉండు. అన్నని అవతలకి పోనీ, చెప్తుతా నీ పని.

**కమల** : కొడ్తావా? కొడ్తే అబ్బాయి నెత్తుకోనుగా!

**సీత** : ఎత్తుకోకపోతే నీ పున్నెమాయెలే. అబ్బాయికి నీ బుద్ధీ నీ అన్న బుద్ధీ అబ్బకుండా ఉంటే అంతే చాలు.

**కమల** : మీ అన్నబుద్ధి రావాలా?

**సీత** : మా అన్న బుద్దే వస్తే బాగానే బతికిపోతాడు.

**కమల** : ఇక రాకరాక మీ చాలే రావాలమ్మా?

**సీత** : (నవ్వుతూ) ఏం? మా చాలు వస్తే నీ కూతురునివ్వవా మా అబ్బాయికి? సరే. ఇవ్వకపోతే మాల్లే.

**కమల** : (సిగ్గుతో తలవంచుకొని) ఛీ ఫో. నీ కెప్పుడీమాటలే!

(అంటూ లోపలికెళ్ళిపోతుంది)

(సీతమ్మ, వీరారెడ్డి నవ్వుతూ కమలవైపు చూస్తూంటారు)

**సీత** : అచ్చంగా అత్తయ్య నడకే.

**వీరా** : అవును. అంతా మా అమ్మే.

**సీత** : అందుకనే అమ్మ కోరిక తీర్చారుగా.

**వీరా** : ఏం?

**సీత** : ఇంకా ఏమంటే ఏం? అమ్మాయి పెండ్లి కండ్లతో చూడాలని పాపం ఎంతో మొత్తుకుంది ఆమె. విన్నారూ మీరు?

**వీరా** : మా అమ్మ చనిపోయేటప్పటికి దానికి పదేండ్లన్నా లేవు. అప్పుడే ఏం పెళ్ళి?

**సీత** : ఇంకా నయం? అమ్మాయి కప్పటికి పదేళ్ళన్నా ఉన్నాయి. నా పెళ్ళి నాటికి నాకారేళ్లేగా?

**వీరా** : అందుకనే ఊరుకున్నావ్. లేకపోతే ఈ దేశాలు పట్టుకొని తిరిగే వాణ్ని చేసుకునే దానివేనా?

**సీత** : చాల్లెండి! ఏంటా మాటలు? ఆడకాడికి మరీ చిన్నపిల్లలై పోతున్నారే?

**వీరా** : ఏముంది? ఉన్నమాట అన్నాను.

**సీత** : మాటల కేమొచ్చె? ఇప్పుడైతే మీరు మట్టుకి చేసుకునే వాళ్ళా ఏమిటి, ఈ చదువురాని పిల్లని! ఎవళ్ళ అదృష్టం ఎవళ్ళు దప్పిస్తారు?

**వీరా** : అట్టే జూస్తే నీక్కూడ మా అమ్మకి బట్టిన చాదస్తమే పట్టినట్టుంది.

**సీత** : మీ కట్టాగే కనబడుతుంది లెండి. అమ్మాయికంటె ఏడేనకాల బుట్టిన పిల్లలందరికీ పెళ్ళిళ్ళయినాయి. ఎంకమ్మ వదినగారి పెద్దమ్మాయి మన కమల తోటిదిగాదూ? దానికొక కూతురు...మళ్ళీ ఇప్పుడు...

**వీరా** : (నవ్వుతూ) ఓహో, కమలకు పెళ్ళిచేసి త్వరగా కోడల్ని చూసుకోవాలని ఉందన్నమాట నీకు.

**సీత** : చాల్లెద్దురూ మీ సరసం; కష్టం సుఖం ఏమీ ఆలోచించరు. ఇంతకూ మీ అమ్మే ఉంటే నాకీ చిక్కే ఉండదు.

**వీరా** : ఏం? ఇప్పుడు వచ్చిన చిక్కేముంది?

**సీత** : ఎన్ని చెప్పినా పరాయి అమ్మగన్న బిడ్డని, ఏ కాస్త లోపం వచ్చినా తలా ఒక మాట నన్నంటారు. మీకేం? మొగాళ్ళు!

**వీరా** : (నవ్వుతూ) పిచ్చిదానా, నింద నీకొస్తే ఒకటీ, నాకొస్తే ఒకటీనా? ఇది తొందరపడితే అయ్యే పనా? తగిన సంబంధం దొరకొద్దూ?

**సీత** : దొరకడానికి అసలు మీ రాలోచిస్తేగా? మీ పనేమో, మీరేమోగాని, ఎక్కడకెళ్ళినా అమ్మలక్కలంతా 'ఇంకా మీ ఆడబిడ్డ నెన్నాళ్ళు అట్టిపెడతారమ్మా పెండ్లి చేయకుండా? ఆయనకి తెలియకపోయినా, నీకన్నా తెలియదా?' అనేవాళ్ళే. ఏం జేయను? తలకాయ వంచుకొని బైటికి రావలసి వస్తావుంది.

**వీరా** : లోకుల కేం, ఎన్నయినా అంటారు. అంతమాత్రాన మనం ఉలిక్కిపడితే ఎలా? సరే, ఈయేడు తప్పకుండా చేద్దాంలే.

**సీత** : మరి ఎక్కడన్నా మాట్లాడారా?

**వీరా** : ఆఁ హుజూర్‌నగర్‌లో.

**సీత** : ఎన్నేళ్ళుంటాయి అబ్బాయికి? ఆస్తి ఏమన్నా ఉందా?

**వీరా** : ఆఁ తిండికీ, గుడ్డకీ ఏం లోపం ఉండదులే. కుఱ్ఱాడు ఖమ్మంలో చదువుతున్నాడు.

**సీత** : ఎట్టా ఉంటాడు?

**వీరా** : అమ్మాయికంటే ఒక చాయ తరుగనే కాని, కుఱ్ఱాడికేం, బాగానే ఉంటాడు.

**సీత** : దాని పాడుగాను, చాయకేం వచ్చెలెండి, కొరుక్కుతింటామా? ముక్కూ మొగం సరిగ్గా ఉండాలిగాని, మాగమాసంలో మంచి లగ్గాలుండయ్యంటగా?

వీరా : అందాకా ఎందుకు? ఆ కుర్రాడు పది రోజుల్లో ఇక్కడికే వస్తాడు.

సీత : అప్పుడే ఇక్కడ కెట్టా వస్తాడండీ? మీదంతా మరీ విడ్డూరం.

వీరా : ఇక్కడే అన్నీ మాట్లాడొచ్చు రమ్మన్నాను. పనిలో పని. అమ్మాయిని అబ్బాయి చూడొచ్చు, అబ్బాయిని మీరూ చూడొచ్చు?

సీత : అదేంటండీ, పెండ్లికొడుకే వచ్చి మాట్లాడుకోవడమేమిటి. వాళ్ళ తరఫున పెద్దాళ్ళెవళ్ళూ లేరూ?

వీరా : ఇది వెనుకటి కాలం గాదు. ఇప్పుడు పెళ్ళిళ్ళంతేలే.

సీత : అవునులే. మీకొక ఆచారం ఉందిగాబట్టి ఇది లేదనా? సరే, ఇది కూడా మీ ఇష్టం వచ్చినట్టే కానియ్యండి. ఎట్టాగో ఒకట్టా ముందా మూడుముళ్ళు పడితే తర్వాత చూద్దాం.

వీరా : ఇందాకా వచ్చినాక ఇంకా ఆగుతుందా? మాఘమాసంలో కాకపోతే చైత్రమాసంలో అవుతుంది.

సీత : ఇంకా నయం చైత్రమంటారు. వైశాఖమంటారు. ఆ పిల్లనెత్తిన ముందా చిట్టెడు గింజలు పడేదాకా నాకేం తోచదు.

వీరా : ఏం?

సీత : ఇంకా ఏమంటారేమిటి? మొన్న తిరుణాల్లో ఆ సచ్చినాళ్ళు ఎంటబడిన పట్టానికి మన రామయ్యే లేకపోతే మా బతుకేమయ్యేది. నాకు మొదటినుంచీ భయంగానే ఉంది. అందుకనే 'పెండ్లిగాని పిల్లని తీసుకొని తిరణాలకు నేనెందుకండీ?' అని గోలబెట్టా. వినిపించు కుంటేగా?

వీరా : ఆ వెధవలకి జడిసి, ఇంట్లోనే కూచుంటామా, ఎక్కడికీ వెళ్ళకుండా?

సీత : ఏంజేస్తాం కూచోక. దుష్టుడికి దూరంగా ఉండమన్నారు పెద్దలు.

వీరా : ఎక్కడుంటావ్ దూరంగా? లొంగినకొద్దీ మరీ నెత్తికెక్కుతారు. ఆ గాడిద లింటిమీద మాత్రం వచ్చి పడగూడదా? ఇలాంటివెన్ని జరగలా ఇదివరకీ వూళ్ళో.

సీత : ఎందుకు జరగలా? ఆ పాపిష్టోళ్ళు ఎంత పని అయినా చేస్తారు.

వీరా : అమ్మాయికంటే ఇవ్వాళ గబగబా పెళ్ళిజేసి బైటకి పంపించామే

అనుకో, రేపు నీజోలికే వస్తారు. అప్పుడైనా ఎదిరించక తప్పదుగా.

సీత : ఆకాడికొస్తే చావనన్నా చస్తాగాని ఆ చచ్చినోళ్ళకి చిక్కకేం?

వీరా : చచ్చి ఎవర్ని సాధిస్తావ్, ఎదిరించి వాళ్ళకి తగిన బుద్ధి జెప్పాలిగాని.

సీత : ఏం ఎదిరిస్తాం. ఆడోళ్ళం?

వీరా : మీరు తల్చుకుంటే ఈ రౌడీలొక లెక్కా? మొన్న మల్లారెడ్డిగూడెంలో ఏం జరిగింది? మిలటరీ వచ్చి ముట్టడేస్తే ఊరంతా కలసి ఎదిరించారు. ముఖ్యంగా స్త్రీలు కూడా ప్రాణానికి తెగించి ముందు నుంచుని పోట్లాడారు. అనేకమంది తుపాకీ కాల్పులకు గురి అయ్యారు.

సీత : (ఆశ్చర్యంగా) ఏమిటి? ఆడోళ్ళు కూడా పోట్లాడారా?

వీరా : ఆఁ పోట్లాడి ముగ్గురు చచ్చిపోయారు కూడా.

సీత : ఆఁ – ఎంత ధైర్యం చేశారు.

వీరా : ఏం, నీవు మాత్రం చెయ్యవ్? మొన్న తిరణాల దగ్గిర సమయానికి రామిరెడ్డి ఉండడనుకో; అప్పుడు నీవేం చేసేదానివి? అమ్మాయిని అల్లరిచేస్తూ ఉంటే చూస్తూ ఊరుకునేదానివా?

సీత : నా బొందిలో ఊపిరుండగా అమ్మాయిమీద చేయి బడనిస్తానా?

వీరా : షెబాస్! ఎప్పటికైనా అంతే అనుకో. మీ అంతట మీరు నిలబడాలిగాని ఒకళ్ళమీద ఎందాక ఆధారపడతారు?

సీత : ఎందుకు నిలబడం? మీతోపాటు మేం.

వీరా : అయితే ఇంకేం? నీవుకూడా సంఘంలో జేరు...కమలా! కమలా! (కమల లోపలనుంచి 'ఆఁ' అంటూ వస్తుంది) సంచిలో సభ్యత్వం పుస్తకం ఉందిగాని తీసుకురా. మీ వదిన సంఘంలో చేరుతుంది.

కమల : (ఆశ్చర్యంగా) మా వదినా?! (సీతమ్మవైపు చూచి) ఏం వదినా?

(సీతమ్మ నవ్వుతుంది)

వీరా : ఊఁ. కమలను పుస్తకం తెమ్మని సైగ జేస్తాడు. కమల రివ్వున లోనికి పరుగెత్తి పుస్తకం తెచ్చి వీరారెడ్డి చేతికిస్తుంది. వీరారెడ్డి పుస్తకంలో సీతమ్మ పేరూ, వగైరా రాస్తుంటాడు.

కమల : ఏ వదినా, సంఘంలో చేరగానే సరిపోదు. నాతోపాటు నీవు కూడా మనాళ్ళందరినీ సంఘంలో చేర్పించాలమ్మా!

**సీత** : (వీరారెడ్డి వంకజూచి నవ్వుతూ) చేర్పించక తప్పుతుందా? సంగంలో జేరాక, సంగం పెద్ద జెప్పినమాట వినాలిగా మరి. (వీరారెడ్డి నవ్వుతూ, పుస్తకం కమల చేతికిస్తూ వదినచేత వేలుముద్ర వేయించమని సైగజేస్తాడు. కమల వదినచేత వేలుముద్ర వేయించి, హుషారుగా పుస్తకం పైకెగరేస్తూ పాట పాడుతుంది.)

ఓ మాతా....ఓ భారతమాతా
కదనభూమి కురక నేడె
కదలినాము ఓహో మాతా ||ఓ మాతా||
వదలుమమ్మ నీదు చింత కదలీ నామిదే
గదిమి అరుల గూల్చేదమమ్మా
ఝాన్సీలక్ష్మి రుద్రమాంబ
శౌర్యపటిమ చాట నిదే
కదలినాము ఓహో మాత ||ఓ మాతా||

**కమల** : (పాట అయిపోవడంతోనే వదినను కౌగలించుకొని) నీవుకూడా పాడాలమ్మా ఇక సంఘం పాటలు.

(దాదా ప్రవేశం)

**సీత** : (కమల తలమీద చేయివేసి నిమురుతూ) నేనేం పాడతానే, నాకు రావుగా.

**కమల** : నేను నేర్పుతానుగా.

**దాదా** : (నవ్వుతూ) నేర్పమ్మా నేర్పు. ఆడబిడ్డ అర్ధమొగుడని ఊరికే అన్నారూ మరి.

**సీత** : ఏం నేర్పినా, రేపు వచ్చే మాగమాసందాకానేగా. పద, తలదువ్వుతా.

**దాదా** : అదేంటమ్మాయ్, అట్టంటావ్?

**సీత** : అమ్మాయికి సంబంధం కుదిరింది. దాదా! (వీరారెడ్డి వంకజూచి) తమ్ముడు జెప్పకుండా ఉన్నాడంటలే.
(సీతమ్మ, కమల వెళ్ళిపోతారు.)

**వీరా** : అదే, మొన్న నీకు జెప్పిన సంబంధమేలే. ఊళ్ళో కబుర్లేమిటి?

**దాదా** : ఏమున్నాయి? మరీ మా మస్తాన్‌కి పోయేకాలం వచ్చినట్టుంది.

**వీరా** : ఏం, మళ్ళీ ఏమన్నా జేశాడా?

**దాదా** : వెనకటికి మల్లే మళ్ళీ కోడిపెట్టల కోసం పోయి గూడెం మీద పడ్డాడు. వాళ్ళు నలుగురూ పోగై తలా ఒక తన్ను తన్నారు.

**వీరా** : మంచిపని జేశారు.

**దాదా** : ఇక అక్కడేం ఏడవలేక యింటికొచ్చి, ఇదంతా సంగంవాళ్లే చేశారని నిన్నూ, నన్నూ, సుభాన్నూ గలిపి నోటికొచ్చినట్టల్లా తిడతన్నాడు.

**వీరా** : అంతేలే, అంతకంటే అతను చేయగలిగేదేముంది?

**దాదా** : ఆ పెద్ద మనుషుల్ని ఎందుకు తిడతావని వాడి పెండ్లాం ఏదో కాస్త కలగజేసుకొంది. ఆమోయిన ఆ పిల్లను పట్టుకొని పాపం చావచితక కొట్టాడు దరిద్రుడు.

**వీరా** : ఏమీ చేతగాని ఇలాంటి వెధవ లందరికి చివరికి పెండ్లాం లోకువ.

**దాదా** : అంతే. ఉరిమి ఉరిమి చివరకు మంగలంమీద పడ్డట్టుంది.

**వీరా** : అమ్మాయి కమలా! కాసిని మంచినీళ్ళు తీసుకురా అమ్మా! (యల్లమంద ప్రవేశం. వంటిమీద అక్కడక్కడా సున్నం రాసి ఉంటుంది).

**దాదా** : ఏం యల్లమందా, ఎట్టా ఉన్నావు?

**యల్ల** : (దెబ్బలు చూపెడుతూ) ఇట్టా వుండా మత్తానయ్య దయవల్ల. (అంటూ ఉయ్యాల దగ్గిర కొచ్చి) ఏం చిన్న దొరా, నిద్దరోతుండావా?

**సీత** : (మంచినీళ్ళు తీసుకొస్తూ) లేపవాకు యల్లమందా. ఏడ్చి ఏడ్చి ఇప్పుడే పండుకున్నాడు.

(మంచినీళ్ళ గ్లాసు వీరారెడ్డి కందిస్తుంది. గ్లాసు నందుకొని వీరారెడ్డి మంచినీళ్ళు త్రాగుతూ ఉంటాడు. సీతమ్మ వెనక కమల కూడా ప్రవేశిస్తుంది)

**యల్ల** : (నవ్వుతూ) ఇంకా రెండేళ్ళు పోతే మా సిన్న దొరకూడా సంగం పెడతడు.

**వీరా** : (నవ్వుతూ) ఏమిటి యల్లమందా ఈ అలవాటు? చిన్నప్పటినుంచే దొరా దొరా?

**యల్ల** : ముద్దుకు పిల్చుకుంటన్నలే అయ్యా!

**వీరా** : సరేగాని, ఆ చేతిమీద దెబ్బ ఏమన్నా తగ్గిందా?

**యల్ల** : (దెబ్బజూపెడుతూ) అన్నీ తగ్గినయ్‌గాని దీని దుంపదెగ ఇదే కాస్తి ఇంకా నొప్పిగా ఉంది.

**సీత** : ఏది యల్లమందా? (దగ్గరకొచ్చి యల్లమంద చేతివైపు జూచి) అబ్బా! ఎంత కదుంగట్టింది! కమలా! లోపలికెళ్ళి...అదేమిటి...అదేనే....

**కమల** : అమృతాంజనమా?

**సీత** : ఊఁ అదే, ఆ సీసా తీసుకురా (కమల లోపలికెడుతుంది).

**యల్ల** : (దాదా వంక జూచి) ఏం లేదుగాని సిన్నయ్యా, ఒక బుద్ధితక్కువ పని జేసిన్నే.

**దాదా** : ఏం జేశావ్?

**యల్ల** : ఆ చుంచుముట్టోడు నాచేత ఏలద్దించుకున్నడే.

**కమల** : (సీసా తీసుకొస్తూ) చుంచుముట్టోడెవడు?

**యల్ల** : ఉండాదులే, అమ్మా ఉండాడు. ఒక పిలకోడు.

**వీరా** : ఆ కాగితపు ముక్కతో ఆ పట్వారీ చేసి చచ్చేదేమీ లేదులే. భయపడకు.

**యల్ల** : ఏమీ లేదుగంద!

(కమల చేతిలోనుంచి సీతమ్మ సీసా తీసుకొని యల్లమంద చేతికి రాయబోతుంది).

**యల్ల** : (అరచేయి జూపుతూ) వద్దులే అమ్మా, వద్దులే. ఇట్ట బొయ్యి, నేను రాసుకుంటాలే.

**వీరా** : పర్వాలేదులే రాయనియ్ యల్లమందా! కాస్త మెత్తబడుతుంది.

(సీతమ్మ రాస్తూ ఉంటుంది).

**యల్ల** : బంగారు తల్లి నూరేండ్లు బతుకమ్మ.

(రామిరెడ్డి, సుభాన్ ప్రవేశం).

**దాదా** : ఏమోయ్ సుభాన్!రోజూ నాకంటే ముందే వచ్చేవాళ్ళుగా, యివాళ యింత వెనకమాల వచ్చారేం?

**సుభాన్** : ఏముంది? రామిరెడ్డి గిత్త ఎటోపోతే, దానికోసం తిరుగుతున్నాం.

**వీరా** : ఏది, ఆ ఎల్లగిత్తా?

**రామి** : అదే.

**దాదా** : ఎటుపోయింది? ఏమన్నా జాడ తెలిసిందా?

**సుభాన్** : ఆఁ ఆఁ!

**వీరా** : ఎక్కడుంది?

**రామి** : ఇంకా ఎక్కడుంటుంది? గడీలో!

**దాదా** : గడీలో! అక్కడ కెట్టా బోయింది?

**వీరా** : ఎలా బోతుంది? తోలుకుపోతే పోయి ఉంటుంది.

**రామి** : చెరువుకి నీళ్ళకుపోతే, వాళ్ళ మందలో గలిపి తోలుకెళ్ళారు.

**యల్ల** : ఆ యెదవలకి అది అలివిగాకేం? ఆవులెర్రినబడి అదే పోయి ఉంటుంది.

**సుభాన్** : వాళ్ళ దొడ్డికి పోవడంతోనే దివాణపు ముద్దరేసి, కొట్టంలో కట్టేసు కున్నారు.

**సీత** : ఎంత గోరకలి!

**దాదా** : (విచారంగా) ఏం గిత్త! అయిదు వందలంటే ఇయ్యాళ దాన్ని కళ్ళు మూసుకొని తోలుకెళతారు.

**రామి** : అయిదు వందలాయె, పది వందలాయె, ముందు కాడికింద పడింది గదా! ఎట్టా జావాలంట?

**వీరా** : సరే. ఇవ్వాళ మీటింగులో దీన్ని గురించి కూడా గట్టిగా ఆలోచిద్దాం. ఇలా తోలుకెళ్ళిన గిత్తలు మొత్తం ఎన్ని ఉన్నాయో ఇంటింటికి తిరిగి లెక్కతీద్దాం. కొత్త నీళ్ళతోపాటు పాత నీళ్ళు కూడా కొట్టుకు రావాలి. అందాకా నాదగ్గర మిగులెద్దుందిగా. దాన్ని అడ్డంబెట్టి పని జరుపు.

**రామి** : పని జరుపుకోడానికేంగాని, దెబ్బలు తగిలిననాడు కూడా నాకింత కష్టమనిపించలేదు బావా! నా గిత్తల రెంటిని బండికడితే కన్నుమూసి

కన్ను తెరిచేటప్పటికి పోయి పేటలో వాలేయి. మరీ దాని దుంపతెగ, అది వంటిమీద చేయి వేయనిచ్చేదా? రేసు! ఇవ్వాళ పళ్ళెంకాడ కూచుంటే నోట్టోకి ముద్ద బోలేదే.

**దాదా** : నిజమే అనుకో నాయనా! కన్నబిడ్డకంటే ఎనిమిక్కిలిగా చూసుకునే గిత్త పోయిందంటే ఎవళ్ళకయినా అట్టాగే ఉంటది.

**సుభాన్** : వాడి రోజులు దగ్గరబడే ఇయ్యాల దీన్ని తోలుకెళ్ళాడు.

**సీత** : పాపిష్టి ముండాకొడుకింకెన్ని జేస్తాడో?

**కమల** : చేయాలసిన పనులన్నీ ఇదివరకే చేశాడు.

**వీరా** : అవును. నిరుడు మట్టుకు నిరుడేంజేశాడు? మన సుబ్బయ్యన్నగారి బీట్లో వాడి మందను దోలి – అదేమిటంటే, ఇది నా బీడే అనలా?

**యల్ల** : నిజమే, ఆడి మందమీద మెకంబడ.

**దాదా** : ఏం బీడు! బీడంటే బీడా! వరాల బీడు. అట్టాంటి బీడు మన ఊరి మొత్తానికి లేదు.

**సుభాన్** : అందాకా యెందుకు? చెరువు లోతట్టు నాదే అని ఈ యేడు దున్ని పైరు వేయలా?

**యల్ల** : అదేంది బాబూ, సరకారి పోరంబాకలకు కూడా కంపగొట్టి ఆకట్టుకొన్నాడుగా! నా గొర్రె పిల్ల మెసలడానికి కూడా వీల్లేకుండా జేసిండు. ఆ సరకారేడ జచ్చిండో!

**వీరా** : సర్కారే సరి అయింది అయితే, మనకీ తిప్పలే లేవు. అందుకనే మనం అసలు ఈ ప్రభుత్వమే పోవాలంటున్నాం.

**యల్ల** : అబ్బో! అట్టంటే మన సుభానయ్యకు కోపం రాదూ?

**రామి** : ఎందుకు?

**యల్ల** : నవాబుగారి పెత్తనం పోవడానికి సాయబు లొప్పుకోకేం?

**సుభాన్** : అసలు ముందు ఈ దేశముఖు పెత్తనం పోవడానికి యల్లమంద ఒప్పుకుంటేగా?

**యల్ల** : అదేందయ్యో సుబానయ్యా, నేను ఒప్పుకోకపోవడమేంది? ఆడుబోవాలి గాని, అమ్మోరుకీ ఏట బోతునియ్యనూ!

**వీరా** : (నవ్వి) దేశముఖు కూడా మన మతపోడేగా యల్లమందా?

**యల్ల** : ఏంది బాబూ, నీవు కూడా అట్టా అంటావ్? మన్ని పీక్కు తినేవాడు ఎవడైతేం, పోవలసిందే.

**దాదా** : మీ దేశముఖు మీ హిందువులకెంత ఒరిగిస్తన్నాడో మా నవాబు మా సాయబులక్కూడా అంతే ఒరిగిస్తున్నాడులే.

**రామి** : వా డొరిగించి చచ్చేదీలేదు, వీడొరిగించి చచ్చేదీ లేదు; ఇద్దరూ కలసి మన నెత్తురు తాగేవాళ్ళే!

**సుభాన్** : అంతే. దొంగలు దొంగలు కలిసి ఊళ్ళు పంచుకోవడమే.

**యల్ల** : ఎట్టయినా అసలు నవాబు మన దేశముఖంటోడు గాదంటలే. ఆయన సాలా మంచోడంట!

**కమల** : అలాగే ఉంటుంది; దూరపు కొండలు నునుపు. ఈ జరిగే దుర్మార్గాలన్నీ ఆయనకి తెలియకుండానే జరుగుతున్నాయా? ఆకునూరులో ఏం జరిగింది? మాచిరెడ్డిపల్లిలో ఏం జరిగింది?

**యల్ల** : ఓం – అమ్మాయికి చాలా పెద్ద పెద్ద సంగతులు తెలుసునే!

**సీత** : తెలియడ మేమిటి? వాటిమీద ఒక పాట కూడా పాడుతుంది.

**యల్ల** : ఏందీ! పాటా, పాడమ్మా పాడు.

**కమల** : పాటలే దేమీలేదు. వట్టిదేలే యల్లమందా (అంటూ సిగ్గుతో కొంచెం తలవంచుకుంటుంది).

**దాదా** : మా సీతమ్మ నోటినుంచి అబద్ధం రాకేం! పాడమ్మా పాడు.

**వీరా** : ఊం పాడు. ఇక ఎలాగైనా నీకు తప్పలేదు.

**కమల** : ఒక్కదాన్నే పాడితే ఏమీ బాగుండదు.

**సీత** : అయితే ఇంకేం, ఎవరొద్దన్నారు? అన్నా చెల్లెలూ కలిసే పాడండి.

(వీరారెడ్డి, కమల కలిసి పాడుతూ ఉంటారు.)

నరకకూప మీ క్రూర నిరంకుశ
నైజాంపాలన రైతా॥
కరకర పేదల గొంతులు కోసే
కసాయిపాలన రైతా॥

కళలకు సిరులకు నిలయమైన
ఈ తెలంగాణ నో రైతా॥
మలమల మాడ్చుచు వల్లకాడుగా
మార్చె ప్రభుత్వము రైతా॥
మాన రక్షణకు ప్రాణమిచ్చు మన
మహిళామణులకు రైతా॥
మానభంగమా! చిత్రహింసలా!
మన కట్టెదుటనె రైతా॥
నలుబది మందిని ఆకునూర నా
నడిబజారులో రైతా॥
ఖలు లీ నైజాం పోలీస్ మృగములు
కట్టి చెరచిరో రైతా॥
ఏకవస్త్రలని గర్భిణీ స్త్రీలని
ఎంచరైరిగా రైతా॥
లోకములో ఈ హింసలు రాక్షసి
మూకలు చేసెన రైతా॥
ఖైదునిబెట్టీ వలువలు విప్పీ
కారము గొట్టిరి రైతా॥
లేదింతకు మించిన యమలోకము
లేదు లేదురా రైతా॥
ఎందుకురా నికృష్ట జీవిత
మెందుకురా రైతా॥
అందురుకలసి ఎదిరించా లిదె
ముందుకు రారా రైతా॥

(పాట వింటూ ఉన్నంతసేపూ అందరి కండ్లవెంట నీళ్ళు తిరుగుతాయి)

**దాదా** : (విచారంగా వీరారెడ్డితో) ఏం బాబూ, ఇదంతా నిజమేనా?

**రామి** : నిజమేనా ఏమిటి? ఇదంతా నా కండ్లార చూస్తేను. ఏం, వీరారెడ్డి

బావా, ఏదో, ఉత్తరం ఇచ్చిరమ్మని ఆయాల నీవు నన్ను ఆకునూరు బంపలా? అప్పుడామె ఎవరోవచ్చి...ఆఁ...ఏమిటి ఆమె పేరు....

**కమల** : ఎవరు, పద్మజానాయుడా?

**రామి** : ఆఁఆఁ – ఆమెగారే, ఒక్కొక్కళ్ళు ఆమెగారి దగ్గరకొచ్చి తమ చెరలు చెప్పుకుంటుంటే నా కడుపు తరుక్కుపోయిందనుకో.

**దాదా** : (వీరారెడ్డితో) ఎవరు బాబూ ఆ మా తల్లి?

**సుభాన్** : సరోజినీదేవి కూతురు.

**సీత** : ఆమె దేవూరు?

**వీరా** : మన హైద్రాబాదే. సరోజినీదేవి అంటే సామాన్యురాలు గాదు, కాంగ్రెసులో గొప్ప నాయకురాలు.

**యల్ల** : కాంగిరేసేంది బాబూ?

**వీరా** : ఇక్కడ మన ఆంధ్రమహాసభలాగే దేశంలో పెద్ద సంఘం. ఎప్పుడన్నా గాంధీగారి పేరు విన్నావూ?

**యల్ల** : గ్యాంధీగారా? గ్యాంధీగారి పేరు ఇనకపోవడమేంది? ఆయనేగా? (అంటూ గోడకు తగిలించివున్న గాంధీ ఫొటోను చూపిస్తాడు).

**సుభాన్** : ఊఁ ఆయనే – ఆ సంఘానికి నాయకుడాయనగారే.

**దాదా** : ఇట్టాంటి పెద్దలుండగా ఇంతంత ఘోరాలు చేస్తున్నారు.

**వీరా** : ఎందుకు జేయరు. పటేల్లాంటివాళ్ళు కూడా ఈ రాజులతో, నవాబులతో రాజీపడుతూ ఉంటే?

**యల్ల** : ఏందీ పటేలా? ఏ పటేల్?

**కమల** : సర్దార్ పటేల్.

**యల్ల** : ఓసోసీ! అయితే ఆయన ఈ పటేళ్ళందరి తలదన్నినోడన్నమాట!

**సుభాన్** : అదిగాదు యల్లమందా! ఆయన మన పటేళ్ళాంటివాడు గాదు, పెద్ద కాంగ్రెసు నాయకుడు.

**యల్ల** : ఎంత కాంగిరేసు అయితే మట్టుకి ఈ పటేళ్ళ నెట్లా నమ్ముతావయ్యా? మీరు లచ్చ జెప్పండి, నేను మట్టుకి పటేల్ నెవణ్ణీ నమ్మను.

**వీరా** : (నవ్వుతూ) సరే ఇప్పుడు నీకు తెలియదులే ఈ గొడవ. పోనీ దీన్ని గురించి రేపు తీరికగా చెప్పుతానులే.

(మంగలి రాముడు ప్రవేశం)

**వీరా** : ఏమిటి రాముడూ, ఇలా వచ్చావ్?

**రామి** : ఏం, దొర పంపించాడా మమ్మల్ని తీసుకురమ్మని?

**రాముడు** : లేదు బాబూ!

**కమల** : మీకోసం గాదులే. మళ్ళీ యల్లమందను తీసుకురమ్మని పంపించి ఉంటాడు.

**యల్ల** : ఆఁ – నా కోసమే. ఇంకా నేను గడీ కెల్లకేం? (రాముడితో) ఏమైనాసరే నేను రాను పో ఆశ, చెప్పుకో పొయ్యి.

(అందరూ నవ్వుతూ ఉంటారు)

**వీరా** : అసలు విషయమేమిటో చెప్పనియ్. ఎందుకప్పుడే తొందరపడటం?

**దాదా** : (రాముణ్ణి జూచి) ఏమిటి పని?

(చెప్పడానికి రాముడు సందేహిస్తూ ఉంటాడు)

**వీరా** : సందేహిస్తావెందుకు, చెప్పు.

**రాముడు** : ఏం లేదు బాబూ, నేను కూడా... (అందరి ముఖాలవైపు చూస్తూ ఉంటాడు).

**వీరా** : చెప్పు, పర్వాలేదులే చెప్పు.

**రాముడు** : నేను కూడా సంగం పడదామనుకున్నా దొరా!

**దాదా** : ఈ మాట చెప్పడానికే ఇంత భయపడతావేం?

**రాముడు** : ఈ సంగతి మల్లా దొరకు తెలిస్తే నిలువునా పాణం దీస్తాడు.

**రామి** : నీవు మా సంగంలో ఎట్టా జేర్తావ్?

**వీరా** : అదేమిటి రామిరెడ్డీ, ఎందుకు జేరగూడదు? అతను మాత్రం మన లాంటి బీదోడు గాదా?

**సీత** : అయితేం దేశముఖు మనిషిగా?

**వీరా** : అలా అనుకుంటే మనమంతా ఎవరం? దేశముఖ్ మనుషులం గాదా? అతను దేశముఖ్ ఇంట్లో చాకిరి జేస్తున్నాడు. మనం బైట పొలంమీద పండించి వాడింట్లో బోస్తున్నాం. అంతే తేడా!

**దాదా** : బాగా పారజూస్తే అంతేలే, ఏముంది తేడా?

**యల్ల** : ఈ మంగలాయన జేరతానంటే మటుకు దొర ఊరుకోవద్దూ?

**సుభాన్** : ఏమయ్యా రాములూ, బాగా ఆలోచించుకున్నావా? ముందు చాలా చిక్కులొస్తాయ్.

**సీత** : ఇంకా ఆలోచించుకునేదేముంది? ఈ సంగతి దొరకి తెలిస్తే నీ కాస్తి నౌకరీ ఊడిపోతుంది.

**రాముడు** : పోతే పోయిందిలే అమ్మా, నా పీడా వదులుద్ది. ఈ నౌకరీ ఉండి మట్టుకు నా కొరిగించే దేముంది? పొద్దస్తమానం ఆయనింట్లో అరవ శాకిరీ చేయడమేగా?

**కమల** : ఏం, మీ మంగళ్ళ కేదో కొంత మాన్యముండాలిగా?

**రాముడు** : (విచారంగా) అదేవుంటే లేందేమిటమ్మా, ఎట్టో ఒకట్టా బతికేవాళ్ళం.

**దాదా** : ఆ మాన్యంకాస్తీ అప్పుడే లాక్కున్నాడుగా!

**రాముడు** : అయిదేళ్ళకింద ఎన్నడో నా పెళ్ళికి పాతిక రూపాలిచ్చుండు. వడ్డీతో వంద దాటిందనీ నిరుడు ఆ కాస్తిగడ్డా లాక్కున్నాడు.

**వీరా** : ఇందులో ఆశ్చర్యమేముంది? ఇది మామూలుగా జరిగేదేగా?

**దాదా** : ఈ ఊళ్ళో పనిపాటలోళ్ళ మాన్యాలెవళ్ళయి మిగిలాయి?

**యల్ల** : మాన్నాలేనా? బంచరాయి కూడా నాదే అని లాక్కున్నాడుగా!

**వీరా** : తాతలనాటినుంచి కాపురముండే కొంపల్లోనుంచి లేవగొడితే దిక్కులేదు గాని, ఇవి ఒక లెక్కా? వాములుదినే స్వాములకి పచ్చగడ్డి ప్రసాదం! ఇలాంటి వెన్ని లాక్కోందే వాడికి ఇరవైవేల ఎకరం అయింది?

సీత : సరే, పాపం, ముందా రాముణ్ని సంగంలో జేర్చుకోండి.

**వీరా** : ఏం దాదా, చేర్చుకుందామా?

**దాదా** : నీ ఇష్టం నాయనా! ఆ మంచీ, చెడ్డా అంతా నీకే తెలుసు.

**రామి** : ఏంరా రాముడూ, సంగంలో జేర్చుకుంటే ఇక దివాణంలోకి పోకుండా ఉంటావా?

**వీరా** : ఏం పోతే?

**రామి** : ఏం పోతేనా? రెండావుల దూడలాగా అక్కడా, ఇక్కడా ఎట్ల కుదురుద్ది?

ఉంటే సంగంలోనన్నా ఉండాలి; లేకపోతే దివాణంలోనన్నా ఉండాలి.

**రాముడు :** ఇదంతా ఎందుకు బాబు; అసలు మీరు పొమ్మన్నా నేనాడకుబోను.

**సుభాన్ :** ఏం, ఎందుకని?

**రాముడు :** ఏం జెప్పను బాబు నా గోడు? కొడుకు బుట్టి ఏడాది అయింది. ఇంతవరకు వాణ్ని ఎత్తుకొని ఎరగను.

**సీత :** అదేంటి రాముడూ, అట్టంటావ్?

**రాముడు :** ఏముంది తల్లీ? కోడి గూసినప్పుడనగా లేసి సద్ది దాగి, గడీకిబోతా. ఆ పోయిన పోవటం మళ్ళీ నడిజాముకిగాని కొంపకుజేరను. ఇంకా వాణ్ని నే నెత్తుకునే దెప్పుడమ్మా?

**సీత :** నిజమే పాపం, నీ వెళ్ళేటప్పటికి లేవడు; మళ్ళీ నీవు తిరిగి వచ్చే టప్పటికి నిద్రబోతావుంటాడు. అంతేనా?

**రాముడు :** అంతేనమ్మా, అంతే.

**కమల :** నడిజాందాకా అక్కడేం జేస్తావ్ రాముడూ?

**రాముడు :** ఒకపనా? ఎల్లినకాడనుంచి బారెడు పొద్దెక్కేదాకా పక్కలు తీయడం, మంచాలెత్తడం, ఆ లంకంత కొంప ఊడ్చి ఎత్తిపోయడం సరిబోద్ది. పగలు పొద్దాకా ఆయన సేవ జేయాలిగా? మళ్లీ సందకసువూడవడం, కందిళ్ళు (లాంతర్లు) తుడవడం, మళ్లీ పక్కలేసి ఆయన నిద్దరోయిం దాకా కాళ్ళు బిసికి – అప్పుడు బయటపడాలి. ఇంతజేసినా, ఏరోజు కారోజు చీవాట్లూ, చెప్పుదెబ్బలూ తప్పవ్.

**యల్ల :** ఓసోసి, ఆటేజూత్తే, నీకంటె నేనే కాత్తి మెరుగన్నమాట!

**రాముడు :** నీకేమయ్యా, మారాజువి, ఎల్లిననాడు గొర్రెలకాడి కెల్తావ్, లేనినాడు ఆయిగా గొంగళి ముసుగెట్టి పండుతావ్.

**యల్ల :** టుర్ర్, కీ.....

**రామి :** అదేంటి నీ బొంద?

**యల్ల :** లేకపోతే ఏంది? నేను మారాజునంట, మారాజుని, ఒకనాడు జీవాలెమ్మ టెల్లమను తెలుత్తుంది, మంగలాయన సంగతి.

(అంతా నవ్వుతారు)

**సుభాన్** : బీదోళ్ళకి కష్టాల కేం తక్కువలే. కాస్తి కూస్తి తేడాకేం గానీ, అందరిపనీ అలాగే ఉంది.

**వీరా** : అవును. అందుకోసమే మన మందరం గలిసి సంఘం బెట్టుకుంది. మన సంఘం ఎంత త్వరగా బలపడితే అంత త్వరగా మన మీ కష్టాలనుంచి గట్టెక్కుతాం. సరే, రాముడూ! యిప్పుడు మేం మీటింగుకు పోతున్నాంగాని రేపు ప్రొద్దున్నే రా, సంఘంలో చేరుదువుగాని.

**రాముడు** : సిత్తం దొరా, మీ బానిచోణ్ణి.

**వీరా** : అలా అనగూడదు. మన సంఘంలో దొరలూ – బానిసలూ అంటూ ఉండరు. అందరం సమానమే! అంతా అన్నదమ్ముల్లాగా ఉండాలి.

**రాముడు** : సిత్తం దొరా! (నాలిక కొరుక్కుని) సిత్తం బాబూ! వత్తానండి.

(దండంబెట్టి వెళ్ళబోతూ ఉంటాడు)

**వీరా** : ఇదిగో రాముడూ! దివాణప్పనికి వెళుతూనే ఉండు; ఎందుకయినా మంచిది.

**రాముడు** : అట్నేలే బాబూ! (నాలుగడుగులేసి, వెనక్కి తిరిగి, మళ్ళీ వీరారెడ్డిదగ్గిర కొచ్చి) ఈ సందట్లో అసలుమాట మర్చిపొయ్యా. ఇయ్యాల దొరగారూ, పట్వారీ కలిసి కచ్చడపు బండ్లు కట్టుకొని నల్లగొండ బోయిన్రండీ! ఆడనుంచి దొరపట్నం కూడా పోతడంట!

(అందరూ ఆలోచిస్తూ ఉంటారు)

**దాదా** : ఎందుకెళ్ళినట్టబ్బా?

**రాముడు** : రాతిరి చానా పోద్దోయిందాకా ఇద్దరేందో గుసగుసలాడిన్రు!

**సుభాన్** : ఏమన్నా దొంగకేసులు పెడతాడేమో, మనమీద.

**వీరా** : (ఆలోచిస్తూ) సరే రాముడూ, నీవు పద – మరేం ఫర్వాలేదు.

(రాముడు దండంబెట్టి వెళ్ళిపోతాడు)

**రామి** : (రాముడు పోయిందాకా అతనివైపు చూస్తూ) ఏమో, వీణ్ణిక్కడికి జేరనివ్వడం నాకనుమానంగానే ఉంది.

**వీరా** : ఏమిటి అనుమానం? అతన్ని సంఘంలో జేర్చుకోడం తప్పనా నీ ఉద్దేశం? అలాంటి బీదోళ్ళని జేర్చుకోకపోతే, ఇంకెవర్ని జేర్చు కుంటావ్? నీకంటె, నాకంటే అతనికేం తక్కువ కష్టాల్లేవు.

**రామి** : ఎన్నిజెప్పినా అతను దివాణప్పురుగు. ఇక్కడ సంగతులన్నీ మూటగట్టు కెళ్ళి అక్కడ జెప్పితే...

**సుభాన్** : ఏం చెప్తే. మనకేం భయం? మనవేమున్నా, దొంగేడప్ప ఏడుస్తున్నామా? చేయదల్చుకున్నదేదో బండ పగలగొట్టినట్లు మనం బజార్లోనే చెప్పి చేస్తున్నాం.

**దాదా** : అట్టాంటి బీదోణ్ణి కూడా అనుమానిస్తే మన సంఘం ఎట్టా బలపడతది రామిరెడ్డి, కాకపోతే నాలుగురోజులు కాస్త కనిపెట్టి ఉందాం.

**సీత** : ఎంత దివాణంలో ఉన్నా, మొదటినుంచీ రాముడు కాస్తి మెత్తని ముండాకొడుకే. అంత మోసం జేస్తాడనుకోను.

**కమల** : చేస్తే ఒకరోజు చేస్తాడు, రెండురోజులు చేస్తాడు. తర్వాత ఎక్కడికి బోతాడు?

**యల్ల** : ఏడకి బోతడు? అంతేలే బుల్లెమ్మా! మేక అయిందీ, మెకం అయిందీ నాలుగడుగు లేసేటప్పటికి అదే తేలుద్ది. పదండి పోదాం మీటింగుకి.

**వీరా** : సరే, పదండి పోదాం. బోలో ఆంధ్ర మహాసభకీ జై!

లేవండోయ్ లేవండోయ్
కార్మిక కర్షక యోధుల్లారా ॥రా రండోయ్॥
దారుణ హింసాకాండను ఢీకొని
పోరాడాలిదె రణరంగానికి ॥రా రండోయ్॥
పేదల రక్తము పీల్చు దేశముఖు
పిశాచిపాలన నశింపజేయగ ॥రా రండోయ్॥
స్త్రీలను జెరచీ శిశువుల జంపే
కాలకింకరుల కాలరాయగా ॥రా రండోయ్॥
ప్రజలకు హక్కులులేని ప్రభుత్వం
ప్రభుత్వమా అది పశుప్రభుత్వం
స్వాతంత్ర్యము మన జన్మహక్కని
జయభేరిని మ్రోగించపదండోయ్ ॥రా రండోయ్॥

# 4

# దివాణం (గడీ)

(దేశముఖు, అతని వెనుక పట్వారీ ప్రవేశం)

**జగ** : చూడవయ్యా చూడు. పదిరోజుల్లో ఒక్కొక్కణ్ణి చీల్చి ఎండేస్తానో లేదో! పూటకూటికి గతిలేని ఈ వెధవలు నన్నా ఎదిరించేది?

**వెంక** : (నవ్వి) అంతేలెండి. గొర్రె కొవ్వి కొండమీద తిరగబడిందట! అలా వుంది! వీళ్ళపని.

**జగ** : హ్హాఁ. ఏమిటనుకున్నారో, దేశముఖు జగన్నాథరెడ్డి అంటే!

**వెంక** : మీ సంగతి ఆ కూపస్త మండూకాల కేం తెలుసు? ఆవులించితే మీరు పేవులు లెక్కబెట్టరూ? మీరు పట్నం బయలుదేరగానే అనుకున్నా 'దొరవారికి కోపం వచ్చింది, ఇక ఈ దెబ్బతో ఈ గాడిద లంతా నల్లుల్లాగా మాడిపోవాలసిందే' అని.

**జగ** : అనుకోవడమేమిటయ్యా, ఇంకా మన కత్తి కెదురుకత్తి ఉందా?

**వెంక** : ఎలాగైనా...మన ప్రభువు.

**జగ** : ప్రభువు! (వికారంగా నవ్వి) మనం లేకపోతే ప్రభువెక్కడుంటాడయ్యా, సాయిబైతే మాత్రం సర్ మీర్జా ఇస్మాయిల్‌ని చెప్పుకోవాలిగాని.

**వెంక** : అబ్బో, ఆయనెక్కడ; యుగంధరుడు!

**జగ** : కాకపోతే ఏమిటి మరి? ఎక్కడ వేయాలిసిన పాచిక అక్కడే వేస్తున్నాడు. చూడు, అటు వైస్రాయి దగ్గరకెళ్ళి, నీ అంత మొనగాడు లేడనిపించు కుంటున్నాడు. ఇటు కాంగ్రెసువాళ్ళ దగ్గిరకెళ్ళి కాంగ్రెసోడనిపించు కుంటున్నాడు.

**వెంక** : అనిపించుకోవడమేమిటి? డాక్టరు పట్టాభి సీతారామయ్య పంతులుగారి పత్రిక జన్మభూమి కూడా ఆయన్ని కాంగ్రెసువాడే అని వ్రాసింది.

జగ : ఓహో, అలాగా?! ఇంకా నాకా సంగతి తెలియదే? ఏమి ప్రజ్ఞయ్యా అలా ఇంకెన్ని పత్రికల నోళ్ళు గట్టాడో!

వెంక : అసలు ఆయనకి వ్యతిరేకంగా నోరు తెరచిన పత్రిక ఒక్కటుందా?

జగ : పత్రికలమాట సరేనా. ఇలాంటి వెధవలందర్నీ కేసులు పెట్టి శిక్షించమని హైకోర్టు, కింద కోర్టులకు ఒక రహస్య సర్క్యులరు కూడా పంపింది. ప్రపంచంలో ఏ మంత్రి చేయించగలిగాడయ్యా ఇంత గొప్పపనీ?

వెంక : నిజమే మంచిప్లానే వేశాడు. కాని ఏం లాభం; అదేదో పత్రిక ఆ రహస్యం కాస్తా బైట బెట్టిందిగా?

జగ : ఏడ్చింది! మంత్రాలకు చింతకాయలు రాలకేం? జరిగే పనేదో జరుగుతూనే ఉంది. ట్రైనింగు తీసుకునేవాళ్ళు తీసుకుంటూనే ఉన్నారు. ఊళ్ళమీద దాడి జేసేవాళ్ళు చేసన్తానే ఉన్నారు. హైదరాబాద్‌లో చివరికి నిజాంసాగర్‌లో కూడా విమానాశ్రయం నిర్మిస్తున్నారు.

వెంక : (ఆశ్చర్యంగా) నిజాం సాగర్‌లోనా?! చెరువులోనా విమానాశ్రయం?

జగ : ఆఁ చెరువులో విమానాశ్రయం. ఇంగ్లండులో లేచిన విమానాలు ఎకా ఎకీవచ్చి ఇక నిజాంసాగర్‌లో వాలడమే. ఏమనుకున్నావ్ మరి మీర్జా ఇస్మాయిల్ దెబ్బంటే!

వెంక : మొన్న ఆకిన్‌లెక్ కూడా హైదరాబాద్ వచ్చాడటగా?

జగ : వచ్చాడు. వేయాలిసిన ప్లానేదో వేశాడు. ఇక మనకేం లెక్క? కానివ్వవయ్యా! తన తరఫున లక్ష నైజాం సైన్యం ఉంది. ఇంకా కావలసొస్తే అంగ్రేజ్ సర్కారు విమానాలు, టాంకులు కూడా పంపిస్తుంది. ఇక వీళ్ళూ, వీళ్ళ సంఘాలు ఈ దెబ్బతో మసిమసి.

వెంక : అసలు అంగ్రేజీ (బ్రిటిష్)లో ఉన్న సంఘాలు కూడా పోతేగాని మనకి పీడ పూర్తిగా వదలదు.

జగ : ఇంకా సంఘాలేమిటి – అసలు బ్రిటిష్ ఆంధ్రే మన నవాబుగారి చేతుల్లోకి వస్తూ ఉంటే?

(మస్తాన్ ప్రవేశించి సలాంజేసి ఒక ప్రక్కన ఒదిగి నుంచుంటాడు, అతని ముఖంలో విచారభావం వ్యక్తమవుతూ ఉంటుంది).

**వెంక** : ఏఁ మస్తాన్, అలా ఉన్నావ్?

**మస్తాన్** : ఏం చెప్పను? పొద్దుటినుంచి ఊరుచుట్టూ, గూడెం చుట్టూ తిరిగి తిరిగి నా దుంప తెగింది.

**వెంక** : ఏం?

**మస్తాన్** : ఏముంది? ఇయ్యాల ఒక్క జీతగాడూ రాలా.

**జగ** : (గుడ్లురుముతూ) ఆఁ, అంత పొగరు దిగిందా?

**వెంక** : ముందు సేత్ సింధీని (మోతాదు) బంపి వాళ్ళందర్నీ పిల్చుకరమ్మను.

**జగ** : ఊఁ వెళ్ళు, ఇవ్వాళ ఒక్కొక్కణ్ణి డొక్క జీల్చేస్తాను.

**మస్తాన్** : ఇంకా సేత్‌సింధీ ఎక్కడ బాబూ, వాడందరి కంటే ముందే ఎగగొట్టాడు!

**వెంక** : అయితే ఊరూ, గూడెం ఏకమయిందన్నమాట?!

**మస్తాన్** : ఎక్కడ గొడ్లు అక్కడే ఉన్నాయి. చివరికి వాటిదగ్గర పేడతీసే దిక్కు కూడా లేదు.

**వెంక** : (దేశముఖువైపు చూచి) ఎంతపని చేశారు గాడిదలు, మన ఇద్దర్నీ ఊళ్ళో లేకుండ జూసి.

**మస్తాన్** : మీ ఇద్దరూ ఊళ్ళో లేకపోవడం వల్లనే వాళ్ళకింత కొమ్ములొచ్చాయి. రాములవారి గుడిదగ్గర పెద్ద మీటింగు కూడా జేశారు.

**జగ** : మీటింగే! నా వూళ్ళో! నా రామ మందిరం ముందు! మరి నీ వెక్కడేడ్చావ్?

**మస్తాన్** : ఏఁ జేస్తాను. ఊరూ నాడూ ఏకమైతే? వాళ్ళ ముందిప్పుడు నాబోటోడు మాట్లాడేటట్టుందా? ఆయనెవరో, ఒకాయన వచ్చాడు. జిల్లా నాయకుడంట – జిల్లా నాయకుడు! తెగ వదిరాడు. అప్పటికీ కోపం పట్టలేక మన ముఠాచేత మీటింగు మీద రాళ్లు వేయించా.

**వెంక** : భలేపని చేశావ్, కుక్క కాటుకు చెప్పు దెబ్బ. సరిపోయింది.

**మస్తాన్** : సరిపోయేదే, కాని....

**జగ** : కాని.....

**మస్తాన్** : దొంగ గాడిద కొడుకులు, కాపలాగాసి మనాళ్ళందర్నీ పట్టుకుకొట్టారు.

**వెంక** : కొట్టటమే!

**మస్తాన్** : కొట్టడమేమిటీ? మరీ మన ఓనమాల వెంకన్నని చావచితకబొడిచారనుకోండి. మీటింగులో లేచి నుంచోని అంతా ప్రమాణం కూడా జేశారు. దేశముఖు పెత్తనం నాశనం జేసిందాకా నిద్రబోరట!

**జగ** : ఏమిటి? ప్రమాణాల వరకూ వచ్చింది! చూస్తాను. వాళ్ళ నాశనమో, నా నాశనమో తేలిపోవాలి.

(ఒక పోలీసు ప్రవేశించి సలాంజేసి నుంచుంటాడు)

**వెంక** : అమీన్‌సాబ్‌గారు వచ్చేశారా ఏమిటీ?

**పోలీసు** : ఆఁ వస్తున్నారు మారాజ్?

**జగ** : పోలీసో?

**పోలీస్** : ఆఁ పోలీసు కూడా వస్తా ఉంది మారాజ్!

**వెంక** : వస్తున్నారా? అచ్చా.

**జగ** : ఎవడురా అక్కడ?

(రాముడు ప్రవేశించి దణ్ణంబెట్టి నుంచుంటాడు)

**జగ** : ఏంరా, బంగాళా అంతా ఊడ్చి బాగుజేశావా?

**రాముడు** : ఆఁ చేసిన్ను దొరా!

**జగ** : (వెంకట్రావుతో) తయారుచేయవయ్యా జాబితా! అరే రాముడూ! ఆ జాబితా కోమటికిచ్చి కావలసిన వస్తువులన్నీ బంగాళాకి పట్టుకెళ్ళు.

(పట్వారీ వెంకట్రావు జాబితా తయారుచేస్తూ ఉంటాడు)

**జగ** : ఏయ్ మస్తాన్! నీ వెళ్ళి గేటు దగ్గర నుంచో. అమీన్‌సాబ్ రాగానే నాకు కబురుచెయ్, (పోలీసుతో) రెండు ఏటలు సరిపోతయ్యా?

**పోలీస్** : పలావ్‌కి మా అందరికి రెండెట్టా సరిపోతయ్ జనాబ్? కనీసం నాలుగయినా ఉండాలి.

**జగ** : సరే, పంపిస్తాను.

**వెంక** : అరేయ్ రాముడూ! జాబితా పట్టుకెళ్ళు.

(కాగితం మడిచి రాముడికివ్వబోతాడు)

**పోలీస్** : ఏమేం రాశారు పట్వారీసాబ్?

**వెంక** : మీకు కావలసినవి సమస్తం రాశాను. మషాళా దిన్సులు, మిర్చి, చింతపండు, అల్లం, బెల్లం, పప్పు, ఉప్పు, ఉల్లిగడ్డలు, వెల్లిగడ్డలు, బీడీలు, సిగరెట్లు, బియ్యం, నెయ్యి...

**పోలీస్** : నెయ్యి ఎంత వేశారు?

**వెంక** : అరడబ్బా.

**పోలీస్** : అరడబ్బా ఎట్టాజాల్తుంది, మారాజ్? ఒక్క డబ్బా అయినా లేకపోతే ఎట్టా?

**జగ** : (వెంకట్రావుతో) ఊఁ వెయ్యవయ్యా. డబ్బా వెయ్! అరే రాముడూ! నీతోపాటు ఈ పోలీసు కూడా వస్తాడుగాని, ఆయనకి కావలసిన వన్నీ ఇప్పించేసెయ్.

**రాముడు** : సిత్తం దొరా! (జాబితా తీసుకొని దండంబెట్టి వెళ్ళిపోతాడు)

**పోలీస్** : ఆదాబ్ ఆర్జ్! (సలాంజేసి వెళ్ళిపోతాడు)

**జగ** : (అటూ ఇటూ పచార్లు గొడుతూ) నేటికి నా ఊళ్ళో పొరుగూరివాడు వచ్చి, మీటింగు బెట్టడమా! సమయానికి నేను లేకపోతిని.

**వెంక** : మనమే ఉంటే ఊళ్ళో కాలుబెట్టి మళ్ళీ వాడు బైటికి పోతాడా? వంటింట్లో కొచ్చిన కుందేలు తప్పించుకపోయింది. ఇప్పుడేమనుకుంటే ఏం లాభం?

**జగ** : చూస్తాను. ఈసారి యెలా తప్పించుకబోతాడో!

**వెంక** : అసలీ జిల్లాకు చిచ్చుబెట్టిందే ఆ వెధవ. ఒకసారి గట్టిగా దరువు పడితేకాని...

**జగ** : దరువూలేదు, గిరువూలేదు. ఈసారి దొరికితే బిస్మిల్లా చేయడమే, ఎన్ని వేలయితే మాత్రమేం?

**వెంక** : ఆ ముండమోపికి వేలు గావాలా? మన వెంకన్ననీ, సుబ్బన్ననీ ఇంకా రెండుపావు లెక్కవేసుకోమంటే సరి! రేపీ పాటికి...

(మస్తాన్, అమీనుల ప్రవేశం)

**జగ** }
**వెంక** } : (లేచి నుంచొని అదాబ్ అర్జ్‌హైఁ.

**అమీన్** : అదాబ్ అర్జ్ఁహై.
(దేశముఖు అమీన్ కెదురుగా వెళ్ళి, కరస్పర్శజేసి తీసుకొచ్చి తన కుర్చీలో కూచోబెడతాడు. పక్కనున్న కుర్చీలో తాను కూచుంటాడు. పట్వారీ ఒక పక్కన, మస్తాన్ మరో పక్కన నుంచుంటారు.)

**అమీన్** : (కుర్చీలో కూర్చుంటూ) హేమ్టి మహరాజ్! నీ మీదా షికాయత్ వచ్చింది, మీదీ దివాణంతో చాలా చాలా గొడ్వాహుందట!

**జగ** : నామీదనా షికాయత్! ఎవరా చేసింది?

**అమీన్** : హెవడూ హేమ్టి? హిక్డీ జనంహంతా దస్తఖత్ చేసి తాలూకాదార్కీ హింతాపొడ్గా మహజర్ హొక్టీ పంపార్. రైతుల్‌మీద చాలాచాలా జులుం చేస్తున్నావూ హంట.

**వెంక** : సర్కారీ లెవీ ఇవ్వమని గట్టిగా అడగడం కూడా జులుమేనా? లెవీ ఇవ్వకుండా ఎగ్గొట్టి పైన దేశముఖ్‌గారిమీదనే రిపోర్టు చేశారన్నమాట! ఏముంది? మొగుణ్ణి గొట్టి మొఱ్రో అన్నట్లుంది ఇదంతా.

**అమీన్** : హరే లెవీ గివీ గొడ్వా మాకీ హేమి? హోల్లా కొంపల్కీ లూటీ చేయడం, హెద్దుల్కీ తోల్కూ పోవడం, హోళ్ళా పొలాల్కీ మీదీ ఖబ్జా (వశం) చేస్కోవడం, గడీకి పిల్చి కొట్టడం – హిదంతా జులం గాకపోతే హేమ్టి అయ్యా?

**వెంక** : హుజూర్! ఇదంతా సంఘంవాళ్ళ మాయ. రంకునేర్చిన అమ్మ బొంకకపోతే ఎట్లా?
(మస్తాన్ను సారా సీసా తీసుకురమ్మని దేశముఖ్ సైగజేస్తాడు)

**జగ** : (పట్వారీతో) అదేమిటయ్యా, వెంకట్రావుగారూ! సంఘంవాళ్ళ బద్మాషీ మన అమీన్‌సాబ్ గారికి తెలియకుండా ఉందా?

**వెంక** : వారికి తెలియకపోవడమేమిటి? అసలు నవాబుగారే పోవాలని వాళ్ళు మీటింగులు పెడుతూ ఉంటే!

**అమీన్** : మీటింగు, హెక్డా?

**వెంక** : ఎక్కడేమిటి? రాత్రి ఈ ఊళ్ళోనే మీటింగు బెట్టారు.

**అమీన్** : అరే, మాది ఇజాజత్ (పర్మిషన్) లేకుండా హెట్లాబెట్టారూ?

**జగ** : వాళ్ళపని ఇప్పుడు మీరూ మేమూ కనబడేటట్టుందా?

**వెంక** : కనబడేటట్టుంటే అమీన్‌సాబ్‌గారంతటి వాణ్ణి బట్టుకొని నిన్న మీటింగులో అలా ఎందుకు తిడతారు?

**అమీన్** : హేఫ్టీ? నాకీ తిట్టారా?
(మస్తాన్ సారాసీసా తీసుకొచ్చి టేబుల్‌మీద ఉంచుతాడు).

**జగ** : (గ్లాసులో సారా పోస్తూ) ఒక్క తిట్టడమేనా? మమ్మల్ని, మిమ్మల్ని నాశనం జేసిందాకా వాళ్ళు నిద్రబోరట!
(గ్లాసు అమీన్ చేతికిస్తాడు)

**అమీన్** : (గ్లాసు తీసుకుంటూ) అరే బద్మాష్! (ఒక్క గుక్క తాగి) మీకీ పటేల్కి ఉండీ ఎందుక్కు జరగనిచ్చావ్ మీటింగ్?

**మస్తాన్** : ఏం జేస్తాం హుజూర్? మీటింగ్ ఆపమని దొరవారు పంపితే వెళ్ళాం. చూడండి ఏం జరిగిందో. (వీపు చూపెడతాడు).

**అమీన్** : అరే బాప్‌రే! (గ్లాసు కింద బెడుతూ) హెవడూ ఆ సువ్వర్ నీకీ కొట్టింది?

**వెంక** : ఇంకెవరు గొడతారు? సంఘంవాళ్ళే. ఎంత ఘోరం చూడండి. ఆ దెబ్బలు చూడండి.

**అమీన్** : హిక్డా హెంత జనం హుంది షంగంలో?

**వెంక** : మస్తాన్ బోటి బుద్ధిమంతులు ఎవళ్ళో పదిమంది దప్ప అంతా సంఘంలోనే చచ్చారనుకోండి.

**అమీన్** : (సిగరెట్టు ముట్టిస్తూ) అరే ఊర్‌కి ఊర్ హంతా సంఘంలో చేరిందీ?!

**వెంక** : రౌడీముండాకొడుకులంతా జేరి చంపుతాం, పొడుస్తాం అని బెదిరిస్తే ఈ పిచ్చి మూకంతా జేరింది.

**అమీన్** : హంతా జులం చేశార్గా.

**వెంక** : నేను చెప్పడమెందుకు. చూడండి. మీరే స్వయంగా చూడండి. (దస్త్రం విప్పుతూ) పాపం, ఆ గొల్లముండాకొడుకొచ్చి లబ్బున ఏడ్చాడు. (యల్లమంద కాగితం తీసి అమీన్ చేతికిస్తాడు).

**అమీన్** : (చదివి) అచ్ఛా బులావో. హెల్మాందకో, హిప్డే దర్యాప్తు చేయ్‌వాలి.

**జగ** : మస్తాన్! ఊం వెళ్ళు. యల్లమందను బిల్చుకురా.

**వెంక** : మీ బోటివారు పూనుకోవాలేగాని, ఈ కుక్క గొడుగు సంఘాలెంత సేపు (చిటికేస్తూ) ఇట్టంటే ఎగిరిపోవూ!

**అమీన్** : హంతా తేల్కా కాదూ పట్వారీసాబ్! హివ్వూ హెక్డా జూసినా హిదే గొడ్వా. రోజురోజూ సచ్చిపోతండాం తిర్గాలేక.

**జగ** : ఇలాంటి వెధవల్ని పైకెక్కనిస్తే మీకూ చిక్కే. మాకూ చిక్కే. ఈ దెబ్బతో ఒక్కొక్కడి తలదిమ్ము వదిలించండి.

**వెంక** : మన అమీన్‌సాబ్‌గారి కిదొక లెక్కా? పెద్దపెద్ద కొమ్ములు దిరిగిన హేమాహేమీల్నే చితకగొట్టారు.

**అమీన్** : హది కాదయ్యా, హిదీ సంఘంతో మాకీ పెద్ద పేచీ వచ్చిందీ. మాదీ పోలీస్‌మీదా కూడా సదర్ నాజంకీ షికాయత్ (కంప్లెయింట్) చేస్తుండార్. పేపర్ నిండా మాకీ బద్‌నామ్ చేసి వేస్తుండార్. హీళ్కి జోల్కిపోతే మాకీ కష్టం తెచ్చీ పెడ్తార్.

**జగ** : ఈ పీనుగులు మిమ్మల్ని చేయగలిగిందేమిటి? గుడ్డి కన్ను మూస్తే ఎంత, తెరిస్తే ఎంత? ఇదిగో, మీ కట్నం మీరు తీసుకోండి. (జేబులో నుంచి నాలుగువేల రూపాయల నోట్లు తీసి ఇస్తూ) ఊం కానియ్యండి, మీ దెబ్బ కెదురేమిటి?

**అమీన్** : వద్దూ, మారాజ్ వద్దూ, హిదీ మాకీ పాణంమీద్కి వస్తాది.

**జగ** : మీ ప్రాణం మీదకా?! ఏడ్చారు. అందాకా వస్తే ఇంకా మేం ఉండి ఎందుకు? నాలుగువేలు కాకపోతే పదివేలయితే మాత్రం ఈ సంఘాన్ని నాశనం చేయకుండా వదిలిపెడ్తానా?

**వెంక** : మా దొరవారు మాటంటే వెనక్కి తిరగే మనిషా? మన సర్కారే పోయాక, ఇంకా మనం ఉండి ఎందుకు?

**జగ** : అమీన్‌సాబ్! అందాకావస్తే మీ ప్రాణానికి నా ప్రాణం. సందేహిస్తారేమిటి? ఊం తీసుకోండి (మరో నాలుగువేలు తీసి ఇస్తాడు).

**అమీన్** : అచ్ఛా. అసల్ సర్కార్కీ పోయేటట్టూవుంటే మన్కీ హుండి హెందుకూ!

(పైకం తీసుకొని జేబులో వేసుకుంటూ) చూస్తాన్ హీళీ...తడాఖా. ఈ హుళ్ళో హెంతామంది ముసల్మాన్ లుండార్?

**వెంక** : ఎందుకు లేరు? వాళ్ళూ ఇరవై కుటుంబాల వాళ్ళున్నారు.

**అమీన్** : హోళ్కి మీకీ తరఫ్ హుండార్?

**వెంక** : లేరు సర్కార్! వాళ్ళు కూడా సంఘంలోనే చేరారు.

**అమీన్** : అరే. హోళ్కి బుద్ధిలేదూ! కాఫీర్ (మహమ్మదీయేతర) షంగంలో హెట్టా చేరార్, మాదీ నవాబ్కీ వద్లీ పెట్టి!

(మస్తాన్ ప్రవేశం)

**వెంక** : వాళ్ళందరికి పెద్ద ఈ మస్తాన్ తమ్ముడు సుభానేనండి!

**అమీన్** : క్యారే, నీదీ తమ్ముడూ నీకీ వద్లీ షంగంలోకీ పొయ్యాడ్?

**మస్తాన్** : ఏ జేస్తాను సర్కార్? నెత్తిన నోరు బెట్టుకొని ఎన్నాళ్ళు జెప్పినా వినందే.

**అమీన్** : అరే నాలాయఖ్. సుభాన్‌కో బులావో. నాకీ చెప్పీ చూస్తా. అచ్ఛా హెల్మందా హేడీ?

**మస్తాన్** : ఎక్కడికో చచ్చాడు. ఇంటి దగ్గర లేడండీ.

**వెంక** : సరే, నీవెళ్ళి ముందు సుభాన్‌ని, దాదాసాయబుని పిల్చిరా. (మస్తాన్ అమీనుకు సలాంజేసి వెళ్ళిపోతాడు) సుభాన్‌ని తిప్పడానికి మేమూ ఎంతో ప్రయత్నించామండీ! కాని, లాభం లేకపోయింది. అతను చాలా పెంకెమనిషి.

**అమీన్** : మీకీ చెప్తే హెంద్కూ హింటాడ్ చూడు. హిప్డూ నాకీ పాంచ్ మినిట్‌లో మార్చివేస్తాను.

(పోలీసు, మంగలి రాముడూ ప్రవేశం)

(అమీన్‌ను చూచి శాల్యూట్‌జేసి, పోలీసు అటెన్షన్ ఫోజులో నుంచుంటాడు).

**వెంక** : (పోలీసుతో) ఏం? మీకు కావలసిన సామాగ్రి అంతా దొరికిందా?

**రాముడు** : ముందు డబ్బియ్యండే కోమటాయన ఇయ్యనన్నాడు దొరా!

**జగ** : (కోపంగా) ఆఁ – ఏమిటి?

**అమీన్** : (పోలీసుతో) క్యారే బేవఖూఫ్, హోడ్కీ జుట్టూపట్టి హిక్డా హీడ్చుకరాకా, హిట్టా సచ్చావ్‌బే?

**పోలీస్** : ఏం జేస్తాను హుజూర్? వాడికి కుమ్మక్కుగా బడితలు పుచ్చుకొని పదిమంది జనం వచ్చిపడ్డారు.

**వెంక** : చూశారా? చివరికి బఖాల్ కూడా మీ పోలీసు కెదురుతిరిగాడు. ఇలా ఉంది వీళ్ళ పని.

**అమీన్** : పోవయ్యా, మీరు హాడ్కీ హల్సూ యిచ్చార్. లేకపోతే హింత ఖలేజా?

**పోలీస్** : (దేశముఖ్‌తో) ఇయ్యకపోతే ఇయ్యకపోగా, పైన ఎంతెంత మాట లన్నాడు!

**జగ** : అంటాడంటాడు. ఎందుకనడు? ఇవ్వాళ వాడికి చావు మూడింది. అరే రాముడూ! ముందు పోలీసులందరికీ దివాణంలోనే వంట చేయమని చెప్పు.

**రాముడు** : సిత్తం దొరా! (వెళ్ళిపోతాడు)

**వెంక** : ఈ బకాల్ ఎక్కడికి పోతాడో చూద్దాం. ఇంతకింత వీడి దగ్గర పదింతలు కక్కిస్తాం.

**అమీన్** : హసల్ హిక్డా షంగం పెద్దా హెవడూ?

**జగ** : ఉన్నాడులెండి, ఒక పచ్చిరౌడీ. వీరారెడ్డి.

**అమీన్** : క్యా రెడ్డి? మీదీ రెడ్డి మీకీ హెదురుతిర్గాడ్ అరే! తోబా తోబా!

**జగ** : వాణ్ణి రెడ్డి అనటం కూడా సిగ్గుచేటు.

**వెంక** : ఈ మధ్య మాదిగకొంపల్లో కూడా కూడు తిన్నాడట దౌర్భాగ్యుడు!

**అమీన్** : హెక్డా తింటే హేమ్టీ, హదీ మన్కీ హెంద్కయ్యా? హాడ్కీ పిల్సీ, రెండూ మంచిమాటల్ సేసీ జేబ్‌లో పెట్కో.

**వెంక** : అతను అంతమాత్రానికి లొంగే పిండం కాదులెండి.

**అమీన్** : హేమ్టీ సేతాగానీ మాటా సేస్తావయ్యా! హంత్కీ కాకపోతే, పదీ హెకరాల్ హాడ్కీ హిస్తేసరీ, హేమీ సేస్తాడయ్యా మీదీ మాటా హిన్కా? హప్పట్కీ హిన్కాపోతే నాకీ హుండాన్, హాడ్కీ హుండాడ్.

**వెంక** : చిత్తం. అలాగే తమరు సెలవిచ్చినట్టే చేస్తాం.

**జగ** : ఎవడురా అక్కడ? (రాముడు ప్రవేశం) అరేయ్, అమీన్‌సాబ్‌గారు రమ్మంటున్నారని వీరారెడ్డిని పిల్చిరా.

**రాముడు** : చిత్తం దొరా! (వెళ్ళిపోతాడు)

(మరోవైపు నుంచి మస్తాన్ ప్రవేశం)

**జగ** : ఏం వచ్చారా?

**మస్తాన్** : వచ్చారు మహరాజ్!

**వెంక** : లోపలికి రమ్మను. (మస్తాన్ బైటికి వెళతాడు) – (అమీన్‌తో) మేం కూడా ఉండడం మంచిదికాదనుకుంటాను.

**జగ** : వెళతాం. వాళ్ళతో మీరొక్కరే మాట్లాడండి.

**అమీన్** : అచ్ఛా! అచ్ఛా!

(జగన్నాథరెడ్డి, వెంకట్రావులు వెళ్ళిపోతారు. అమీన్ సిగరెట్టు ముట్టించి పీలుస్తూ ఉంటాడు. మస్తాన్‌తోబాటు దాదా, సుభానుల ప్రవేశం).

**అమీన్** : (బెంచ్ చూపిస్తూ) ఆవ్ భాయి ఆవ్. బైఠో.

**దాదా** : ఎందుకులెండి, ఇక్కడే నుంచుంటాం.

**అమీన్** : అరే మీకీ మాకీ తేడా హేమ్టీ? మందీ మతంలో హంత హోక్టే, బైఠో.

**దాదా** : ఎట్టాగైనా మీరు మహరాజులు. మాదేముంది లెండి బిక్కాపకీర్లం.

**సుభాన్** : ఇంతవరకెప్పుడూ ఇక్కడ కూర్చొని ఎరగం. కొత్తగా ఇవ్వాళెందుకులెండి. మమ్మల్ని పిలిపించారట, ఎందుకు?

**అమీన్** : మీకీ కూడా షంగంలో చేరార్గాదూ?

**సుభాన్** : ఆఁచేరాం.

**అమీన్** : ఆరే! మీకీ కాఫిర్లా (హిందూ) షంగంలో సేరార్! నాకీ హెక్డా చూడలా. హిది హేమ్టీభాయీ? క్యా దాదా? నీకీ కూడా షంగంలో చేరావ్?

**మస్తాన్** : ఏదో తెలవక చేరారులెండి.

**సుభాన్** : తెలిసే చేరాం. ఇది కాఫిర్ల సంఘం కాదు, బీదోళ్ళ సంఘం.

**అమీన్** : బీదోళ్ళాషంగం! (వెకిలినవ్వు నవ్వి) అరే దీవానా, నీకీ హేమ్టీ తెల్సు, హిందువుల్కీ చేసే కిలాడి.

**దాదా** : ఇక్కడ అదంతా ఏమి లేదులెండి! అంతా కలిసే ఉంటాం.

**సుభాన్** : ఇందులో హిందువులు చేసే కిలాడి ఏముంది?

**అమీన్** : కిలాడి గాకపోతే హేమ్టీ? మన ఆసఫ్‌జాహీ సర్కార్‌కీ బోల్తా కొట్టించే హండ్కూ హోల్కీ షంగం పెట్టార్. మీరు పోయి బరాబర్ హోల్కీ దోఖాలో బడ్డార్.

**సుభాన్** : పైనుంది ఆజంజాహీ సర్కారో, ఆంగ్రేజ్ సర్కారో. మా కంటికి కనపడేది మాత్రం ఈ దేశముఖు సర్కారే.

**అమీన్** : అరే, ఈ దేశముఖుదీ హేమ్టీ హుందోయ్? హీళ్ళా హందర్కీ పైనా మందీ నవాబ్ హుండాడ్. హీళ్ళూ హంతా హోయనా హెట్టా సెప్తె హట్టా సేయ్‌వాలి.

**దాదా** : అయితే, ఈ జరిగే జులం అంతా ఆయనగారే చేయమన్నాడా ఏమిటండీ?

**సుభాన్** : అవును. ఇదంతా ఆయనగారి చలవే.

**అమీన్** : అరే హేమ్టీ హట్టా అంటావ్? మందీ నవాబ్ లేకపోతే నీకీ హెక్డా హుండేవాడవ్.

**సుభాన్** : ఎక్కడుంటాం? ఇక్కడే ఉంటాం. ఈయన ఉండి మా కొరిగించే దేముంది? ఈయన లేకపోతే మాకు పోయేదేముంది? గోచీకి మించిన దరిద్రం ఏమిటి?

**అమీన్** : అరే! మందీ రాజ్యం చేసేజాతి. హేమ్టీ బానిసా మాటాసేస్తావ్?

**దాదా** : ఏమి రాజ్యమో! ఏమి రాజులమో?

**సుభాన్** : రాజులకు (చినిగిన చొక్కా చూపిస్తూ) కనపడతానే ఉందిగా దాదా. మన రాజుల దర్జా!

**అమీన్** : క్యారే? నీకీ మతం మట్టీ లేదూ హేమ్టీ?

**మస్తాన్** : కాఫిర్ల దోస్తీబట్టి తిరిగేవాడికి ఇంకా మతమేమిటి? మట్టేమిటి?

**దాదా** : గుడ్డొచ్చి పిల్లనెక్కిరించినట్లు నీవుకూడా మాకు వంకబెట్టబోతున్నావా? నీ జీవితంలో అసలెప్పుడన్నా నీవు నమాజ్‌జేసి ఎరుగుదువ్?

**సుభాన్** : (నవ్వుతూ) ఆయన జేయకపోవడమేం దాదా? నీవు రోజుకయిదుసార్లు అల్లాకి సలాంజేస్తే, ఆయన రోజుకి యాభైసార్లు సలాం కొడతాడు.

**దాదా** : ఎవరికి?

**సుభాన్** : ఎవరికా? దేశముఖు జగన్నాథరెడ్డిగారికి.

**అమీన్** : క్యారే గఁవార్? నీకీ మర్యాదా, మంచి హేమీలేదు.

**సుభాన్** : పేద ముండాకొడుకులకి మాకీ మర్యాద లెందుకులెండి, కడుపులోకి కాస్త మేతబడితే చాలు.

**అమీన్** : ఏయ్ సుభాన్! నీదీ మంచీకోరి చెప్తన్నా హిన్కో, మీకీ షంగం కావాలంటే మందీ వేరే షంగం హుంది. హందులో మీకీ చేర్తే మంచీ హుంటాది.

**దాదా** : ఏమిటి బాబూ ఆ సంగం?

**అమీన్** : మజలిసే ఇత్తిహదుల్ ముసల్మీన్.

**దాదా** : ఎక్కడుంది అది? మే మెప్పుడూ దాని పేరన్నా వినలేదే?

**సుభాన్** : ఉందిలే దాదా ఒకటి, జాగీర్‌దార్ల సంఘం.

**అమీన్** : అరే జాగీర్‌దార్ హేమ్టీ, మందీ ముసల్మాన్‌లంతా హందులో కల్వవచ్చు.

**సుభాన్** : దేనికి? జాగీర్‌దార్ల నౌకరీ చేయడానికా? ఇప్పటికీ దేశముఖులతోనే చచ్చిపోతున్నాం. ఇంకా జాగీర్‌దార్ల కొలువెందుకులెండి?

**అమీన్** : మన్కీ ముసల్మానుల్కీ హిట్టా హుండాం కాబట్టే, బీహార్‌లో హిందువుల్ మన్కీ సఫా సఫా జేస్తుండార్.

**సుభాన్** : బెంగాల్లో మనవాళ్ళూ చేసిందదేగా? బీహార్‌లో, బెంగాల్లో, పంజాబ్‌లో ఎక్కడ చచ్చినా చివరికి మాబోటి పేదాళ్ళేగా?

**అమీన్** : హైతే హింత్కీ మీరు ఆ కాఫిర్లాషంగంలోనే హుంటార్?

**సుభాన్** : కాఫిర్ల మీద నిజంగా మీ కంత కోపమే ఉంటే ఈ దేశముఖు ఇంట్లో ఎందుకు మకాం బెట్టారండి! ఆయన మట్టుకు కాఫిర్ గాడా? ముసల్మానా?

**అమీన్** : (కోపంతో బల్లగుద్ది కండ్లురుముతూ) అరే గధా! (గాడిదా) నీకీ ఫకీర్కీ హుండావ్. ఆయన్కీ మహరాజ్‌కీ వంకాబెట్టావ్.

**సుభాన్** : చూస్తున్నావా దాదా. మత మేదయితే ఏం? చివరికి ఫకీర్లు ఫకీర్లే. దొరలు దొరలే.

**దాదా** : పద! ఇక్కడికొచ్చి పైగా మాటలు పడడం ఎందుకు?

(ఇద్దరూ వెళ్ళిపోతారు.)

**అమీన్** : (లేచి) ఏయ్ బూఢా, ముసల్మానికి పుట్కా పుట్టార్ గాబట్టి మీకీ వద్లీ పెడ్తుండా. హిప్పట్కీహైనా బుద్దీగల్గీ బత్కండి, మళ్ళీ మళ్ళీ చెప్తండా.

(దాదా, సుభానులు వెళ్ళిపోతారు. అమీన్ మళ్ళీ ఒక డోసు వేస్తూ ఉంటాడు).

**మస్తాన్** : అసలు చేసిందంతా ఈ ముసలాడే.చూడండి, పైకి ఎంత పిల్లిలాగ కనబడతాడో!

**అమీన్** : హాక్కీ దెబ్బాకీ హంతా వదుల్తాది. హీడ్కీ గోరి కట్టిచ్కాపోతే చూడు నాదీ దెబ్బ!

(దేశముఖు, పట్వారీల ప్రవేశం)

**జగ** : క్యా అమీన్‌సాబ్, దారికొచ్చారా?

**అమీన్** : హాళ్కీ షంగం పిచ్చీ బాగా తల్కీ పట్టింది. ఖాలీ మాటల్కీ సేస్తే హింటార్?

**జగ** : ఇవ్వాళ మాటలతో వినకపోతే రేపు లాఠీలతో వింటారు సరే; మీరు వచ్చి చాలా సేపయింది. కొంచెం విశ్రాంతి తీసుకోండి (రాముడు వచ్చి నుంచుంటాడు.) ఆ వచ్చేవాడి వ్యవహారం నేను చూస్తాను.

**అమీన్** : అచ్చా అచ్చా నాకీ హెళ్ళి ఆరాం సేస్తా. మీదీ మాటా హిన్కాపోతే నాకీ ఖబర్ చెయ్.

(మస్తాన్ దారి జూపుతూ ఉంటాడు. అమీన్ వెళ్ళిపోతాడు.)

**వెంక** : ఏం రా! అతను వచ్చాడా?

**రాముడు** : ఆ వచ్చిన్రు అయ్యగారూ.

**వెంక** : సరే తీసుకురా (దేశముఖ్ కుర్చీమీద, వెంకట్రావు బల్లమీద కూర్చుంటూ ఉంటారు.)

(రాముడు వెళ్ళి మళ్ళీ వీరారెడ్డితో ప్రవేశిస్తాడు).

**జగ** : అరే రాముడూ వెళ్ళు, నీవు నీపని జూసుకో.

(దణ్ణం పెట్టి రాముడు వెళ్ళిపోతాడు)

**జగ** : (నవ్వు మొఖంతో వీరారెడ్డి దగ్గరకెళ్ళి) ఏమిటోయ్ వీరారెడ్డి! ఈ మధ్య నీకేదో ఉద్యోగం దొరికిందని విన్నానే-నిజమేనా?

**వీరా** : నాకా! ఉద్యోగం? అసలు నేనెప్పుడూ ప్రయత్నించలేదే.

**జగ** : అలాగా, (పట్వారీ వైపు జూచి) ఏమిటయ్యా అలా అన్నావ్?

**వెంక** : ఈ మధ్య ఏదో ఆఫీసులో ఉన్నాడని మావాడన్నాడులెండి.

వీరా : అవును. ఈ మధ్య కొన్నాళ్ళు తాలూకా ఆంధ్ర సంఘం ఆఫీసులో ఉన్నాను. కాని అదేమీ ఉద్యోగం కాదే!

వెంక : (నవ్వుతూ) ఇంకేం! దాన్నిబట్టే మావాడలా అనుకున్నాడేమోలెండి.

జగ : ఎక్కడో తాలూకాలో బోయి పడుండడం ఎందుకోయ్ వీరారెడ్డీ కావాలంటే నేనివ్వనూ నీకిక్కడ ఉద్యోగం?

వీరా : నా కెందుకు? అసలు నేను ఉద్యోగం చేయదలచుకోలేదు.

జగ : అది మంచిదేకాని, అసలు మన కులంలో చదువుకున్నవాళ్ళే తక్కువ. చదువుకున్న మీబోటోళ్ళు ఒకళ్ళూ, అరా యిలాగే అనుకుంటే, ఇంకా మనవాళ్ళు ఎలా పైకివస్తారు?

వెంక : ఏమిటయ్యా తెలిసినవాడివి నీవు కూడా అలా మాట్లాడతావ్? ఎన్నాళ్ళు తంటాలు పడతావ్ ఆ నాలుగెకరాలతో.

వీరా : ఏదో మా అవస్థ మేం పడతాంలెండి.

జగ : (వీరారెడ్డి భుజంమీద చరుస్తూ) ఉద్యోగం లేకపోతే నీవేదో ఒక విధంగా బ్రతకలేవనికాదు నేను చెప్పేది. నేనా ఒక్కణ్ణి. వ్యవహారాలేమో రోజురోజుకీ పెరిగిపోతున్నయ్. ఎన్నని సర్దుకోను?

వీరా : అయితే నన్నేం చేయమంటారు?

జగ : మనలో చదువుకున్నవాడివి నీవుండగా నాకెందుకీ భారమంతా. పోనీ పటేల్‌గిరీ తీసుకో. నీ యిష్టం వచ్చినట్టే గ్రామాన్ని నడుపు. నేనేదో చేస్తున్నానని మీరంతా అనుకోవడమెందుకు?

వెంక : ఏమిటయ్యా పిచ్చోడా, ఇంకా ఆలోచిస్తావు. కొండంత అండ దొరికింది. అదృష్టవంతుడివి. ఎద్దుముడ్డి పొడుచుకునే రాత నీకేం పట్టింది?

వీరా : పటేలంటే ఏమిటో నాకు తెలుసులెండి, నాకేం అక్కర్లేదీ ఉద్యోగం.

జగ : సరే, నా చేతనైన సహాయమేదో చేస్తానన్నాను. తర్వాత నీ ఇష్టం.

వెంక : ఏమిటయ్యా వీరారెడ్డీ, నీమీద అంత అభిమానంగా ఉన్న దొరవారికి వ్యతిరేకంగా నీవు పనిచేయడమంటే, నాకేం బావుండలా.

వీరా : ఎందుకండి బాబు, నామీద మీకంత అభిమానం?

వెంక : ఎలాగైనా దొరవారి కులస్థుడివి.

వీరా : కులం అంటే నేనొకణ్ణే కాదుగా. ఊళ్ళో మూడువంతులు రెడ్లే.

వెంక : కాబట్టే చెప్తున్నాను. రెడ్లే మన రెడ్డి దొరవారికి వ్యతిరేకంగా పని చేయడం ఏం సబబు?

వీరా : పండ్లూడగొట్టుకోవడానికి ఏరాయయితే ఏముందండీ వెంకట్రావు గారూ?

వెంక : శివ శివా! చల్లని ప్రభువు నెంత మాటన్నావయ్యా? అదిగో చూడు..ఆ ఎదురుగా ఉన్న రామమందిరం కట్టించింది దొరవారు కదూ! అలాంటి పుణ్యాత్ముణ్ణి.

వీరా : అవును. గొప్పపని చేశారు. అరక్కి పాతిక రూపాయల చొప్పున వసూలుజేసి కట్టించారు. ఎడ్లతో బండ్లతో నానా అవస్థలు పడి రాయీ రప్పా తోలింది మేము. చివరకు పేరు మాత్రం దొరగారిది. (దేశముఖు వీరారెడ్డిపై గుడ్లు మిటకరిస్తూ ఉంటాడు.)

వెంక : చాల్లేవయ్యా, బయల్దేరావ్. ఈనాటికి పెద్ద దేశభక్తుడివి! నీ మాత్రం దేశభక్తి అందరికీ ఉంది. (కట్టుపంచ చూపుతూ) మిల్లుబట్ట మానేసి ఆరుమాసాల నుంచీ నేనూ ఖద్దరు కడుతున్నాను, ఏమిటనుకున్నావో?

వీరా : అబ్బ! గొప్ప త్యాగమే చేశారు!

జగ : చేసినా మేమే చెయ్యాలి. నీవేం చేస్తావోయ్? సన్యాసి సన్యాసి రాసుకుంటే బూడిదే రాలేది.

వెంక : అంతే? మొన్న కస్తూరిభా ఫండుకి డబ్బుగావలసివస్తే దొరవారు నాలుగువేల రూపాయలిచ్చారు. నీవేం ఇచ్చావ్?

వీరా : అవును. మీలాగా ఆవుల్ని జంపి, చెప్పులు దానం చేసే ప్రభువులు చాలామంది ఉన్నారు. కాంగ్రెసు పేరు నాశనం చేయడానికి. ఇంకేం మీరు కూడా కాంగ్రెసులో కలవకపోయారా?

వెంక : అవును. మేమూ కాంగ్రెసే. మొన్న నరసింగరావుగారు, రామకృష్ణారావు గారు వచ్చినప్పుడు ఎక్కడ మకాం జేశారు. మా దివాణంలోనా? మీ గుడిసెల్లోనా?

వీరా : ఎందుకు మకాం జేయరు? అందులో ఒకరు దేశముఖు, మరొకరు జాగీర్దారు.

వెంక : ఏమయితేఁ నీవు వారికంటే గొప్ప దేశభక్తుడవా?

వీరా : నేనేం దేశభక్తుణ్ణిలెండి? మీబోటి దేశముఖుల, పట్వారీల పంచజేరిన ఆ పెద్దమనుషులే దేశభక్తులు. అలాంటి దేశభక్తుల చేతులతో కాంగ్రెసు తీర్థం పుచ్చుకున్న మీరు అంతకంటే గొప్ప దేశభక్తులు.

వెంక : నీకు తోడు వాళ్ళకు వంకబెట్టపోయావ్! అసలు గాంధీగారు చెప్పిందేమిటి? నీవు చేసేదేమిటి?

వీరా : అదేమిటో తమరే సెలవివ్వండి.

వెంక : అసలు ఆ మహాత్ముడేమన్నాడు? రైతులకు దేశముఖులు, జమీందార్లు ధర్మకర్తలుగా ఉండాలన్నాడు. నీవెక్కడో నాలుగు గాలికూతలు నేర్చుకొని, అసలు దేశముఖులే పోవాలన్నావటగా నిన్న మీటింగులో?

వీరా : హుఁ, రైతులకు దేశముఖులు ధర్మకర్తలు! మేకలకు తోడేళ్ళు కాపలా అన్నమాట.

(అమీన్‌ని పిలవమని దేశముఖు మస్తాన్‌కి సైగ జేస్తాడు).

జగ : ఆ లుచ్ఛాతో యెందుకోయ్ కంఠశోష? చెప్పుతినే కుక్కకు నెయ్యి కూడు ఇముడుతుందా?

వీరా : ఇది నెయ్యికూడు కాదు, విషపుకూడు. ఇలాంటి ఆశలుబెట్టే ఇదివరకు కొంతమందిని బోల్తా కొట్టించారు. కాని, ఇక ఆ మంత్రం అందరిమీదా పారదు. మీ పని మీరు చేసుకోండి, మా పని మేం చేసుకుంటాం. (వెళ్ళబోతాడు).

(అమీన్ ప్రవేశం)

జగ : అమీన్‌సాబ్! (వీరారెడ్డిని అరెస్టు చేయమని సైగ చేస్తాడు)

అమీన్ : ఏయ్. ఠైరో.

(వీరారెడ్డి నుంచుంటాడు)

(వీరారెడ్డి దగ్గిరకెళ్ళి) గిరఫ్తార్.

(పోలీసులు వీరారెడ్డి చెరొక చెయ్యి పట్టుకుంటారు.)

(తెర పడుతుంది)

# 5

# వీరారెడ్డి ఇల్లు

(సీతమ్మ నాయకుల ఫొటోలు తీసి తుడుస్తూ సామాన్లు సర్దుతూ పాడుతూ ఉంటుంది)

గీతము పాడగదే – ధాటిగ
గీతము పాడగదే. ॥గీతము॥
(గాంధీజీ ఫొటో చూచి)
దున్నే వారికె అన్ని హక్కులని
దోచేవాడికి దోహద మీనని
పలికిన పలుకులు నిలుపుకొనాలని ॥గీతము॥
(నెహ్రూ ఫొటో చూచి)
తిండిని దోచే దుండగులందరి
గుండెల చీల్చే కుత్తుక నులిమే
తరుణమిదే గద త్వరపడవేమని ॥గీతము॥
(ఆంధ్ర మహాసభ నాయకుని ఫొటో చూచి)
రాక్షసి మూకల రక్తపిపాసుల
నురుమాడుటకై పరుగున రండని
పిలిచిన పిలుపును విని కదిలామని ॥గీతము॥

(కమల ప్రక్కనుండి వింటూ పాట పూర్తి అవుతూ ఉండగా ప్రవేశిస్తుంది. దాదా, సుభానులు కూడా బైటినుంచి ప్రవేశిస్తారు).

**దాదా** : (నవ్వుతూ) అమ్మాయి అప్పుడే సంఘం పాటలు కూడా నేర్చుకుందే!

**సుభాన్** : కమలమ్మ ఇంట్లో ఉండగా ఇంకా పాటలకేం తక్కువ?

**కమల** : (చిరునవ్వుతో) మా వదినకు నేను నేర్పేదేముంది? అన్నయ్య నేర్పాడు.

**దాదా** : అవునులే. మా అమ్మాయికి అన్నయ్య నేర్పాడు. రేపు వచ్చే మా మనవడికి నీవు నేర్పు.

**సీత** : ఈమె ఆయనకేం నేర్పక్కరలేదులే! ఆ అబ్బాయి కూడా సగం పెద్దేగా!

**దాదా** : ఇంకేం? చిక్కులేదు. ఇద్దరూ చెరొక జెండా ఏసుకొని ఊళ్ళెమ్మట తిరగొచ్చు. (కమల సిగ్గుతో తల వంచుకుంటుంది. సీతమ్మ నవ్వుకుంది).

**సుభాన్** : (సీతమ్మతో) ఏం వదినా, అన్నయ్యేడీ, ఎక్కడికెళ్ళాడు?

**సీత** : మీకు కన్పడలా? మీ వెనకమాలే వచ్చారుగా!

**దాదా** : ఎక్కడికీ? గడీకా?

**సుభాన్** : అక్కడకొస్తే మాకు కన్పడాలిసిందేగా!

**కమల** : రాముడొచ్చి అమీన్ రమ్మన్నాడని పిల్చాడు. మీరు కూడా గడీకే వెళ్ళారని తెలిసి, అన్నయ్య కూడా అక్కడికే వచ్చాడు.

**దాదా** : అట్టాగా, అయితే ఆయనేదారిన ఎళ్ళాడో, మేం ఏదారినవచ్చామో!

**సుభాన్** : రానియ్. ఆయన దగ్గిరేం నాటకం ఆడుతున్నాడో అదీ తెలుసు కుందాం.

**కమల** : ఏమిటా నాటకం?

**దాదా** : ఏముంది, ఏదో ఒక విధంగా మమ్మల్ని బుట్టలో వేసుకోవాలని చూశాడు.

**కమల** : మిమ్ముల్నే! బుట్టలో వేసుకోవాలని చూశాడుగా? ఏమన్నాడేంటి?

**సుభాన్** : ఏమంటాడు? మీరంతా హిందువులంట. మేం సాయిబులమంట. నవాబుకు వ్యతిరేకంగా సాయిబులు పనిచేయడం తప్పంట! పాప మంట!

**కమల** : ఆయనకేం నవాబు! కొన్ని కోట్ల రూపాయలున్నాయి. మరి మీకెన్ని కోట్లున్నాయి?

**దాదా** : లేకేం, నాకూ ఉన్నాయి చినిగిపోయిన రెండు పాతకోట్లు.

**సుభాన్** : ఎక్కడివి, నీ పెండ్లికి కుట్టించినయ్యా?

దాదా : (నవ్వుతూ) అబ్బో! నా పెండ్లికి తోడు రెండు కోట్లు కూడానా? అందులో ఒకటి మా అయ్యది.

(అందరూ నవ్వుతూ ఉంటారు)

(రామిరెడ్డి, యల్లమందల ప్రవేశం)

యల్ల : (వస్తూనే) నాయాళ్ళు! యల్లమందంటే ఏందో అల్లాటప్ప అనుకున్నారు!

దాదా : ఏం, మాజోరుగా ఉంది? వేశావా ఏంటి రెండు ముంతలు?

యల్ల : ఏంది కల్లా! కల్లు! సంగం పొత్తకంలో యేలద్దిన్నాడే ముంత పగలనూకినా, ఏందనుకున్నావో!

దాదా : అయితే ఇవ్వాళ మస్తాన్ ఏమన్నా నీచేతికి చిక్కాడా ఏంటి?

యల్ల : మత్తానయ్యే చిక్కినట్టయితే అబ్బా! టుర్ర్, కీ...........

(అందరూ నవ్వుతారు)

రామి : తస్సదియ్య! ఇయ్యాల యల్లమంద వంకరకర్ర తిరగేసి నా సామిరంగ దంచో దంచు!

సుభాన్ : ఎవర్ని? ఏమిటి?

సీత : ఏమిటి రామయ్యా! అసలెవర్ని కొట్టింది?

యల్ల : ఎవర్నేంది? రౌడీసుని.

దాదా : ఎందుకు? ఏం జరిగింది?

రామి : నాకసలు నిద్రబట్టిందా, నా గిత్త బోయినకాడనుంచి దివాణపు గొడ్లన్నీ చెరువు కెట్టాగూ రావాలిగా! మనాళ్ళందర్నీ తీసికెళ్ళి ఇయ్యాల కాపలాగాశా. ఎక్కడికి పోతుంది దొరక్క? దాని అబ్బగాడి బాకా? నీళ్ళు తాగుతూ ఉండగా పోయి గిత్తని పట్టుకున్నా.

సీత : వాళ్ళు చూస్తూ ఊరుకున్నారా?

రామి : ఆళ్ళెవళ్ళు అక్కయ్యా! ఆడి పాలేళ్ళంతా మన సంగంలోనే ఉంది!

యల్ల : పెద్ద మొగోళ్ళులాగ ఎవళ్ళో ఇద్దరు రౌడీనాయాళ్ళు వచ్చారు జుట్టెగరేసుకుంటా!

సుభాన్ : (నవ్వుతూ) అదా సంగతి? ఆళ్ళిద్దరిపనీ నీవు బట్టావన్నమాట!

**కమల** : భలే పనిజేశావ్ యల్లమందా! సరే, కూచో! (యల్లమంద లోపలి కెళతాడు).

**రామి** : మనదేముంది సుభాన్? అసలు గూడెం వెళ్ళాలి కనపడాలి. ఏం కట్టుగా ఉంది. చెరువు దగ్గిర కాస్తి గల్లంతు జరిగేటప్పటికి గుతపలు (లాఠీలు) తీసుకొని గూడెం అంతా కదిలివచ్చిందనుకో మన తరఫున.

**సుభాన్** : అవును మరి ఈ దేశముఖు గూడాన్ని బెట్టిన తిప్ప లిన్నా అన్నా? నిలువునా ప్రాణాలు తోడాడనుకో. దేశముఖుని ఇవ్వాళ గూడెంలో అడుగుబెట్టమను, కనబడుతుంది వాడి బతుకు.

**దాదా** : నిజమే. వాళ్ళుకూడా మనతోపాటు చావుకీ బతుక్కీ తయారయ్యారు. కాని, గింజలు దొరక్క పాపం వాళ్ళు చాలా ఇబ్బంది పడతున్నారంట.

**కమల** : పాపం, వాళ్ళు అలా ఇబ్బంది పడుతూవుంటే మనం మాత్రం చూస్తూ ఎలా ఊరుకుంటాం? మన చేతనైన సహాయమేదో చేయాలిగాని.

**సీత** : మనకున్న దాంట్లోనే కాసిని వాళ్ళకిచ్చి కాసుక తాగమందాం. గానుగలోదే గంటెడు. ఏం జేస్తాం?

**దాదా** : అంతేలే అమ్మా! తర్వాత తిప్పలేమన్నాగానీ.
(యల్లమంద పలక తీసుకొచ్చి, రొండునవున్న చెకుముకి సంచి తీసి అందులో నుంచి బలపం తీస్తూ ఉంటాడు.)

**రామి** : అదేమిటోయ్ యల్లమందా, నీకు పలకెందుకు?

**యల్ల** : అచ్చరాలు రాపిచ్చుకోవాలి అమ్మాయి సేత.

(కమల చేతికి పలక, బలపం ఇస్తాడు)

**దాదా** : (ఆశ్చర్యంగా) ఓరి నీ దుంపతెగ! ఇప్పుడేం చదువోయ్ నలభై ఏళ్ళు వచ్చాక?

**యల్ల** : ఓయ్, చదువుకోకపోతే యెట్టా? మన సంగంవారు వేసే కాగితాలు చదువుకోవద్దా మరి!

(అంతా నవ్వుతారు)

**రామి** : తస్సదియ్య! అట్టా ఉండాలి పట్టుదలంటే!

**సీత** : చదువేమిటి పాటలు కూడా నేర్చుకుంటున్నాడుగా అమ్మాయి దగ్గిర!

**దాదా** : ఓరి నీ యేటుగాల! మా అందరికంటే నీవే మెరుగే; ఏదీ ఒక పాట పాడు.

**యల్ల** : వాయ్, పాటలు నాకేం వత్తయ్?

**రామి** : ఈ వేషాలన్నీ కుదరవు లేవోయ్. మా అక్కయ్య అబద్ధం ఆడకేం! ఊఁ పాడవోయ్ పాడు (అంటూ చెయ్యిబట్టి లాగుతూ ఉంటాడు).

**సీత** : నా మాట అబద్ధమైతే పంతులమ్మగా రెదటే వుందిగా. అడగండి.

(కమల నవ్వుతుంది)

**సుభాన్** : సంఘం పాటలు నేర్చుకుంది దాచుకోవటానికా యేం? పాడవోయ్, మనకు భయమేమిటి?

**యల్ల** : పాట లెందుకయింది, నాకు వచ్చింది సుద్దులైతేను.

**రామి** : సుద్దులైతే మరీ మంచిది. తప్పకుండా పాడాల్సిందే.

**కమల** : ఇక తప్పదులే పాడు యల్లమందా!

**యల్ల** : ఒక్కొణ్ణి ఎట్ట బాడను? 'ఆ' కొట్టేవాళ్లుండొద్దా?

**రామి** : నేనూ సుభాన్ 'ఆ' కొడతాంలే కానీయ్. రా సుభాన్! (సుభాన్, రామిరెడ్డి యల్లమందకు చెరొక ప్రక్కన నుంచుంటారు. చెవికి చేయి ఆనించి, యల్లమంద 'ఆఁ' అంటూ శ్రుతి గలుపుతాడు).

**యల్ల** : ఏందయ్యా. 'ఆఁ' కొట్టకుండా ఇకిలిత్తారేం?

**సుభాన్** : సరే కానీయ్. (ఇద్దరూ 'ఆ' అంటూ అతని శ్రుతిలో

**రామి** : శ్రుతి కలుపుతారు.)

**యల్ల** : -- సుద్దులు --

హరి హరి నారాయణ ఆదినారాయణ
కరుణించి మమ్మేలు కమలలోచనుడ॥
గొఱ్ఱెల గోత్రాలు గొల్లల కెరుక
గొల్లల గోత్రాలు గొఱ్ఱెల కెరుక
గొఱ్ఱె గొల్లల గోత్రాలు తోడేళ్ళ కెరుకో॥
పటేళ్ళ గోత్రాలు అమీన్ల కెరుక
అమీన్ల గోత్రాలు పటేళ్ళ కెరుక

అమీన్ల పటేళ్ళ గోత్రాలు గ్రామస్థుల కెరుకో॥
దేశముఖుల గోత్రాలు జాగీర్దార్ల కెరుక
జాగీర్దార్ల గోత్రాలు దేశముఖుల కెరుక
దేశముఖ్ జాగీర్దార్ల గోత్రాలు ఆంధ్రమాసబ కెరుకో!
నైజాం గోత్రాలు కుంపినోళ్ళ కెరుక
కుంపినోళ్ళ గోత్రాలు నైజాము కెరుక
నైజాం కుంపినోళ్ళ గోత్రాలు మా సంగంవారి కెరుకో!

(సంతోషంగా అందరూ చప్పట్లు కొడతారు)

**దాదా** : సెబాస్! బలేగా పాడావ్ యల్లమందా!

**కమల** : మరేమిటనుకున్నారు యల్లమందంటే! చూడండి, పది రోజుల్లో మన సంఘం పేపరే చదివేస్తాడు.
(యల్లమంద నవ్వుతూ గొంగలి కిందేసుకొని కూర్చొని, అక్షరాలు దిద్దుకుంటూ ఉంటాడు.)

**దాదా** : మరచిపొయ్యాను. అసలియ్యాల మన సంగం పేపరొచ్చిందా?

**రామి** : రాకపోవడమేమిటి? నేనేగా రాత్రి తెచ్చింది?

**సీత** : దీపం బెట్టుకుని రాత్రి నడిజాందాకా చదువుతానే ఉంది అమ్మాయి.

**దాదా** : ఇయ్యాల సంగతులేందో చెప్పలేదే అమ్మాయి.

**సీత** : కుంపిణీనుంచి ఎవళ్ళో మన దేశం చూడ్డానికొస్తే, వారిమీద కూడా తుపాకులు కాల్చారంట! వీళ్ళ చేతులిరగ!

**దాదా** : ఎవళ్ళు? బందరునుంచి వచ్చిన ఆ పెద్ద మనుషుల మీదనా? ఆ సంగతి మనకిదివరకే తెలిసిందిగా?

**రామి** : కుంపిణీ నుంచి వాళ్ళసలిక్కడి కెందుకొచ్చారు సుభాన్?

**సుభాన్** : మన కష్టసుఖాలు తెలుసుకోడానికే.

**యల్ల** : మన కట్టసుకాలు తెలుసుకోని కుంపిణీలో వాళ్ళేం జేత్తారేంటి?

**సుభాన్** : కుంపిణీలోవాళ్ళంటే ఎవళ్ళు? వాళ్ళూ మన తెలుగోళ్ళేగా? మనం కష్టపడుతూ వుంటే, మనోళ్ళు చూస్తూ ఊరుకుంటారా ఏమిటి? ఇక్కడ జరిగే సంగతులన్నీ కండ్లారా చూసి అక్కడికెళ్ళి మనాళ్ళందరికీ చెప్పుదాం అని వచ్చారు.

**యల్ల** : అదిగదీ సంగతీ! మళ్లీ ఇంటికెళ్లినాక ఈడ జరిగే అన్నేయమంతా మనాళ్ళకు జెప్తారుగా? అందుకనే అసలు ఆళ్ళను జంపేస్తే ఏ పీడా లేదనుకున్నారు దొంగనాయాళ్లు.

**దాదా** : ఇదంతా చేయించింది ఆ ప్రతాపరెడ్డేగా.

**కమల** : అవును, ఆ దుర్మార్గుడే.

**రామి** : ఎవడు? ఆ లక్షాముప్పైవేల ఎకరమోడా?

**సుభా** : వాడే, ఊళ్ళకూళ్ళు లేవగొట్టి తోటేసుకున్నాడు.

**యల్ల** : తల్లి సిగదరగ! తోటంటే తోటా! ఒకసారి దారి పయాణంబోతా తోట కీ దరిని సద్దిదాగి బయల్దేరితే, మళ్ళీ ఆ దరి కెల్లేటప్పటికి ఏనుగూ కిందంటే నమ్ము.

**కమల** : నిజమే. అలాంటి పెద్ద తోట మొత్తం మన భారతదేశంలోనే లేదంట!

**సుభా** : వాడి ముల్లేంబోయింది? యెంత తోటైనా వేయిస్తాడు, చుట్టుపక్కల ఊళ్ళ వాళ్ళందరిచేత వెట్టిజేయించి.

**కమల** : వేయించినన్నాళ్ళు వేయించాడు. ఇక ఆ పప్పులేమీ ఉడకవ్. ఆ ఊళ్ళన్నీ ఇప్పుడు సంఘంలో చేరాయి.

**యల్ల** : (హుషారుగా చంకలుగొడుతూ) చేరినయ్! ఇక కూసోని ఏడవమను.

**సీత** : సంగంలో జేరినందుకు మన్ని వీడే ఇన్ని ఇబ్బందులు పెడతన్నాడు. ఇక వాడెన్ని చెరలు పెడతన్నాడో వాళ్ళని?

**సుభా** : ఎందుకు బెట్టడు? పోలీసుల్ని తీసుకొచ్చాడు, పట్టపగలే కొంపలు దోయిస్తున్నాడు. ఆడోళ్ళ పరువు దీయిస్తున్నాడు. వాడు చేయగలిగినదంతా చేస్తూనే ఉన్నాడు. చివరికిప్పుడు మిలటరీ వాళ్ళని కూడా ఊళ్ళల్లో దింపాడు.

**యల్ల** : ఎవళ్ళని, సిపాయోళ్ళనా? ఆళ్ళు మరీ కటికోళ్ళంటగా?

**కమల** : అయితేం? ఎలికబోను ఎలిక్కే ఉంటుంది. పులిబోను పులికే ఉంటుంది. వాళ్ళేలికేస్తే, మనాళ్ళు కాలికేస్తున్నారు.

**దాదా** : ఏం జేస్తే ఏం లాభం? వాళ్ళకి తుపాకులున్నాయ్, మనకి లేవు.

**యల్ల** : అదేనే సిన్నయ్యా, అసలొచ్చిన చిక్కు. నాకుమల్లే ఆణ్ణి కఱ్ఱబట్టుకొని

బ్రిమీదికి రమ్మను. కనబడద్ది – దెబ్బకి నాయాల టుర్ర్, కీ....

**సుభాన్** : అందుకనే వీలున్నప్పుడు దెబ్బకి దెబ్బ తీస్తాం. వీలు తప్పితే తప్పుకొని ఆత్మరక్షణ జేసుకుంటాం.

**యల్ల** : ఆత్మరచ్చన, అదేందయ్యా సుబానయ్యా?

**కమల** : 'ఆత్మరక్షణ' అంటే ఏం లేదు యల్లమందా! మన్ని మనం కాపాడుకోవడమే.

**యల్ల** : (పకపక నవ్వుతూ) ఏందీ' మన్ని మనం కాపాడుకోటం? ఓయ్! మరి మన్ని మనం కాపాడుకోపోతే మత్తానయ్య గాపాడతడా? ఇక రెండు చేతుల్తో బువ్వదిన్నట్టే.

**సుభాన్** : అందుకనే మనం కూడా నేర్చుకుంటున్నాంగా!

**రామి** : ఏమిటి నేర్చుకునేది కబుర్లు! ఒకేపు పోలీసులొచ్చి ఊళ్ళో గూచుంటేను.

**సుభాన్** : గిత్తో గిత్తో అంటూ నిన్నటినుంచి ఎక్కడా అంతులేదు. ఇప్పుడొచ్చి నన్ను దబాయిస్తున్నాడు, నేర్పలేదని.

**దాదా** : అయిపోయిన పెండ్లికి బాజా ఎందుకు? ఇప్పుడన్నా మొదలెట్టండి తొందరగా.

(అంతా లేచి నుంచుంటారు. ఇంతలో రాముడు ప్రవేశం)

**రాముడు** : (వస్తూనే) సుభానయ్యా, సుభానయ్యా!

**సీత** : ఏమిటి రాముడూ?

**రాముడు** : బాబయ్యగారిని పోలీసోళ్ళు పట్టుకొని దొరవారి కొట్టోపెట్టిన్రు.

**కమల** : ఎవరిని? మన్నయ్యనా?!

(ఔనని రాముడు తల ఊపుతాడు).

**రామి** : పదండశ! ఇంకా జూస్తారేమిటి?

**రాముడు** : ఆడకొద్దుబాబూ, ఆడ చానామంది పోలీసులుండారు.

**రామి** : ఏం ఉంటే? తేలేదేమిటో ఇప్పుడే తేలుద్ది.

**యల్ల** : అంతే. ఇయ్యాల అటో ఇటో తేలాలిసిందే. లేకపోతే ఏంది?

**దాదా** : ఎప్పటికి మల్లే ఏదో మాటాడ్డానికి పిల్చాడనుకున్నాగాని ఇంత కాడికి వస్తుందనుకోలేదు.

**కమల** : అన్నయ్యా అంతే అనుకున్నాడు. లేకపోతే అసలు వెళ్ళేవాడే కాదు.

**సీత** : నాకు మొదటినుంచీ భయంగానే ఉంది. తీరా వెళ్ళేటప్పుడన్నా కూడా. 'రామయ్యనన్నా వెంట తీసుకెళ్ళరాదా?' అని.

**సుభాన్** : మేం కూడా అక్కడే ఉంటాం అనుకొని వచ్చివుంటాడు. ఏం రాములూ, ఆయన్ని అక్కడే ఉంచారా? నాకా (స్టేషన్)కి తీసికెళ్తన్నారా?

**రాములు** : అప్పుడే ఏడ తీసికెల్తారు బాబూ? ఊరుమీద పడ్డానికి అంతా తయారవుతున్రు.

**దాదా** : ఊరుమీద పట్టానికా?

**రాములు** : ఇంకా పడ్డానికా ఏంది? ఈపాటికి ఆళ్ళు బయలుదేరి వత్తానే ఉండాలి. (సీతమ్మతో) నే నెల్తానమ్మగారూ!

**సీత** : సరే, వెళ్ళు రాములూ!

(రాముడు వెళ్ళిపోతాడు)

**సుభాన్** : ఏం యల్లమంద! సమయం వచ్చింది. మన్ని మనం కాపాడుకోవాలి.

**సీత** : పదండయ్యా, తొందరగా పదండి. ఆ పాపిష్టోళ్ళు ఎవళ్ళింటిమీద వచ్చిపడతారో!

**యల్ల** : ఎల్తానికేంలే అమ్మా! మరి ఇక్కడో?

**దాదా** : నే నుంటానులే యల్లమందా! పదండి మీరు.

**సీత** : నీ విక్కడుంటే ఎట్టా దాదా? పిన్ని అసలే భయస్తురాలు. మాకేం పర్వాలేదులే.

**దాదా** : నీకు తెలవదులే అమ్మా! పెద్దోణ్ణి నేనుండి కూడా మిమ్మల్ని ఒంటరిగా వదిలిపెడ్తే, రేపు అబ్బాయివచ్చి ఏం అనుకుంటాడు? మా ఇండ్ల దగ్గర సుభాన్ ఉంటే చాల్లే!

**కమల** : మాకేం భయంలేదులే దాదా! మమ్మల్ని మేం రక్షించుకోగలం. మీబోటి ముఖ్యులే ఇక్కడ గూచుంటే ఎలా? వెళ్ళి ఇంటింటికి తిరిగి, ముందు గ్రామాన్ని అంతా కట్టుదిట్టం చేయండి, పదండి.

**రామి** : సుభాన్! ముందు మనమిద్దరం గూడెం వెళ్ళివద్దాం పద.

**సుభాన్** : దాదా! నీ వటెళ్ళి మన వెంకయ్యగారికి, సుబ్బయ్యగారికి చెప్పిరా. యల్లమందా నీ వెళ్ళి మీ పదిండ్లోళ్ళకి జెప్పు.

**దాదా** : సరే పదండి. చావో బతుకో ఇయ్యాల తేలిపోవాలి.

**సీత** : పదండి నాయనా, పదండి. ఎన్నాళ్ళు బతుకుతాం ఈ పాడు బతుకు? ఎప్పుడైనా చావాలిసిందే.

**సుభాన్** : మనం జేసిన ప్రమాణం మళ్ళీ ఒకసారి జ్ఞాపకం తెచ్చుకోండి. బొందిలో ఊపిరి ఉండగా ఈ దేశ్‌ముఖ్‌కి లొంగిపోకూడదు. మన జన్మహక్కుల కోసం మనం తెగించి పోరాడుదాం. ఈ పోరాటంలో ఎప్పటికైనా విజయం మనదే.

బోలో ఆంధ్ర మహాసభకీ జై!

(కమల పాట అందుకుంటుంది.

అందరూ కలిసి పాట పాడుతూ బయల్దేరి వెళ్ళుతూ ఉంటారు)

ఆంధ్రుడా లేవరా
ఆంధ్రుడా బిరాన లేవరా ॥ఆంధ్రుడా॥
ఆంధ్రమాత వీరమాత అనెడి పేరు నిల్పరా
కూలి–రైతు విప్లవాగ్ని జ్వాల లేపి నిలపరా
నేలమట్టమౌను ధనిక పాలనంబు నేడెరా ॥ఆంధ్రుడా॥
నెత్తురొలికి పారినా నీది శిరసు రాలినా
కత్తిదూసి శత్రువులను గదిమి గదిమి కూల్చరా
ఆంధ్ర ప్రజలు మూడుకోటులైక్యమై ఎదిర్చినా
బంధములను త్రెంచి విశాలాంధ్ర నిల్పగలమురా ॥ఆంధ్రుడా॥

(కమల, సీత మినహా అందరూ వెళతారు)

**కమల** : వదినా, అన్నయ్య లేడని వాళ్ళు గబగబా మనింటికే వస్తారేమో, గడపదాటీ లోపల అడుగుపెట్టనివ్వగూడదు.

**సీత** : నా ఇంట్లోనే అడుగు బెట్టనిస్తానూ? సరేగాని, నీవు మాత్రం కాస్త జాగ్రత్తగా ఉండమ్మా, వాళ్ళసలే కోతిముండా కొడుకులు.

**కమల** : అయితే ఏం? మనమే అంత జేతులు జచ్చి ఉన్నామా?

**సీత** : అంతేలే. మన చేతనైనంత మటుకు మనం పోట్లాడదాం. నీవు మాత్రం తొందరపడక నేను జెప్పినమాటిను.

**కమల** : ఏమిటి వదినా, అలా అంటావ్.

**సీత** : ఏం లేదులే అమ్మా! నీవసలే చిన్నపిల్లవి, నీ విక్కడే ఉండు, నే గడపలో నుంచుంటా.

**కమల** : అదేమిటి? నేను కూడా నీతోపాటే నుంచుంటా.

**సీత** : కాదులే, నీకు తెలీదులే. నేను ఉండాలి గడపలో. వాళ్ళసలే తాగుబోతు ముండాకొడుకులు. నా ప్రాణం ఉండగా నీ వంటిమీద చేయి బడనివ్వను.

**కమల** : (లోపలికి పరుగెత్తికెళ్ళి వడిశాల తీసుకొస్తూ) మన చేతిలో ఈ ఆయుధం ఉండగా ఇంకా మనజోలికి రావడమే! (అంటూ బల్లపై కెక్కి వడిశాల తిప్పుతూ ఉంటుంది).

**సీత** : (నవ్వుతూ) ఏం, కిందుండి నేను రాళ్ళందించనా?

(తెరలో పెద్ద కోలాహలం. సీతమ్మ గబగబా గడప దగ్గిరకు పరుగెత్తు కొస్తుంది. పోలీసులు తలుపు తోసుకుని లోనికి వస్తూ ఉంటారు).

**సీత** : ఎవళ్ళురా మీరు, ఇంట్లోకి వస్తారు?

**పోలీసు** : లే, అడ్డంలే, ముందు ఇల్లు సోదా చేయాలి.

**సీత** : ఎందుకు?

**పోలీసు** : 'లెవీ' ఎగ్గొడితే ఊరికే పోతుందనుకున్నావేం?

**అమీన్** : (ప్రవేశించి పోలీసుతో) అరే హేమ్టీ చూస్తావ్‌గదా? జల్దీజల్దీ సామాన్ బైట్కి లాగేయ్ బే!

(పోలీసులు లోపలికి వెళ్ళబోతారు. సీతమ్మ అడ్డం వస్తుంది. కమల లోపలికి పరుగెత్తుతుంది. 'ఏయ్ జావ్, హటో' అంటూ ఆమీన్ సీతమ్మను బైటికి లాగుతాడు. సీతమ్మ పడిపోతుంది. పోలీసులు, రౌడీలు, అమీన్, మస్తాన్, దేశముఖు, పట్వారీలు లోపల ప్రవేశిస్తారు. గాంధీ, నెహ్రూ వగయిరా నాయకుల ఫొటోల దగ్గిరనుంచి చేతికందిన ప్రతి సామాను బైటికి గిరవాటు వేస్తూ ఉంటారు. కమల కారపుముంత తీసుకొని లోపలినుంచి వస్తుంది. కమలనుచూచి దేశముఖు వికటంగా నవ్వుతూ, 'చిక్కక ఎక్కడికి బోతావులే పిల్లా!' అంటూ చేతులు జాచుకొని

గ్రుడ్లురుముతూ కమలమీది కెళుతూ ఉంటాడు. సీతమ్మ త్వరత్వరగా లేచి పక్కనున్న రోకలిబండ అందుకొని వెనగ్గా వచ్చి దేశముఖు తలమీదబెట్టి బాదుతుంది. దేశముఖు కెవ్వున ఒక పిచ్చికేక వేసి కిందబడతాడు. పోలీసులు, రౌడీలు సీతమ్మమీద పడబోతారు. కమల కారపుముంతలోంచి రెండు గుప్పెళ్ళు కారందీసి అందరి కళ్ళల్లో కొడుతుంది. అందరూ కళ్ళు నులుపుకుంటూ ఉంటారు. ఇంతలో వెనకనుంచి ప్రజల జయజయధ్వానాలు వినబడుతూ ఉంటాయి. అందరికంటే ముందు దాదా పరుగెత్తుకుంటూ వస్తాడు.)

**దాదా** : ఆడోళ్ళమీద కెళ్ళడానికి మనుషులు గాదటరా మీరు? గాడ్దెకొడుకు ల్లారా! (అంటూ సింహంలాగా గర్జిస్తూ వచ్చి పారిపోడానికి తారాడుతూ వున్న పట్వారీని లాగి ఒక తన్ను తంతాడు. పట్వారీ ఆ దెబ్బకి గింగరాలు తిరిగి కిందపడతాడు. ఇంతలో అమీన్ తన చేతిలోవున్న రివాల్వర్‌ని దాదావైపు గురిపెట్టి కాలుస్తాడు. దాదా పొత్తికడుపులో నుంచి గుండు దూసుకుపోతుంది. 'అల్లా! అల్లా!' అంటూ దాదా నేలమీదపడి తన్నుకుంటూ ఉంటాడు. పట్వారీ, దేశముఖులు లేచి మెల్లగా తప్పించుకొని పారిపోతారు. సీతమ్మ 'దాదా, దాదా' అంటూ పరుగెత్తుకొచ్చి దాదా తలను పట్టుకొంటుంది. అమీన్ మళ్ళీ రివాల్వర్ కాలుస్తాడు. గుండు తగిలి సీతమ్మ పడిపోతుంది. సుభాన్, రామిరెడ్డి, యల్లమందలతో సహా ఇంకా కొందరు ప్రజలు పరుగెత్తుకుంటూ వస్తారు. అమీన్‌తో సహా పోలీసులు కూడా పిక్కబలం జూపి, పరుగు బుచ్చుకుంటారు. 'వదిలా, వదినా' అంటూ కమల సీతమ్మ దగ్గరకు వస్తుంది. ఇంతలో మరోవైపునుంచి చెమటగారుతూ, రొప్పుతూ వీరారెడ్డి, మంగలి రాముడు ప్రవేశిస్తారు).

**వీరా** : (దాదాను జూచి) దాదా, దాదా! (అంటూ గుండెమీద చేయివేసి ముక్కుదగ్గిర వేలుబెట్టి చూస్తూ ఉంటాడు. మంగలి రాముడు లోపలికి పరుగెత్తి నీళ్లు తీసుకొస్తాడు. వీరారెడ్డివైపు జూచి కమల 'అన్నయ్యా!' అంటూ కేకవేస్తుంది. (వీరారెడ్డి సీతమ్మ దగ్గరకు పరుగెత్తుకుంటూ వస్తాడు.)

**సీతమ్మ** : (సీతమ్మ వీరారెడ్డివైపు జూచి క్షీణస్వరంతో) దాదా, దాదా!

**వీరా** : ఇంకెక్కడి దాదా (మంగలి రాముడు దగ్గిర నీళ్ళు తీసుకొని సీతమ్మచేత రెండుగుక్కలు తాగిస్తాడు).

**సీత** : దాదా పొయ్యాడా, పొయ్యాడా? పాపం, మనకోసం...చచ్చిపొయ్యాడా, (కొంచెంసేపు ఆగి, కమలవైపు చూచి ఏడవకమ్మా ఏడవకు; అబ్బాయేడీ?

(కన్నీరు తుడుచుకుంటూ కమల లోపలికెళుతుంది).

(వీరారెడ్డితో) మీరెట్టా...వచ్చారు?

**వీరా** : (కన్నీరు తుడుచుకుంటూ) రాముడు తప్పించాడు.

**సీతమ్మ** : రాముడా?! (రాముడువైపు జూస్తుంది.)

**రాముడు** : (కండ్లనీళ్ళు తుడుచుకుంటూ) ఏం తప్పిస్తే ఏం లాబమమ్మా? (అబ్బాయి నెత్తుకొని కమల ప్రవేశిస్తుంది. సీతమ్మ చేతులు చాచుతుంది. అబ్బాయిని కమల సీతమ్మ చేతుల్లోకి ఇస్తుంది.)

**సీత** : (అబ్బాయిని ముద్దాడి మళ్ళీ కమల చేతికిస్తూ) బిడ్డని నీ చేతుల్లో బెడతన్నా, వీడికిక....నీవే....నమ్మా...తల్లివి.

(కమల అబ్బాయిని తీసుకుంటూ ఉంటుంది)

(తెర)

# 6

# సమాధులు

(సీతమ్మ, దాదా సాహెబుల సమాధులు. కమల, వీరారెడ్డి, సుభాన్, రాముడు చేతులు జోడించి పాడుతూ ఉంటారు. వీరారెడ్డి చేతిలో బేబీ ఉంటుంది. సమాధులపై అగరువత్తులు వెలిగించి, కమల వీరారెడ్డి చేతిలో నుంచి బేబీని తీసుకుంటుంది.)

దేశ సేవకులార తెలుగు జోదుల్లార
దేశానికై మీరు దేహమర్పించార! ॥దేశ॥
మీ కీర్తి చంద్రికలు మీ ధైర్య శౌర్యములు
లోకాన వ్యాపించి చీకటుల పోదోలె ॥దేశ॥
హిందువులు ముస్లిములు ఏకమై ఈనాడు
మీ రక్తవాహినులు పారి తడిసినచోట
స్వాతంత్ర్య ధ్వజమెత్తి జయగీతి పాడెదము ॥దేశ॥

**రాముడు :** ఇద్దరూ ఇద్దరే దేవతలు, ఇట్లాంటోళ్ళమీద తుపాకులు కాల్చిన్రు. రాచ్చస ముండాకొడుకులు.

**కమల :** 'నా బొందిలో ప్రాణం ఉండగా నీ వంటిమీద చేయిపడనిస్తానా అమ్మాయీ?' అంది. కంటిరెప్పలాగా ఎప్పుడూ నన్ను కనిపెట్టి ఉండేది.

**రాముడు :** కోపమెట్టాంటిదో ఎరుగదు మా తల్లి. మాబోటి పని బాగులోళ్ళని కూడా తూలి ఎప్పుడూ ఒక మాట అని ఎరగదు.

**సుభాన్ :** అదేమిటో! వాళ్ళిద్దరూ తండ్రీ బిడ్డలులాగా ఉండేవాళ్ళు. నవ్వులాటకైనా సరే. దాదాని మనం ఏమన్నా అంటే, ఆమె ఊరుకొనేది కాదు.

**కమల** : దాదా మాత్రం వేళాకోళానికయినా వదినమీద మాట పడనిచ్చేవాడా! మమ్ముల్ని మరీ తన కన్నబిడ్డల్లాగా చూచుకునేవాడు.

**వీరా** : మిమ్మల్నేకాదు, అందర్నీ అలాగే చూచుకొనేవాడు. మనలో ఎవరికి ఏ కాస్త కష్టం కలిగినా ఆయనెంతో బాధపడేవాడు.

**సుభాన్** : మనలో ఈ యిద్దరే ప్రతిదానికి వెనక్కు లాగుతారని అనుకునేవాణ్ణి. తీరా సమయం వచ్చేటప్పటికి మనందరి కోసం ముందువాళ్ళే బలి అయ్యారు.

**వీరా** : మనతోబాటు ముందు ఆవేశంగా మాట్లాడకపోయినా, ఏ పనిలో వాళ్ళు మనకంటె వెనకబడ్డారు? సమయం వచ్చినప్పుడు ఎప్పుడూ ముందే నుంచునేవాళ్లు.

**రాముడు** : ఇట్టాంటోళ్లని పొట్టనబెట్టుకొని, గాడిదకొడుకులు పారిపోయిను. చిక్కినట్లయితేనా, బతికుండగా గొయ్యితీసి పాతిపెట్టేవాళ్ళం.

**సుభాన్** : పాతిపెట్టక అప్పుడే ఏమయింది? మనలో ఒక్కడు బతికున్నా సరే, ఈ దేశముఖు అంతు కనుక్కోకుండా వదలిపెడతామా? (పట్వారీ వెంకట్రావును రామిరెడ్డి వగైరా రైతులు మెడబట్టి నెట్టుకుంటూ ప్రవేశిస్తారు. వెంకట్రావు అమాంతంగా వచ్చి వీరారెడ్డి కాళ్ళమీద పడతాడు).

**వెంక** : రక్షించాలి బాబో, రక్షించాలి!

**రామి** : ఏమిట్రా? నిన్ను రక్షించాలా? పగలగొయ్యాలా?

(అంటూ వెంకట్రావుమీది కెళతాడు)

**వెంక** : బాబో శరణాగతుణ్ణి. ఈ దీనుడికి ఇక మీరే దిక్కు. బుద్ధి వచ్చింది.

**కమల** : (కోపంతో) మొన్న ఎక్కడబోయింది ఈ బుద్ధి? సిగ్గులేదూ! వేలుబెట్టి నన్ను జూపించావే మొన్న దేశముఖుకి. నాబోటి పిల్లలు నీకు లేరూ? దుర్మార్గుడా?

**రామి** : ఏమిటీ? వీడేనా నీ మీదికి దేశముఖుని ఉసికొల్పింది? ఏంరా గాడిద? (లాగి ఒక తన్ను తంతాడు).

**వెంక** : (క్రిందబడి చేతులు జోడించి) అపరాధిని బాబో, బుద్ధిగడ్డితింది, పిల్లలు గలవాణ్ణి.

**వీరా** : ఎవళ్ళకిలేరు పిల్లలు?

**సుభాన్** : (కమల చేతిలోనుంచి బేబీని తీసుకుంటూ) ఎంతమంది ఇలాంటి పిల్లల ఉసురుగట్టుకున్నావురా నీవు! ఈ బిడ్డ తల్లి రక్తం తాగింది నీవు కాదూ?

**వెంక** : ఈ పాపం నేను చేయలేదు బాబూ.దైవసాక్షిగా జెప్పుతున్నాను. ఈ కాల్పులతో నాకేం సంబంధం లేదు.

**రాముడు** : నోట్లో పురుగులు పడ్తయ్. ఆ మాతల్లిని చంపించిందిగాక, ఇప్పుడు కూడా అబద్ధాలెందుకు? గదిలో కూసోని అమీన్‌తో గుసగుసలాడింది నీవుగాదూ? (వీరారెడ్డిని చూపించి) ఈ బాబయ్యని కొట్టోబెట్టి, మేం వచ్చిందాకా జాగర్తగా కాపలా గాయమని నాతో చెప్పలా?

**వెంక** : దుర్మార్గుణ్ణి బాబో, ఇక మీరేమన్నా జేయండి. మీ కాళ్ళమీద బడుతున్నా, ఉద్యోగ ధర్మం కాబట్టి అలా ఏడవాలిసి వచ్చింది, గుమాస్తా ముండాకొడుకుని నాదేముంది బాబూ, ఆ దేశ్‌ముఖ్ చెప్పినట్టల్లా చేశాను.

**రామి** : మా దగ్గిరంటరా నీ దొంగ ఏడ్పులు. అమ్మ పుట్టిల్లు మేనమామకి తెలియదటరా? అసలీ ఊరికి తిప్పలు దెచ్చిందీ, మా కొంపలన్నీ దీసిందీ నీవు గాదటరా గాడిద? (మళ్ళీ తన్నబోతాడు.)

**వెంక** : చేశాను బాబో, చేశాను. బుద్ధి వచ్చిందని లెంపలు వేసుకుంటున్నా క్షమించండి. ఇక ఈలాటి బుద్ధితక్కువ పనులెప్పుడూ జేయను.

**కమల** : ఛీ నీచుడా! నీకా బుద్ధి? ఇక నిన్ను తగలేసిన్నాడే నీకు బుద్ధి వచ్చేది.

**వెంక** : (చెంపలేసుకుంటూ) చెంపలేసుకుంటున్నాను తల్లీ! ఇక మీరు చెప్పినట్లే నడుచుకుంటా. మీరు దూకమన్న గోతిలోకి దూకడానికి సిద్ధంగా ఉన్నా. (చేతులు జోడిస్తూ) హరేందాసుణ్ణి. మీరే జరిమానా విధించినా చెల్లించుకుంటా. మీరే శిక్ష వేసినా అనుభవిస్తా.

**రామి** : శిచ్చ! ఇంకా శిచ్చేమిటి? ఈ గోరీలతో పాటు నీకూ ఒక గోరీ కట్టడమే.

**కమల** : ఈ దేవతల గోరీల పక్కనా, ఈ నీచుడికి గోరీ కట్టేది?

**రాముడు** : నిజమేనమ్మా! మంచిమాట చెప్పావు.

**వీరా** : (పట్వారీతో) నీవు చేసిన దుర్మార్గానికి నిన్ను ఉరిదీసినా పాపం లేదు. నీ కల్లబొల్లి కబుర్లు నమ్మి నిన్నింకా ఊళ్ళో ఉండనివ్వడం మళ్ళీ మా గొంతుకల కుచ్చు బిగించుకోడమే. ఛీ, నీ మొఖం చూసినా పాపం, పో అవతలికి.

**రామి** : జాగ్రత్త! మళ్ళీ ఈ ఊళ్ళో అడుగుబెట్టావూ అంటే బతికిబైటపడవు.

**వెంక** : (వీరారెడ్డితో) నా పెండ్లాం బిడ్డల్ని వదిలి ఎక్కడికిపోను బాబూ?

**వీరా** : ఎక్కడికన్నా బో ఏట్లోకి. నీతోపాటే తీసికెళ్ళు నీ పెండ్లాం బిడ్డల్ని.

**వెంక** : ఈ గడ్డ వదిలి పెండ్లాం బిడ్డలతో ఎక్కడికి పోయి, ఏం దినిబతకను? అన్యాయంగా జచ్చిపోతా బాబూ!

**రామి** : ఏం చచ్చిపోతే? అసలు నీవు చావాలిసిందే.

**సుభాన్** : ఈ గడ్డంతా నీ తాతగాడి ముల్లే? నీవు కష్టపడి సంపాదించి చచ్చావా? ఇదంతా మా పొట్టగొట్టి కాజేసిందేగా?

**వీరా** : వేలకువేలు మా దగ్గర లంచాలు కాజేసి మేడగట్టించుకొని అందులో కులుకుతూ కూర్చుందామనుకున్నావా? పద, నడువు ముందు బైటకి.

**వెంక** : నేను దీసుకున్న లంచాలన్నీ ఇచ్చేస్తా బాబూ, నా పొలం మాత్రం నాకు వదిలిపెట్టండి.

**వీరా** : నీవు తీసుకున్న లంచాలన్నీ లెక్కకడితే, నీ ఆస్తి మిగలదు. నీవూ మిగలవు బతకదల్చుకుంటే నడువు ముందు బైటకి.
(యల్లమంద మస్తాన్‌ను లాక్కొస్తూ ఉంటాడు).

**యల్ల** : నడువ్, నడువ్. (మస్తానును తోసుకొస్తూ, పట్వారీని చూచి) వోయ్, చిక్కిండే పిలకోడు! (పట్వారీ మెడబట్టుకొని ఊపుతూ) నాయాల కొట్టి ఏలుముద్దర ఏయిత్తావ్.

(మస్తాన్ తల వంచుకొని నుంచుంటాడు).

**సుభాన్** : ఛూ, నీ జన్మ తగలెయ్య! సిగ్గులేక ఇంకా బతికుండావ్. ఎందులో

అన్నా దూకి చావకపోయ్యావా? దాదాని, సీతమ్మగారిని పొట్టన బెట్టుకున్నావు, చాల్లా?

**యల్ల** : తేరగా వచ్చిందని దేవరపోతు మాంసం తెగదిని చూడు ఎట్ట బలిసిండో.

**సుభాన్** : ఛీ, ఈ దుర్మార్గుడిక్కడెందుకు? మెడబెట్టిగెంటక వాడితోపాటు, (మెడబెట్టి గెంటుతాడు).

**రామి** : (పట్వారీని చూచి) ఇంకా నీవిక్కడే చచ్చావెందుకు, ఫో. వాడితోపాటు నీవు కూడా. (జుట్టుపట్టుకొని బైటకి లాగుతాడు).

**కమల** : ఈ గాడిదలిద్దరూ చిక్కారు గాని, అసలోడు చిక్కలేదే!

**యల్ల** : వోడు? దేశముఖా? ఆడు అమీన్‌తో గలిసి నల్లగొండ పారిపోయిండు. ఎంటబడితే దొరకలా నాయాళ్ళు. గుఱ్ఱాలేసుకుని ఉరికిన్రు.

(రామిరెడ్డి, సుభాన్లు మళ్ళీ ప్రవేశిస్తారు)

**రాముడు** : పీడ వదలింది.

**వీరా** : పదండి పోదాం. మన పొలాలు మనం ఆక్రమించుకుందాం.

**కమల** : ఎన్నాళ్ళ నుంచో మన తల్లి భూదేవి ఈ పాపాత్ముడి చెరలో ఉంది. పదండి . మన భూమిని మనం వదిలించుకుందాం.

**రామి** : ఇక నా గిత్తలకి మేత కరువులేదు. మళ్ళీ నాబీడు నాకొచ్చింది.

**రాముడు** : (సంతోషంగా వీరారెడ్డితో) ఏం బాబూ, మళ్ళీ మా మంగలి మాన్యం మాకొచ్చినట్టేగా?

**సుభాన్** : ఇంకా వచ్చినట్టేనా ఏంటి? వెళ్ళి అరం కట్టక!

**వీరా** : ఈనాటికి తిరిగి మళ్ళీ మన భూములు మనకొచ్చాయి. కాని, ముందు మరో ప్రమాదం రాబోతూవుంది. మనమంతా తగిన జాగ్రత్తగా ఉండాలి.

**యల్ల** : ఇంకేం బయముంది బాబూ? ఆ ముదనష్టపోడు ఆడిదారిని ఆడు బోయిండుగా?

**వీరా** : అప్పుడే ఎక్కడబోయాడు? వాడు జేయాల్సిన కుట్ర అంతా చేస్తూనే

ఉంటాడు. పట్నం కూడా పోయి ఈసారి మిలటరీనే తీసుకొస్తాడు. అవసరమైతే ఇంకా తెల్ల సైన్యాన్ని దింపుతాడు.

**రామి** : ఏం దింపితే? మా బొందిలో ఊపిరి ఉండగా మళ్ళీ మా పొలాలు వదిలిపెడతామా?

**సుభాన్** : సంఘ బలంతోనే ఇప్పుడు దేశముఖుని ఎదిరించాం. రేపు నవాబు వచ్చినా, తెల్లోళ్లు వచ్చినా ఈ సంఘ బలంతోనే ఎదిరించుదాం. మన గడ్డని మనం కాపాడుకొందాం.

**కమల** : అంతే. మనమంతా ఇలాగే కట్టుగా ఉంటే తెల్లోళ్ళుకాదు, వాళ్ళ తాతలొచ్చినా మన్ని ఏమీ చేయలేరు.

**యల్ల** : ఈ జాతోళ్ళు కోతోళ్ళు ఏం జేత్తారే, పదండశ. ఎవడి పొలంలో ఆడు ఇల్లేసుకుందాం. ఏం రాములూ?

**రాముడు** : అంతేనయ్యా, యల్లమందయ్యా. నా ప్రాణం బోయినా సరే, ఇంకా నా మాన్నేం వదిలిపెడతానా?

**వీరా** : అలా ఉండాలి. అవసరమైతే ఇంటికొకడు బలి అయిపోవాలి. పొలం మీద హక్కు మనదే. ఈ హక్కు కోసమే సీత తన ప్రాణాన్ని ఇచ్చింది; దాదా బలి అయిపొయ్యాడు. మళ్ళీ మన పొలాన్ని మనం వదిలి పెట్టడమంటే దాదాకి, సీతకి ద్రోహం చేసినవాళ్ళం అవుతాం.

**సుభాన్** : నిజమే. బందగీ సమాధి దగ్గర మొదట మనం సంఘం బెట్టుకుంటాం అని ప్రమాణం చేశాం. మళ్ళీ ఈ సమాధుల దగ్గర ప్రమాణం చేయండి.

"ప్రాణంబోయినా మా భూమి వదలం!"

**అందరూ** : ప్రాణంబోయినా మా భూమి వదలం.

**వీరా** : దున్నేవాడిదే భూమి హక్కు!

**అందరూ** : దున్నేవాడిదే భూమి హక్కు!

**కమల** : బోలో ఆంధ్రమహాసభకీ జై!

**అందరూ** : బోలో ఆంధ్రమహాసభకీ జై!

వీరులార రణధీరులారా నిరు
　　పేదలార ఇదే కదలండోయ్॥
పౌరుష మేదో చూపి దేశమును
　　ప్రజా రాజ్యమును నిలుపండోయ్॥
భూమిలేని రైతేమి రైతురా
　　భూమిని దున్నే బానిసరా॥
బానిస బ్రతుకునకంటె హేయ మీ
　　ప్రపంచమున లేనే లేదోయ్॥
బానిసలంతా ఏకమైన ఈ
　　ప్రభువు లెంతరా ఒక క్షణమే॥
పగలు రాత్రి కష్టించి భూములను
　　పగులదున్ని పండించెదమోయ్॥
దున్నేవారిదె హక్కు భూమిపై
　　ఇది మా భూమేనోయ్
　　ఇది మా భూమేనోయ్॥

**(సమాప్తం)**

# అనుబంధం

## బొంబాయిలో ప్రజానాట్యమండలి రాష్ట్రదళం
## 'మా భూమి' ప్రదర్శన దృశ్యాలు



"ఆంధ్రుడా లేవరా" అనే పాటలో
మిక్కిలినేని, కోసూరు పున్నయ్య, కోగంటి, పట్టంశెట్టి



డాక్టర్ రాజారావు, నాజర్, పున్నయ్య




అమరవీరుడు బందగీ సమాధివద్ద పూజా దృశ్యం
మిక్కిలినేని, సీతారత్నం, సూర్యకాంతం, కోగంటి, పట్టంశెట్టి



ఆంధ్ర ప్రజానాట్యమండలి రాష్ట్రదళ సభ్యులు
ఎడమనుండి నాలుగవవారు ప్రజాకవి సుంకర సత్యనారాయణ

## 'మా భూమి' నాటకంలో మరికొన్ని దృశ్యాలు











# “మా భూమి” ప్రదర్శనపై మద్రాసు ప్రభుత్వపు నిషేధం

**- డాక్టర్ రాజారావు**
ప్రధాన కార్యదర్శి
ఆంధ్ర ప్రజానాట్యమండలి, బెజవాడ

బ్రిటీష్ గులాములైన సంస్థానాధీశ్వరుల నిరంకుశ క్రూర పరిపాలనను నిలువెల్ల నిర్మూలన చేయ రచింపబడిన సోదర తెలంగాణా ప్రజల వీరోచిత పోరాట గాథ “మా భూమి” నాటకం. “ముందడుగు”, “అపనింద” నాటకాలను రచించిన శ్రీ సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావుగార్లు దీన్ని రచించారు.

ఆంధ్ర ప్రజానాట్యమండలి నూట ఇరవై అనుబంధ శాఖలు 980 ప్రదర్శనల ద్వారా 18 లక్షల ప్రజానీకానికి “విశాలాంధ్ర”, “దున్నేవానికే భూమి హక్కు” అనే సందేశాన్ని అందించారు.

శ్రీ విశ్వనాథ, పింగళి లక్ష్మీకాంతం లాంటి కవులు, శ్రీ లింగమూర్తి, గిడుగు సీతాపతి లాంటి నటకులు శ్రీ శాంతారాం, ప్రసాద్, బి.ఎన్. రెడ్డి లాంటి దర్శకులు, ఇంకా ఎందరో మేధావులు, చిత్రకారులు, విజ్ఞానవేత్తలు వేనోళ్ళ కొనియాడారు. అంతేగాక, ఆంధ్ర నాటక కళాపరిషత్ 14వ సమావేశంలో “మా భూమి” ప్రదర్శన రెండవ బహుమతిని, రచనలో ప్రథమ బహుమతిని పొంది మరోసారి తన కళాకాంతిని లోకానికి చాటింది.

మద్రాసు నగరంలో, అందులో బాంక్వెటింగ్ హాలులో కూడా ప్రదర్శింపబడింది. ప్రదర్శన చూసిన మంత్రులు శ్రీ గోపాలరెడ్డి “నిద్రాణమై వున్న జాతి నేడు నిద్ర మేల్కొంటున్నది” అని ప్రశంసించి, అర్ధనూటపదహార్లు

బహూకరించారు. అమాత్యులు శ్రీ కళావారు, కూర్మయ్యగారు వేనోళ్ళ కొనియాడి 'వాడవాడలా ప్రదర్శింపబడా'లన్నారు.

ఆరు నెలలు గడవలేదు. ఆ మంత్రుల పరిపాలనలోనే "మా భూమి" నాటకానికి కాలదోషం పట్టింది.

**నిషేధానికి సాకు :**

"మా భూమి" ప్రదర్శన ప్రేక్షకుల మనస్సులు పాడుచేస్తుంద"ని బాణం సంధించింది ప్రభుత్వం. 20 లక్షలమంది ప్రజానీకం, ఎంతోమంది కవులు, గాయకులు, నటకులు, దర్శకులు, విజ్ఞానవేత్తలు – అందరి మనస్సులు పాడయ్యాయా? మనసులు పాడుచేసుకొమ్మనే ఈ ప్రభుత్వ మంత్రులు వాడవాడలా ప్రదర్శించండన్నారా? ప్రదర్శనను చూసి ఆనందించి అభినందించిన నేటి మదరాసు మంత్రుల మనస్సులు ఏమయ్యాయి? పాడయ్యాయా?

**ప్రజాస్వామ్యవాదుల కర్తవ్యం :**

"మా భూమి" నాటక ప్రదర్శన నిషేధించటం ప్రజానాట్యమండలికే గాక అభ్యుదయ కళాకారులకు, నటకులకొక సవాల్. ప్రజాస్వామ్య రక్షణకొక పరీక్ష.

కాబట్టి కవులు, గాయకులు, చిత్రకారులు, నటకులు, దర్శకులు, విజ్ఞానవేత్తలు, ప్రజాసంఘాలు ఒకటేమిటి ఆంధ్ర ప్రజానీకమంతా "మా భూమి" ప్రదర్శనపై నిషేధం తొలగించే వరకు ఆందోళన చేయడం తమ విధిగా భావించాలి. సభలు–సమావేశాలు జరిపి నిషేధాజ్ఞను ఖండించాలి. ఈ సందర్భంలో పత్రికా సంపాదకులు, ఆంధ్ర ప్రజానీకం చేయూతనిస్తారని ఆశిస్తున్నాం.

**(ఆంధ్ర రాష్ట్ర ప్రాథమికోపాధ్యాయ ఫెడరేషన్ మాసపత్రిక 'ఉపాధ్యాయ' మే 1948 3వ కవర్ పేజీలో ప్రకటన, 'ఉపాధ్యాయ' సౌజన్యంతో)**

# చరిత్రాత్మక మా భూమి నాటకం

**- డాక్టర్ మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి**

**కృ**ష్ణాజిల్లా ప్రజానాట్యమండలి ప్రదర్శించిన చరిత్రాత్మక, విప్లవాత్మక నాటకం "మా భూమి". నైజాం నిరంకుశత్వాన్ని ఎదిరించి నల్లగొండ జిల్లాలో జరిగిన ప్రజాపోరాటమే మా భూమి ఇతివృత్తం. ఈ పోరాటంలో 240 గ్రామాలపై పోలీసుల దాడులు జరిగాయి. 8500 మంది అరెస్టు అయ్యారు. 12 లక్షల ఆస్తి లూటీ చేయబడింది. 52 మంది ప్రాణాలను కోల్పోయారు. నిజాం కిరాతకుల చేతుల్లో 64 మంది స్త్రీలు మానభంగానికి గురి అయ్యారు. వీరిలో ఇద్దరు మరణించారు. ఈ మహోజ్జ్వల పోరాటమే మమ్మల్ని ఈ నాటకం వ్రాయటానికి ప్రోత్సహించిందని రచయితలే మా భూమి నాటకం పీఠికలో వ్రాసుకున్నారు.

**ప్రజానాట్యమండలి, నాటక శిక్షణ :**

ప్రజానాట్యమండలి కళారూపాల స్థాయి నుంచి నాటకాలు ప్రదర్శించాలనే నిర్ణయం తీసుకుంది. నాటక ప్రదర్శనకు ముందుగా కృష్ణాజిల్లా నాట్యమండలి ఉపక్రమించింది.

కృష్ణాజిల్లా దళం ప్రప్రథమంగా 'ముందడుగు' తరువాత 'అపనింద', 'మా భూమి' మొదలైన నాటకాలను ప్రదర్శించింది. ఈ నాటకాలకు కోడూరు అచ్చయ్యచౌదరి దర్శకత్వం వహించారు.

తరువాత రాష్ట్రదళం 'పరివర్తన', 'మా భూమి' మొదలైన నాటకాలను డా॥ రాజారావు దర్శకత్వంలో ప్రదర్శించింది. ఈ రెండు దళాలకు ఆ మాటకొస్తే మొత్తం ప్రజానాట్యమండలి దళాలకు చరిత్రాత్మకమైన నాటకాలను, నాటికలను రాసినవారు సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు, ఆచార్య ఆత్రేయ మొదలైనవారు.

**నాటకం రిహార్సల్సు :**

రచయితలు, దర్శకులు, నటీనటులు అందరూ సమిష్టిగా కథను గురించి సావకాశంగా చర్చలు జరిపేవారు. ఒక నిర్ణయానికి వచ్చిన తరువాత నాటకం వ్రాయబడేది. ఈ చర్చల్లో ఆనాడు విశాలాంధ్ర సంపాదకులు మద్దుకూరి చంద్రశేఖరరావుగారు పాల్గొని సముచితమైన సలహాలనిచ్చేవారు.

అందరి సమక్షంలో నటీనటులకు అర్థమయ్యే విధంగా రెండు మూడుసార్లు రచయితలు ఆయా పాత్రల సంభాషణలను అనుసరిస్తూ చదివేవారు. ఈ సందర్భంలో కూడా చేయవలసిన మార్పుల్ని చేసేవారు. నటీనటుల సూచనలను కూడా పరిగణించేవారు. ఆ తరువాత పాత్రధారులను నిర్ణయించకుండానే ఆయా పాత్రలను వారితో చదివించేవారు. అలా చదవడంతో నటీనటులు తామే ఆ పాత్రలను ధరిస్తున్నామన్నంత ఆసక్తిని చూపించేవారు. దర్శకుడు ఈ సందర్భంలో ఆయా నటీనటుల సంభాషణా విధానాలను, వాచిక విధానాలను, ముఖంలో సాత్విక భావాలను గమనించేవారు. తరువాత పాత్ర విభజన జరిగేది ఆ తరువాత ఆయా పాత్రలచేత మళ్ళీ సంభాషణలు చదివించేవారు.

ఈ దశలో వాచికాభినయంలో రావలసిన మార్పులు చేర్పులు చేసేవారు. ప్రతి పాత్రధారికి క్షుణ్ణంగా సంభాషణలు నోటికి వచ్చిన తరువాత సంభాషణలకు తగిన వాచిక, సాత్వికాభినయాలను ప్రదర్శించిన తరువాత నటీనటుల్ని నిలబెట్టి రిహార్సల్సు చేయించేవారు. ఆంగికాభినయాన్ని, రంగస్థల కదలికల్ని, పాత్రల మధ్య వుండే అవినాభావ సంబంధాన్ని సరిచూసేవారు.

ముందు ఒక్కొక్క సీనులోనూ ఒక్కొక్క సన్నివేశాన్ని కట్టుదిట్టంగా బిట్ రిహార్సల్స్ జరిపి ఆ రంగానికి కావలసిన పరిపుష్టిని కల్గించేవారు. తరువాత పూర్తి వద్దికలను (రిహార్సల్స్) జరిపేవారు.

ఈ వద్దికలు జరిపే సమయంలో నటీనటులందరూ వారి వారి పాత్రలను క్షుణ్ణంగా మననం చేసుకుని వారి పాత్ర ప్రవేశానికి సిద్ధంగా వుండేవారు. ఇలా ప్రతిరోజూ ఒకటికి రెండుసార్లు రిహార్సల్సు జరిపేవారు. ఆ తరువాత నాటకానికి పూర్తి రిహార్సల్స్ జరిపేవారు.

వద్దికలంటే రిహార్సలు. ఇలా అనేక రిహార్సల్సు జరిపిన తరువాత ఒక

రోజున స్థానికంగా వున్న విమర్శకులను ఆహ్వానించి వారి ముందు నాటకాన్ని ప్రదర్శించేవారు. ఈ సందర్భంలో రచయితలూ, దర్శకులతోపాటు మద్దుకూరి చంద్రశేఖరరావు మొదలైన ప్రముఖులను కూడా ఆహ్వానించేవారు. ప్రదర్శన తరువాత మంచి చెడులను చర్చించి సూచనలిచ్చేవారు.

**హుందాగా చర్చలు :**

నటీనటులందరూ విమర్శకులిచ్చిన విమర్శలను హుందాగా స్వీకరించేవారు. తరువాత పూర్తి రిహార్సల్సు జరపడం ద్వారా విమర్శలో వచ్చిన లోపాలను సరిదిద్దుకొని డ్రస్ రిహార్సల్సు జరిపేవారు. తద్వారా అలంకరణలో కావలసిన స్వల్ప మార్పులను అప్పుడే సరిచూసుకునేవారు. ప్రదర్శనకు ముందే ఎవరి పాత్రలు ఎలా వుండాలో ప్రతి పాత్రధారికి ఒక అభిప్రాయాన్ని కల్గించేవారు.

తరువాత పక్కా రంగస్థలంలో తెరలు, లైటింగ్ ఎఫెక్ట్సు చూసుకోవటానికి పూర్తి రిహార్సల్సు జరిపేవారు. ఈ సందర్భంలో మరికొంతమంది విమర్శకుల్నీ, ప్రేక్షకుల్నీ కూడా ఆహ్వానించి నాటకాన్ని పూర్తి హంగులతో ప్రదర్శించేవారు. ప్రదర్శనానంతరం తెరలు, రంగస్థల ప్రదీపనల్లో కావలసిన మంచిచెడులను సేకరించేవారు. అలా నాటకాన్ని అంచలంచెలుగా మార్పులు చేసుకుంటూ నాటకాన్ని ఉత్తమ ప్రదర్శనగా తీర్చిదిద్దేవారు.

**ప్రదర్శనం రోజు :**

ప్రదర్శన రోజున అందరూ అన్ని పనులూ విభజించుకునేవారు. ఒకరు ఎక్కువ మరొకరు తక్కువ అనే భేదాభిప్రాయాలకు తావులేకుండా వుండేది. ప్రదర్శనానికి రెండు గంటల ముందే పాత్రధారులందరూ వేషధారణను ముగించుకొని, ఆహ్లాదంగా వారి వారి పాత్రలను మరొకసారి వల్లెవేసుకుని, ఎవరి సీనులో ఎవరెవరికి ఏ ఏ సామానులు కావాలో, రంగస్థల పరికరాలను ఎలా సర్దుకోవాలో, ఎవరు ఎటునుంచి ప్రవేశించాలో తదితర విషయాలలో తగు జాగ్రత్తలు తీసుకొని సిద్ధంగా వుండేవారు.

**సరిగా పది గంటలకు ప్రదర్శనం :**

ప్రజానాట్యమండలి నాటక ప్రదర్శనం రాత్రి సరిగా పదిగంటలకు! ప్రేక్షకులు వచ్చినా రాకపోయినా 9.45 నిమిషాలకు మొదటి గంట మ్రోగేది.

సరిగా 10 గంటలకు తెరలేచి నాటకం ప్రారంభమయ్యేది. ప్రదర్శనం పూర్తి అయ్యేవరకు నాట్యమండలి సభ్యు లందరూ ఒక్కత్రాటిమీద నడిచేవారు. రంగాల మధ్య విరామాలు లేకుండా ఒక ప్రక్కనుండి రంగానంతరం సామాన్లు తీసివేస్తుంటే మరోపక్క నుంచి ఆ రంగానికి కావలసిన పరికరాలు అమర్చబడేవి. ఇలా సమిష్టి కృషితో నాటకం జయప్రదమై ప్రేక్షకుల కరతాళధ్వనులను అందుకునేది. ఈ విధంగా ప్రజానాట్యమండలి నాటక ప్రదర్శనం ముగిసేది.

**ఇక్కడ ఒక ఉదాహరణ చెప్పాలి :**

ఆ రోజుల్లో నాటకాలు అనుకున్న సమయానికి ప్రారంభించేవారు కాదు. అలానే ప్రజానాట్యమండలి ముందడుగు నాటకం ప్రదర్శింపబడుతుం దనుకున్నారు. ప్రప్రథమంగా ముందడుగు నాటకాన్ని విజయవాడ గాంధీనగరం హనుమంతరాయ గ్రంథాలయంలో ప్రదర్శించాం. పదిగంటలకు నాటకం ప్రారంభమవుతుందని ప్రకటిస్తే 150 మంది కంటే సకాలానికి ఎవ్వరూ రాలేకపోయారు. అయితే టిక్కెట్లన్నీ 3 రోజుల ముందుగానే అమ్ముడు పోయాయి. అలా అని ప్రేక్షకులు వచ్చి హాలు నిండేవరకూ ఎదురుచూడక అనుకున్న ప్రకారం 10 గంటలకే నాటకం ప్రారంభించాము. ఒక అరగంటకు హాలంతా క్రిక్కిరిసి పోయింది. నాటి నుంచి ఎప్పుడు ఎక్కడ ప్రజానాట్యమండలి నాటకం ప్రదర్శించినా ముందుగానే హాలు నిండిపోయి అనుకున్న కాలానికే నాటకం ప్రారంభింపబడేది. ఈ విషయం ఎందుకు రాయవలసివచ్చిందంటే ప్రజానాట్య మండలి కార్యక్రమాలన్నీ క్రమశిక్షతో ప్రారంభింపబడేవని చెప్పడానికే. అందువల్లనే ప్రజానాట్యమండలి నాటకాలు ఎంతో బాగుంటాయని ప్రజలు తరలివచ్చేవారు.

**అన్ని దళాలూ ప్రదర్శనకు హాజరు :**

ఆనాడు ప్రజానాట్యమండలి రాష్ట్ర దళం కానీ, జిల్లా దళం కానీ నాటకం ప్రదర్శిస్తూ ఉందంటే పట్టణాలనుంచి, పల్లెలనుంచి, గ్రామాలనుంచీ నాటక దళాలకు సంబంధించిన నటీనటులు వచ్చేవారు. మా ప్రదర్శన చూసిన తరువాత అదేవిధంగా నాటకం ప్రదర్శించాలన్న ఉత్సాహంతో వెళ్లేవారు. మా ప్రదర్శనలు అనుసరించడం కాక ప్రజానాట్యమండలి ఆదర్శాలను, ఆశయాలను తూ.చా. తప్పకుండా అనుసరించేవారు. ముఖ్యంగా క్రమశిక్షణను పాటించేవారు. వారి

వారి నటనా సామర్థ్యాలను గురించి స్వంత పోకడలతో చక్కగా తయారుచేసుకునే వారు. ఇలా తయారు చేసుకోవడం వల్ల ప్రజానాట్యమండలి నాటకం ఏమూల ప్రదర్శించినా, ఆ ప్రదర్శనం జయప్రదమయ్యేది. అందుకు కారణం అందరిదీ ఒకే ధ్యేయం కావడమే.

**స్థానిక విమర్శలకు ఆహ్వానాలు :**

ప్రజానాట్యమండలి రాష్ట్ర దళం కానీ, జిల్లా దళం కానీ ఆయా పట్టణాలలో ప్రదర్శనలు ఇచ్చినప్పుడు స్థానికంగా వుండే మేధావులైన కళాకారులను విమర్శకులను కూడా ప్రదర్శనానికి ఆహ్వానించడం జరిగేది. ప్రదర్శనం జరిగిన మరునాడు వారినందర్నీ ఆహ్వానించి నాటక ప్రదర్శనం మీద వారిచ్చే మంచీ చెడూ విమర్శలను ఎంతో హుందాగా తీసుకునేవారం. తరువాత వారి విమర్శలను దళ సభ్యులందరం చర్చించి మంచిని స్వీకరించి రాబోయే ప్రదర్శనలో కొత్త మెరుగులు దిద్దుకొని ప్రదర్శించడం జరిగేది. ఈ విధంగా ప్రజానాట్యమండలి నాటక ప్రదర్శనలు ఎంతో ఉత్తమంగా వుండేవి. ముఖ్య విషయం ఏమంటే విమర్శలను ఆత్మవిమర్శతో అంగీకరించడం. అదే కమ్యూనిస్టు విధానం.

**మా నాటకాల్లో ప్రాంప్టింగ్ లేదు :**

నాటి మా నాటక సమాజాల్లో ప్రతి నాటక సమాజానికీ ఒక ప్రాంప్టర్ తప్పకుండా వుండేవాడు. ప్రదర్శన సమయంలో నటీనటుల సంభాషణలు మరిచిపోయి ముందుకు సాగలేని పరిస్థితిలో మరిచిపోయిన సంభాషణను అందించి ముందుకు పోవటానికి మార్గాన్ని సూచించే వ్యక్తి ప్రాంప్టరు. మతిమరుపుకు మందు ప్రాంప్టరు.కాని ఆ అవసరం మాకు వుండేది కాదు.

తెరవెనుక అజ్ఞాతంగా వుండే పాత్రధారుల్లో అత్యంత ప్రధానమైన వ్యక్తి ప్రాంప్టరు. అసలు నాటకానికి ప్రాంప్టరు ఉండాలా అక్కర్లేదా అనే వాద ప్రతివాదాలు అనేకమందిలో వున్నాయి. సరిగా ఒద్దికలు (రిహార్సల్సు) జరిపిన తరువాత ప్రదర్శనానికి ప్రాంప్టరు అవసరం ఎందుకు? అనేవారు లేకపోలేదు. ప్రాంప్టరు స్టేజి ప్రాపర్టీ కీపరుగా ఆర్గనైజరుకు సహాయకారిగా వుండేవాడు.

ఎవరి సంభాషణలు వారు క్షుణ్ణంగా కంఠస్థం చేసినప్పుడు ప్రాంప్టరు మీద ఆధారపడవలసిన అవసరమేముంది. నిజంగా అలాంటి కృషి జరిగినప్పుడు

ప్రాంప్టరు లేకపోయినా ప్రమాదం లేదుకాని అలాంటి ఉత్తమ సమాజాలు ఎన్ని వున్నాయి?

**అదే ప్రజానాట్యమండలి ఘనత :**

ప్రజానాట్యమండలి నాటకాలలో అన్ని నాటక సమాజాలలో మాదిరే ప్రాంప్టరు వుండేవాడు. కాని ఆయన ఏ పాత్రధారికీ ప్రాంప్టింగ్ చేసేవారు కాదు. ఆ నాటక సమాజంలో వుండే నటీనటులందరూ క్షుణ్ణంగా సంభాషణలు వల్లించేవారు. ఏ పాత్రధారి ప్రాంప్టరు మీద ఆధారపడేవాడు కాదు.

అందించే సంభాషణల మీద ఆధారపడినట్టి నటులు ఏమాత్రమూ సరియైన అభినయాన్ని చూపించలేరు. అందువల్లనే ప్రజానాట్యమండలి నటులు ప్రాంప్టరు మీద ఆధారపడేవారు కారు. ప్రతి సంభాషణలోనూ అర్ధవంతమైన అభినయాన్ని చూపించేవారు. ప్రాంప్టరు అవసరం ఉన్నవాళ్ళు మంచి నటులు కాలేరు.

ప్రతి పాత్రధారి ప్రదర్శననాడు మేకప్ పూర్తిచేసుకున్న తరువాత తమ తమ సంభాషణల్ని పూర్తిగా మననం చేసుకునేవారు.

వీలున్నంతవరకు పాత్రధారులు తమలో తాము సంభాషణలు చెప్పుకునే వారు. నాటకం ప్రారంభమైన తరువాత ఏ పాత్రధారి ప్రాంప్టరు కోసం ఎదురు చూసేవారు కాదు. అందువల్లనే తమ తమ పాత్రలకు జీవం పోసేవారు. కాబట్టి ప్రజానాట్యమండలి నటీనటుల పాత్రలు అత్యంత సహజంగా వుండేవి.

అయితే పైన వివరించినట్లు ప్రజానాట్యమండలి నాటకాలకూ ప్రాంప్టరు వుండేవాడు. అతను ప్రత్యేక పరిస్థితుల్లో ఏ నటుడైనా మారిన సమయంలో ఏ ఒక్క సంభాషణనైనా మరిచిపోతే నాటక ప్రదర్శనం రసాభాస అవుతుందని ప్రాంప్టరును సిద్ధంగా వుంచేవారు. కాని ప్రదర్శనంలో మాత్రం ప్రాంప్టరు అవసరముండేది కాదు.

అంతేకాదు ప్రాంప్టరు, ఒక రంగం తరువాత మరో రంగంలో ప్రవేశించ బోయే నటీనటులు ఒకవేళ ఏమరుపాటుగా ఉంటారేమోనని నటీనటుల్ని ప్రవేశానికి సిద్ధంగా వుంచేవాడు.

**మా స్త్రీలే, మా స్త్రీ పాత్రధారులు :**

ఆనాడు ప్రజానాట్యమండలి కళారూపాల స్థాయి నుండి, నాటకాలు ప్రదర్శించే నాటికి ఆ నాటకాల్లో స్త్రీ పాత్రల సమస్య ఎదురైంది. ప్రజానాట్యమండలి

కృష్ణాజిల్లా దళం ప్రప్రధమంగా ప్రదర్శించిన ముందడుగు నాటకంలో స్త్రీ పాత్రల్ని పురుషులే ధరించేవారు.

అలా కధానాయకుని తల్లిపాత్రలో సూరపనేని లక్ష్మీపెరుమాళ్ళు వృద్ధ పాత్రనూ, కధానాయకి విమల పాత్రను వల్లం నరసింహారావు ధరించారు. కోడూరి అచ్చయ్యగారి దర్శకత్వంలో అద్భుతంగా అభినయించారు. పాత్రలు ధరించింది స్త్రీనా పురుషుడా అన్నంత భ్రమలో ప్రేక్షకుల్ని ముంచివేశారు.

ఆనాటికి ఆంధ్ర నాటకరంగంలో స్థానం నరసింహారావు లాంటివారు స్త్రీ పాత్రాభినయంలో స్త్రీలనే మించిపోయారు. అయితే ప్రజానాట్యమండలి ముందడుగు నాటక ప్రదర్శనల విజయపరంపర తరువాత స్త్రీ పాత్రలు స్త్రీలే ధరిస్తే బాగుంటుందనే నిర్ణయానికొచ్చారు. అప్పటికే మహిళా బుర్రకథ దళాలు ఉధృతంగా బుర్రకథలు చెపుతూ వున్నాయి.

ప్రజానాట్యమండలి రాష్ట్ర దళం ఆత్రేయతో పరివర్తన నాటకాన్ని వ్రాయించి ప్రధమంగా 1946లో మద్రాసులో జరిగిన అభ్యుదయ రచయితల మహాసభలో ప్రదర్శించారు.

ఆ నాటకంలో శోభ పాత్రను ధరించటానికి కొమట్రాజు వినాయకరావు భార్య పద్మ ముందుకు వచ్చింది. పరివర్తన నాటకంలో పాటలు కూడా వున్నాయి. ఆ పాటల్ని పద్మ స్వయంగా పాడింది. చక్కగా నటించింది.

**మా భూమి నాటకంలో స్త్రీ పాత్రధారిణులు :**

తరువాత జిల్లా దళమూ, రాష్ట్ర దళమూ చరిత్రాత్మకమైన, విప్లవాత్మకమైన మా భూమి నాటకాన్ని విజయవంతంగా ప్రదర్శించాయి. జిల్లా దళం మా భూమికి అచ్చయ్యగారూ, రాష్ట్ర దళం నాటకానికి డా॥ రాజారావుగారూ దర్శకత్వం వహించారు. మా భూమి నాటకంలో సీత, కమల అనే రెండు స్త్రీ పాత్రలున్నాయి. ఈ రెండు పాత్రలను ఎవరు ధరించాలి? బయట నాటకాల్లో స్త్రీ పాత్రలు ధరించేవారిని తీసుకోవాలా? అనే మీమాంస వచ్చింది. అప్పుడు రాజారావుగారు ఆ స్త్రీ పాత్రధారులు మన అదుపు ఆజ్ఞలలో వుండరనీ, క్రమశిక్షణను పాటించరనీ, అందువల్ల మన మహిళలచేత స్త్రీ పాత్రలను ధరింపచేయాలనుకున్నారు.

అలా జిల్లా దళం, మా భూమి నాటకంలో కధానాయకుడు వీరారెడ్డి

భార్య పాత్రను సంగీత దర్శకుడు టి. చలపతిరావు భార్య అన్నపూర్ణమ్మను, కథానాయకుని చెల్లెలు పాత్రను వల్లం రాధా, రుక్మిణిలతో, అలాగే రాష్ట్ర దళంలో కథానాయకుడు వీరారెడ్డి పాత్రను ధరించిన మిక్కిలినేని ప్రక్కన కథానాయకి సీతమ్మ పాత్రను, ఆయన భార్య సీతారత్నమే ధరించింది. కుటుంబ సభ్యుల నుండి వ్యతిరేకత వచ్చినా నటించటం జరిగింది. అది ఒక ఆదర్శయుగం.

పశ్చిమ గోదావరికి చెందిన కమ్యూనిస్టు కార్యకర్త కుమార్తె సూర్యకాంతం 'మా భూమి' నాటకంలో వీరారెడ్డి చెల్లెలు కమల పాత్ర ధరించింది. అలాగే కొండపల్లి కోటేశ్వరమ్మ, జోస్యభట్ల సుబ్బమ్మ, మైలవరపు సుబ్బాయమ్మ మొదలైనవారు పలు పాత్రలు ధరించారు. కృష్ణాజిల్లా దళం ప్రదర్శించిన అపనింద నాటకంలో వీరమాచనేని సరోజని, తాపీ రాజమ్మ కూడా స్త్రీ పాత్రలను ధరించారు.

స్త్రీ పాత్రలు ధరించిన వారెవరూ ఇంతకు ముందు నాటకాలలో పాత్రలను ధరించటం కానీ, నాటకానుభవం కానీ లేనివారు. అయినా ఆదర్శంగా ముందుకు వచ్చిన ఈ మహిళలు దర్శకుల శిక్షణలో ఎంతో పట్టుదలగా వారి వారి పాత్రలకు న్యాయం చేకూర్చి ప్రజల ఆదరాభిమానాలను అపారంగా చూరగొన్నారు.

అదే విధానాన్ని అమలుచేస్తూ ప్రజానాట్యమండలి దళాలు ఎక్కడ నాటకం ప్రదర్శించినా కమ్యూనిస్టు కుటుంబాల నుంచి వచ్చిన ఆదర్శ మహిళామణులే స్త్రీ పాత్రలను ధరించారు.

**క్రమశిక్షణ కలిగిన ఆదర్శమూర్తులు :**

ఇలా స్త్రీ పాత్రలు ధరించినవారిమీదా, బుర్రకథలు చెప్పేవారిమీదా, మహిళా సంఘాలలో చురుకుగా పనిచేసిన మహిళలమీదా, కమ్యూనిస్టు వ్యతిరేకులు అసభ్యమైన ప్రచారం చేస్తున్న ఆ రోజుల్లో వాటినన్నిటిని త్రిప్పికొట్టి క్రమశిక్షణ కలిగిన మహిళలుగా ఆదర్శమూర్తులుగా నిలబడ్డారు.

రిహార్సల్సు జరిగే సమయాలలో కానీ, ప్రదర్శనా సమయాలలో కానీ, ప్రయాణాలలో కానీ దళసభ్యులైన స్త్రీ పురుషులు ఎంతో ఆదర్శంగా వుండేవారు. అందరూ అన్నా చెల్లెళ్ళలా వుండేవారు. ఒకరికొకరు వారి వారి సమన్వయంతో వ్యవహరించేవారు. పట్టుదలగా పాత్రలకు ప్రాణం పోసేవారు.

ప్రజానాట్యమండలి స్త్రీ పాత్రలు అతి సహజంగా వుండేవి. ఒక్కమాటలో చెప్పాలంటే నటీనటులు ఆ పాత్రలలో జీవించారు. ప్రదర్శనలకు తరలివచ్చిన రైతు కూలీలందరూ అపార ఆదరాభిమానాలను చూపించేవారు. వ్యతిరేకులు వెఱ్ఱివెంగళప్పలై నోళ్ళు మూసేవారు.

ప్రజానాట్యమండలి ఎన్నో నూతన విధానాలను తీసుకువచ్చి నాటి నాటకరంగంలో విప్లవాత్మకమైన మార్గాన్ని చూపించింది. అలా ఆనాడు ప్రజానాట్యమండలి ఉన్నత ఆదర్శాలతో ఉన్నత శిఖరాలను అధిరోహించింది. నేటి మంచి అభిరుచిగల అభ్యుదయ,  విప్లవభావాలు గల సాంఘిక నాటకరంగానికి మార్గదర్శి అయింది.

**ఒకే రాత్రి రెండు నాటక ప్రదర్శనలు :**

అయితే నాటకానికి వచ్చేవారికి ముందుగానే టిక్కట్లన్నీ అయిపోయాయని తెలియక, వచ్చినవారు నిరుత్సాహపడిపోయేవారు. హాలులో ప్రదర్శన జరుగుతూవుంటే హాలు బయట గుంపులు గుంపులుగా చేరిపోయి జరిగే ప్రదర్శన అయిపోయిన తరువాత మళ్ళీ నాటక ప్రదర్శన జరపాలని ఆందోళన చేసేవారు. కార్యకర్తలకు ఏమిచేయాలో అర్థంకాక దర్శకునీ, నటీనటులనూ సంప్రదించేవారు. అయితే అప్పటికే ఎంతో ఉత్తేజ ఉద్రేకాలతో నటించిన నటీనటులు అలిసిపోయి వుండేవారు.

అయినా ఎంతో దూరం నుంచి వ్యయ ప్రయాసలతో వచ్చిన అభిమానుల కోరికను నిరాకరించకూడదని నిర్ణయించుకుని రెండవ ప్రదర్శనకు ఉపక్రమించేవారు.

అలా రెండవ నాటకం ప్రారంభమై తెల్లవారు జామున అయిదు గంటల వరకూ ప్రదర్శన జరిగేది. ప్రదర్శనకు వచ్చిన ప్రజలందరూ ఎంతో సంతృప్తితో ప్రజానాట్యమండలికి జై అంటూ జయజయ ధ్వానాలతో వెళ్ళిపోయేవారు.

ఇలా ఒకే రాత్రి రెండు నాటక ప్రదర్శనలు జరపడం ఆంధ్ర నాటకరంగ చరిత్రలో అదే ప్రథమం. ఆ గౌరవం ప్రజానాట్యమండలికే దక్కింది. ఇలా ఒకే రాత్రి రెండు నాటక ప్రదర్శనలు ప్రదర్శించటమనే వార్త ఆనాడు ఆంధ్రదేశ మంతటా మారుమ్రోగి పోయింది.

ఆనాడు ప్రదర్శించే కంట్రాక్టు నాటకాలతో విసిగి వేసారిపోయిన ప్రేక్షకులకు క్రమశిక్షణతో మహత్తర ఆశయాలతో ప్రదర్శించే ప్రజానాట్యమండలి నాటక ప్రదర్శనలు కనువిప్పు కలిగించాయి. కేవలం పార్టీ అభిమానులేకాక కమ్యూనిస్టు వ్యతిరేకులకు కూడా ప్రజానాట్యమండలి నాటకాలు చూడాలనే ఆసక్తి పెరిగింది.

**వ్యతిరేకుల కానుకలు :**

పచ్చి వ్యతిరేకులు ప్రజానాట్యమండలి కార్యక్రమాలను విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నిస్తున్న రోజులవి. ప్రజానాట్యమండలి నాటక ప్రదర్శనలు వారిని కూడా ఆకర్షించాయి. పార్టీ మీద వున్న వ్యతిరేకతతో అదివరకు ప్రదర్శనలను చూడనివారు, అయినా ఈ నాటక ప్రదర్శనలు ఎలా వుంటాయో చూడాలని రహస్యంగా ఒకరికొకరు తెలియకుండా టిక్కెట్లు కొని ప్రదర్శనలకు వచ్చేవారు.

నాటక ప్రదర్శన ఆసాంతం చూసిన తరువాత ఆశ్చర్యపోయేవారు. వారికున్న భ్రమలన్నీ పటాపంచలైపోయేయి. అంతకుమించి దేశంకోసం, ప్రజలకోసం, సమాజంకోసం ఈ నాటక ప్రదర్శనలు ఎంత ప్రయోజనకరమైనవో తెలుసు కునేవారు.

మరో నాటక ప్రదర్శనకు వస్తూ వారి స్నేహితుల్ని కూడా తీసుకువచ్చేవారు. ప్రజానాట్యమండలి నాటక ప్రదర్శన వుందని తెలియగానే మాకు అయిదు టిక్కెట్లూ, మాకు పది టిక్కెట్లూ కావాలని కబురు పంపేవారు. ముందుగానే టిక్కెట్లు బుక్ చేసుకొనేవారు. అంతేకాదు నాటకానంతరం పరమానందంతో సమాజానికి, నటీనటులకు రజత పతకాలనూ, వెండి కప్పులనూ బహూకరించే వారు. ఇలా ప్రజానాట్యమండలి నాటక ప్రదర్శనలు కమ్యూనిస్టు వ్యతిరేకతను మార్చటంతో కమ్యూనిస్టు పార్టీలోకి ఎంతో మంది ఆకర్షించబడ్డారు. జటిలమైన వ్యతిరేక భావాలను ఉపన్యాసాలకంటే సాంస్కృతిక కార్యక్రమాలు ఎలా మారుస్తాయో అర్థం చేసుకోవచ్చు.

**('ప్రజాపోరాటాల రంగస్థలం ఆంధ్ర ప్రజానాట్యమండలి' నుండి)**

# మా భూమి

**- శ్రీశ్రీ**

ప్రజానాట్యమండలి వారి "మా భూమి" ప్రదర్శనం రెండుసార్లు చూశాను. ఇంతకు పూర్వం వీరి "ముందడుగు" నాటకం చూడటం, చూసినవారంతా మెచ్చుకోవడం, దరిమిలాను దాన్ని నిషేధించడం జ్ఞాపకం వచ్చింది. "మా భూమి"ని కూడా ప్రేక్షకులందరూ ఐక్యకంఠంగా మెచ్చుకున్నారు. రెవిన్యూ మంత్రి కళా వెంకట్రావుగారు మరీ గంభీరంగా ఉపన్యసించారు. మరో యుగంధర మంత్రి రానున్నాడన్నారు. తెలంగాణా ఆంధ్ర సోదరులకు అండగా నిలుస్తామని హామీ యిచ్చారు.

కాని రేపొద్దుట నైజాం ప్రభువుతో ఇప్పటికంటే మంచి ఒడంబడిక కుదిరి, తీవ్రవాదుల మీద చర్య తీసుకోవడానికి ఉభయత్రా నిర్ణయాలు జరిగితే "మా భూమి" ప్రదర్శనం మీద ఆంక్ష పడదనే హామీ ఎక్కడిది; "ముందడుగు" మీద నిషేధం ఇంకా అలాగే వుంది. ఎందరు ప్రముఖులు అలజడి చేసినా ప్రభుత్వానికి ఖాతరు లేకపోయింది. రేపు మాత్రం ఇంతకంటే విరుద్ధంగా ఏమి జరుగగలుగుతుందా అని నా అనుమానం.

"ముందడుగు" విషయం ఇక్కడ పేర్కొనడం అప్రస్తుతం కావచ్చును. కాని "మా భూమి"ని చూచిన తర్వాత, నాకు కలిగిన ఆవేదన (తెలంగాణా ప్రజలకు నైజాం ప్రభుత్వం వల్ల కలిగే నష్టం కన్న ఎక్కువగా కళాసృష్టికి దూరదృష్టి రహితులైన పరిపాలకులు కలిగించ గలిగిన అన్యాయం తలచుకుంటే కలిగిన ఆవేదన) ఇది. "ముందడుగు" ప్రదర్శనపై నిషేధం పడిందని పత్రికలో చదవగానే "ఇండియన్ ఎక్స్‌ప్రెస్"కు నేనో ఉత్తరం రాశాను. ఆ నిషేధం పోయేదాకా నాకు మనశ్శాంతి లేదు.

"మా భూమి" నాటకం నడవడానికి బాగుంటుందా అనేది మన సమస్య

కాదు. "నాటక ప్రదర్శన"లో ప్రజానాట్యమండలి వారు ఒక బ్రహ్మాండమైన విప్లవం తీసుకొచ్చారు. క్రమశిక్షణకు గల ప్రాముఖ్యాన్ని కళ్ళకు కట్టినట్లు చూపించారు. కళాదృష్టిలో ఒక పాత్రకూ ఇంకొక పాత్రకూ హెచ్చుతగ్గులు లేవని నిరూపించారు. జీవితంలో హెచ్చుతగ్గుల కొలతలకు అలవాటుపడ్డ నేటి సంఘం కూడా "యల్లమంద" పాత్రనీ, ఆఖరికి పట్టుమని పదినిమిషాలైనా రంగంమీద కనబడని పోలీసుభటుని పాత్రనీ ఒకే విధంగా మెచ్చుకుంది.

ఈ ఒక్క విషయం సాధించినందుకే "మండలి" వారిని ఎంతైనా అభినందించవచ్చు. కాని "మా భూమి" ప్రదర్శన ప్రాముఖ్యం అక్కడితో ఆగిపో లేదు. ముందు తరగతుల నుండి చివరిదాకా కూర్చున్న ప్రేక్షకులందరిలోనూ ఒక తన్మయత్వాన్ని కలిగించిందీ నాటకం. నాటకాన్ని సరిగా చూడగలగడం నాగరికత కొక లక్షణం. మన ప్రజల నాగరికత ఈ నాటకమండలివారి చేతిలో సురక్షితంగా వుండగలదు. ఇందుకు నేపథ్యం మొదలు నాటక కళాశాల ద్వారం దాకా నిలిచిన వివిధ బాధ్యతాపరుల ఏకాగ్ర సహకారానికి నా ధన్యవాదాలు.

ఇంకో విశేషం, ప్రజానాట్యమండలి "తారా పద్ధతి" మీద చావుదెబ్బ తీసింది. "తారల విలువ" అనే పుక్కిటి పురాణం పెట్టుబడిదారీ విధానపు విచిత్రకల్పన. సామ్యవాద యుగంలో ఈ పద్ధతి రూపు మాసిపోతుంది. అది ఎలా సాధ్యమవు తుందో ఋజువు చేశాయి "ముందడుగు", "మా భూమి" ప్రదర్శనాలు.

నేను "మా భూమి" నాటకాన్ని రెండుసార్లు చూడడంలో ఉద్దేశం ఏమిటంటే పాత్రధారు లంతా ఒకానొక (mechanical efficiency) యంత్రవత్సామర్థ్యంతో పనిచేశారా లేక "సృజనాత్మకమైన నటనా నైపుణ్యం చూపించారా" అనే విషయం తేల్చుకోవడానికి. కమ్యూనిజంలో mechanical efficiency మాత్రమే వుంటుందిగాని మానవుని రసాత్మ క్రమశిక్షణ భారం క్రింద సమసిపోతుందనే దుర్విమర్శ ఒకటి వుంది. దాని చాటున చాలామంది సామ్యవాద వ్యవస్థమీద దుమ్మెత్తి పొయ్యగలుగుతున్నారు.

దీనికే "రిజిమెంటేషన్" అని ఇంకో ముద్దుపేరు. పాపం, పెట్టుబడిదారీ వ్యవస్థ దీన్ని ఎరగనే ఎరగదు. (పోలీసు, మిలటరీ విధానాలు ఈ తెగ కిందకి వస్తాయనడం ద్రోహం!) వ్యక్తి స్వాతంత్ర్యాన్ని ఆరాధిస్తుందీ వ్యవస్థ. దీనికింద

అందరూ స్వయంకృషి వల్ల పైకి వచ్చినవారే. కులం, ధనం మొదలైన అవసరాల సంగతి జ్ఞాపకం చేసేవాళ్ళు విచ్ఛిత్తి కారకులు.

ఔను. సర్వసమానత్వాన్ని సాధించడానికి ముందు ఒక క్రమశిక్షణ అవసరం. ఎటువంటి క్రమశిక్షణకిందైనా మానవుని రసహృదయం విజృంభిస్తుందనడానికి కోడూరి అచ్చయ్యగారి వెంకటరావు పాత్ర నిదర్శనం.

ఈ కారణంచేత - ప్రత్యేకించి వ్యక్తులను పేర్కొనడం అసమంజసమైనా 'మా భూమి' ప్రదర్శనాన్ని రెండుసార్లు చూసిన తర్వాత కోడూరి అచ్చయ్యగారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నాను.

సామ్యవాద వ్యవస్థ వచ్చిన తర్వాత రాబోయే వ్యక్తి స్వాతంత్ర్యం ఎలా వుంటుందో తమ నటన ద్వారా నేడే చూపించినందుకే వారికి ప్రత్యేకాభినందన.

ఆధునిక నాటక ప్రయోగ పద్ధతులలో డైరెక్టర్ అనీ, కొరియోగ్రాఫీ అనీ రెండు ముఖ్యాంగాలు వున్నాయి. ఈ రెండూ ప్రస్తుత ప్రజానాట్య మండలి వారి ఆర్థిక స్థితికి అతీతమైనవి. ఇవి లేకపోవడాన్ని ఇప్పట్లో ఒక లోపంగా నేను పరిగణించలేను.

ఇటీవలనే ఈ నాటకపు ప్రదర్శనాన్ని నిషేధిస్తూ గుంటూరు మండలాధికారి ఒక ఆజ్ఞాపత్రికను జారీచేసినట్లు తెలుస్తోంది!

**(నవోదయ వారపత్రిక - 1948)**

# తెలంగాణా స్వేచ్ఛా సంగ్రామ చరిత్ర

## 'మా భూమి' సమీక్ష

**- కొడవటిగంటి కుటుంబరావు**

**సా**మాన్యంగా ఈనాడు మధ్యతరగతివాళ్ళు ఆనందించే కళలను గురించి విమర్శక దృష్టి ఎట్లా ఉందంటే :

ఇందులో కళాకారుడి ప్రతిభ బాగా వ్యక్తమవుతుందా? దీన్నిబట్టి అతను గొప్పవాడని మనం భావించుకోవచ్చా? ఇది శిల్పం గురించి.

ఇందులో చిత్రించిన విషయాలు నమ్మదగినవేనా? ఇదంతా ప్రచారం కాదుగద? – ఇది విషయం గురించి.

మధ్యతరగతికి ఇటువంటి మనస్తత్వం ఉండటానికి ప్రబలమైన కారణా లున్నాయి. వాటి చర్చ మనకిక్కడ అనవసరం. ఈ మనస్తత్వం కళావిమర్శను ఏదో ధోరణి వల్లనే కళాకారుడి ప్రతిభకూ, దానివల్ల ప్రజలకు కలగగల ప్రయోజనానికీ మధ్య ఒక అగాధం ఏర్పడింది. ఒక నాటకకర్తగాని, రచయితగాని, నటుడుగాని, చిత్రకారుడుగాని ప్రతిభావంతుడు కావటమే ఒక పరమప్రయోజనం అయిపోయింది. ఈ విధంగానే కళావస్తువుకూ దానికి గల సాంఘిక ప్రాముఖ్యానికి మధ్య ఇంకో అగాధం ఏర్పడింది. అది కలకాలం దాని సాంఘిక ప్రాముఖ్యత చెల్లిపోయినాక కూడా – నిలబడి ఉంటదా, ఉండదా అనేది ప్రధానమయింది.

దీని ఫలితంగా కళ అనేది జీవితాన్ని మరవటానికీ, జీవితం అపహరించే జీవశక్తుల్ని కూడగట్టుకోవడానికి టానిక్కు కింద వినియోగపరుచుకోవటానికి సాధనంగా పరిణమించింది.

ఇటువంటి మనస్తత్వమూ, విమర్శనాదృష్టి సంస్కరించటం అభ్యుదయోద్యమం యొక్క కర్తవ్యం. కళలు టానిక్కులు కావు. సంఘజీవులకు నిత్యాహారం. అవి

ప్రజలలో కలిగించే ఉత్తేజాన్ని బట్టీ, ప్రత్యక్ష యథార్థ సమస్యల నెదుర్కొనే శక్తినిచ్చే సామర్థ్యాన్ని బట్టీ అవి సక్రమ ఆహారం అవునోకాదో అభ్యుదయ విమర్శకుడు నిర్ణయిస్తాడు.

దేశంలో పెచ్చుపెరిగిన ఆర్థిక కాటకంగాని, రాజకీయ సమస్యలుగాని అందరికీ సమంగా ప్రత్యక్ష, యథార్థాలు కాకపోవచ్చు. ప్రేయసి కోసం ఊహాగానం చేయటమే తారకమార్గమనే దృఢవిశ్వాసం గల వ్యక్తులూ, అల్పసంఖ్యాక వర్గాలూ దేశంలో వున్నారు. కాని ప్రజాసామాన్యం తీసుకున్నట్టయితే నిజాము రాష్ట్రంలో జరుగుతున్న ప్రజా పోరాటం ప్రత్యక్ష యథార్థ సమస్య. తెలంగాణా ప్రజలు మన ప్రజలకు భావ బంధువులు కారు. ప్రత్యక్ష సోదరులు. వారి బాగూ మన బాగూ వేరు కాదు. అందుచేత “మా భూమి” నాటకం చూసి బయటికి వచ్చిన మరుక్షణం దాని గురించి మరిచి మామూలు ప్రపంచంలోకి పడటం అసంభవం. ఒకవేళ ఈ నాటకం చూడక మునుపు నిజాము పోరాటాన్ని గురించి తగినంత ఆలోచించని వాళ్ళెవరైనా వుంటే వాళ్ళనీ నాటకం యథార్థ ప్రపంచంలోకి తీసుకువచ్చి అక్కడే ఉంచుతుంది. ఈ కారణంచేత ఈ నాటకం చేసే ప్రచారం అత్యవసర ప్రచారం. ఈ నాటకంలో వున్న పాత్రలు స్థూలంగా రెండు పక్షాలకు చెందినవే అయినా స్పష్టమైన వ్యక్తిత్వాలు కలవి. ఏ పాత్ర “భాష” ఆ పాత్ర మాట్లాడుతుంది. వీరారెడ్డి ప్రబోధకుడు. రామిరెడ్డి అనుమానం మనిషి. దాదా ఆత్మవిశ్వాసం తగినంతలేని పాతకాలపు సాధువు. సుభాన్ తొందరమనిషి. యల్లమంద ఆలోచించే బాపతు కాదు. రెండోపక్షంలో కూడా జగన్నాథరెడ్డి గర్వాంధుడు, పట్వారీ తెలిసిన మూర్ఖుడు, మస్తాను దేశముఖు చేతికర్ర, ఆఖరుకు సీతమ్మా, కమలా కూడా ఒకే పద్ధతి కాదు.

ఇంత విస్పష్టమైన పాత్రలతోటి అభ్యుదయ శక్తుల స్వరూపాన్ని అభ్యుదయ నిరోధక శక్తుల స్వరూపాన్ని చక్కగా చిత్రించారు నాటకకర్తలు. రైతువర్గపు సంభాషణలన్నీ నినాదాలుగానూ, రాజకీయ ఉపన్యాసాలుగానూ కనిపిస్తాయి. కాని ఆ నినాదాలూ, ఉపన్యాసాలూ వారి జీవితానికి ఎంతో ముఖ్యమైనవి. తమ జీవితాలను స్పష్టంగా అవగాహన చేసుకోవడం మీదే వారి ప్రాణాలూ, విజయమూ ఆధారపడి వున్నాయి.

ఈ నాటకంలోని వ్యక్తుల కష్టసుఖాలకన్నా ఉమ్మడి సమస్యకి ఎక్కువ ప్రాముఖ్యత వుండకపోవడం గుణమేగాని లోపం కాదు. అయితే ఈ నాటకానికి వాస్తవికత్వం రావాలంటే ఈ పాత్రలు చాలవు; నాటకం మొదటినుంచి చివరవరకూ నలుగురే రైతులూ, ఒక్కరే దేశముఖు రౌడీ, ఒకడే పోలీసు ఉద్యోగి కావటం నాటకానికి చాలా బలహీనం. ఏ వీరారెడ్డి జీవితమో నాటకానికి ప్రధానాంశమైతే ఇది పట్టివ్వకపోను.

సంభాషణల్లోనూ పాత్ర సంబంధాల్లోనూ నాటక రచయితలకు అక్కడి వాతావరణంతో గల పరిచయం చక్కగా వ్యక్తమవుతుంది. ఇంత గంభీరమైన నాటకంలో కూడా చక్కని సున్నితమైన హాస్యం వుంది.

స్వరూపంలో ఈ నాటకానికి ఆధునిక నాటక లక్షణాలు ఆట్టే లేవు. ఏ దృశ్యానికా దృశ్యం రక్తికడుతుంది. కాని ముందు నడిచిన దృశ్యం వెనక నడిచిన దృశ్యంతోటి చక్కగా అతకదు. మధ్య ఏ సీను ఎత్తివేసినా నాటకం ఆట్టే దెబ్బ తినదేమో అనికూడా అనిపిస్తుంది. అదీగాక ఈ నాటకం "ముందడుగు" వొరవడిలోనే నడిచింది. కూచిపూడి భాగోతులకూ, హరికథా కాలక్షేపాలకూ నప్పినంతగా ఇటువంటి వొరవళ్ళు ఆధునిక నాటకానికి నప్పవు. నాటకంలో ఎన్ని రంగాలుండవలసిందీ, ఏ రంగంలో కథ ఏ పాకానికి రావలసిందీ కథను బట్టీ నిర్ణయించాలి గాని ఒకే మూసలో వేసి అన్ని కథలనూ తయారుచేయరాదు. ఈ నాటకం రాసిన సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావుగార్లీ విషయం గమనించాలి.

**(అభ్యుదయ మాసపత్రిక, జనవరి 1948)**

# మా భూమిలో 'మా భూమి'ని చొప్పించి 'భూమికోసం' నడిపించిన సుంకర

**- ఎ.బి.కె.**

**మ**నిషికి ఒకటే జననం, ఒక్కటే మరణం. రెంటినీ సద్వినియోగం చేసుకున్నవాడి జీవితమే పరిపూర్ణం. మడులు, మాన్యాలు లేకపోతే మానె, మనసు వుండి, ప్రజలంటే ప్రేమ వుండి, కడు పేదరికంలోనే కడకంటా బ్రతుకు ఈడ్చినా కష్టకాలంలో 'కంకర' కొట్టినా, కడకు సుంకర జీవితం ధన్యం. చనిపోయినా ఎప్పటికీ బ్రతికే వారిలో ఒకడు సుంకర.

ఇప్పటి తరంలో కొందరికి తెలియకపోవచ్చు. కాని ముప్పయి యేళ్ళనాడు అభ్యుదయ సాహిత్యక్షేత్రంలో, నాటకరంగంలో వెలసిన ఇద్దరు కవులు-జంట కవులు "సుంకర-వాసిరెడ్డి". ఎవరో పట్టి పీట వేసినంత మాత్రాన వారి ప్రతిభ ఉజ్వలమై నక్షత్రకాంతులు విరజిమ్మలేదు. సూర్యుని "స్వయంప్రకాశం"తో దీటైన కాంతి వీరిరువురిదీను. ఒకరు ఇరవై ఏళ్ళ క్రితమే తనువు చాలించగా, వేరొకరు - సుంకర సత్యనారాయణ అరవై ఆరవయేట మొన్న చనిపోయారు.

అతి సామాన్య కుటుంబంలో జన్మించిన సుంకర జీవితాంతమూ సామాన్యుల మంచికోసం తపించినవాడు. అతని కట్టు, బొట్టు, మాట తీరూ, నడవడిక ముమ్మూర్తులా రైతుబిడ్డే. రైతు బాధలు తెలుసు, రైతుకూలీల వ్యథలు తెలుసు. వాళ్ళ అందరి అగచాట్లకు కారణాలు మరింతగా తెలుసు. ప్రజలమధ్య తన మనుగడను తీర్చిదిద్దుకొంటున్న సుంకర జాతీయోద్యమంలో, ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలుశిక్ష అనుభవించాడు. గాంధీ ఉద్యమం పరిమితులు తెలిసిన సుంకరకి, తనలాంటి కష్టజీవుల బ్రతుకు మార్గం సోషలిజంలోనే సాధ్యమన్న విశ్వాసం బలంగా ఏర్పడింది. ప్రజా ఉద్యమాల వైపుకు మళ్ళాడు. ప్రజాసంఘాలలో పనిచేశాడు. కార్యకర్తలకు, కష్టజీవులకు వాళ్ళ భాషలోనే పాఠాలు చెప్పాడు. పాటలు కట్టాడు. బుర్రకథలు వ్రాశాడు.

అది ప్రపంచయుద్ధ సమయం. కరవుకాటకాలమయం. గోపీచంద్ ఒకచోట చెప్పినట్టు "కమ్యూనిస్టులు రాళ్ళను సహితం కరిగించుతున్న" కాలం అది. ఆ కాలంలో ప్రజా ఉద్యమాల సందడిలో, ప్రజాభిమానపు సమరంలో ప్రజాకళలన్నిటి పునరుద్ధరణకు పునాదులు పడ్డాయి. ఆ పునాది రాళ్ళలో సుంకర పాదుకొల్పిన పాలరాళ్ళు కొన్ని వున్నాయి. రైతు–కూలీ పాటలకు ఆయన కలం పెట్టింది పేరు. ఈ ఊపులో సుంకర లేఖిని నుంచి జాలువారినవే, వాసిరెడ్డితో కలిసి "ముందడుగు", "మా భూమి", "అపనింద" నాటకాలు. నాటి ఆంధ్రప్రజా జీవితానికి అవి అద్దం పట్టాయి. చెరిగిపోని ముద్ర వేశాయి.

వీటన్నిటిలోకి నాటికీ నేటికీ అపారమయిన ముద్ర వేసుకున్న విశిష్ట నాటకం "మా భూమి". నాటి నైజాం నిరంకుశత్వాన్ని ఎదిరించి, ధనస్వామ్య విచ్చుకత్తుల బారినుంచి విముక్తి కోసమే గాక, చిన్నాభిన్నమై వున్న తెలుగు వాళ్ళందరినీ విశాలాంధ్ర మందిరంలోకి చేర్చేందుకు జరిగిన ప్రజా ఉద్యమానికి గుండెకాయ ఈ నాటకం.

సర్వమత సమ్మేళనా భావనను పెంపొందించి, సామాన్యుని భాగ్యోదయానికి నాంది పలికిన కళాఖండం అది. 125 నాటక దళాలలో 20 లక్షలమంది ప్రేక్షకులను ఉద్రూత లూగించిన నాటకం అది. "చరిత్రలో అపూర్వ" మన్నాడు అబ్బాస్. "కవులమని రొమ్ములు విరుచుకుని పద్యాలు వ్రాసి ఏనుగులెక్కి గండపెండేరాలు వేయించుకునే కవులలో ఎంతమందికి ఈ అచ్చమైన, జాతీయమైన తెలుగుభాష, తెలుసు"నని ప్రశ్నించారు విశ్వనాథ. "తిక్కన తరువాత మళ్ళా ఈనాడు జాతీయభాష విన్నాం" అని విస్తుపోయాడు పింగళి. చివరికి కళా వెంకట్రావు వంటి కాంగ్రెసు నాయకులు కూడా "ఇటువంటి నాటకాలు" అవసరమని చెప్పి అవతలకు పోయి "మా భూమి"ని నిషేధించారు.

అయితే ఇతివృత్తానికి పూర్తిగా కాలం చెల్లలేదు. కనకనే అది చారిత్రక కళాఖండం. ఆ పిమ్మట ఇటీవల కాలంలో సుంకర "మా భూమి" కొనసాగింపుగా రాసిందే "గెరిల్లా". నిత్యజీవనానికి ఇబ్బంది పడుతూనే నమ్ముకున్నవాళ్ళు నట్టేటముంచినా చలించకుండా, కట్టెదుట కన్పిస్తున్న వాస్తవ జీవితం నుంచి దూరం కాకుండానే ఆ పుస్తకాన్ని ఎవరినో ఆశ్రయించి అచ్చువేయించుకున్నాడు.

"దున్నేవానికే భూమి" నినాదంతో వర్థిల్లిన ఈ రెండు నాటకాలు ఆ హక్కుకోసం పోరాడి బలయ్యే "సీతాలు", "బందగీలు", "దాదాలు" ఉన్నంత

కాలమూ నిలచిపోయాయి. కాదు, భూసమస్య తీరనంతకాలమూ అవి ఆదర్శాల ఆనవాళ్ళుగా మిగిలిపోతాయి.

ఆయన సమకాలికులందరికీ జీవికకోసం సుంకర ఎన్ని అగచాట్లు పడిందీ, "సోవియట్ భూమి"కి చందాలు కట్టించి, ఎలా పొట్టపోసుకోవలసి వచ్చిందీ తెలుసు. కాని చివరికి ఆ "భూమి" కూడా ఆయనను నిలపలేకపోయింది. "మా భూమి" ప్రతులు మాత్రం నిలిచిపోయాయి. 'పల్లెటూరు', 'పుట్టిల్లు', 'కన్నతల్లి' సినిమాలలో కూడా పాటలు వ్రాశా రాయన. చివరికి ఆయన గుండెలో రగుల్తూ వస్తున్న భూసమస్యను, "భూమికోసం" సినిమాలో ఆయన లేఖినిలో చొప్పించాడు. ఎన్నడూ డ్యూయెట్లు రాయకపోయినా అందులో సందర్భోచితంగా రాసిన ప్రేమగీతం – కేవలం ప్రేమకాదు, ఆశయసాధన కోసం గుండెలు కలిసిన జంటగా గొంతుక "హిట్" అయింది.

ప్రజాకవుల జీవితాలు చిత్రమైనవి. కటిక దరిద్రంతో అవి అంతం కావడం మరింత విచిత్రం. గరిమెళ్ళ సత్యనారాయణ ఏనాడో పోయాడనుకున్నా, సుంకర సత్యనారాయణ ఈనాడు కూడా అదే దారిద్ర్యం మధ్య కన్నుమూయడం ... ఏమంటాం? తనలాంటి వాళ్ళ బ్రతుక్కి వెలుగెప్పుడు అంటే, కవి సుంకర మాటల్లోనే చెప్పాలంటే :

"చిమ్మ చీకటులజీల్చి
చిందరవందర జేసి
రవి అదే ఉదయిస్తాడు
కవి కలమందిస్తాడు
రవి కవులొకటై నిలచి
రశ్మలు చిందిననాడు
పరితప్త ప్రజాహృదయం
పరిభావ మహాగ్నిగుండం
పటపట పగులకపోదు
బ్రద్దలు కాకనూపోదు
దర్వీకర విషనీతిని
దగ్ధంచేయక పోదు"

**(12–9–1975 ఈనాడు)**

# మాభూమి

ఈ నాటకంలో గ్రామీణ ప్రాంతాలలో వివిధ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యంగా తీర్చిదిద్దబడిన పాత్రలు, బిగువైన సన్నివేశాలు, సహజమైన సంభాషణలు, పాత్రోచితమైన భాష, మాండలికాలు, సామెతలు, ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. సందర్భోచితంగా ఉన్న పాటలు, ప్రేక్షకుల్ని ఉత్తేజపరుస్తాయి. ఇంత విశిష్టమైన నాటకం తెలుగు నాటక రంగంలో మరొకటి లేదనటం అతిశయోక్తి కానేకాదు.

హిందూ-ముస్లిం ఐక్యత, జనాభాలో సగంగా వున్న మహిళలు, ఉద్యమాలో కూడా ముందుండాలనీ, ప్రజా ఉద్యమాలలో సామాన్యులే అసామాన్యపాత్ర నిర్వహించగలరనే విషయాలను నాటకంలో స్పష్టం చేయడం ద్వారా 'మా భూమి' ఇతివృత్తానికి మరింత పుష్టి చేకూరింది.

కొన్ని గొప్ప నాటకాలు చదువుకునేందుకు మాత్రమే... ప్రదర్శన కష్టతరం... మరికొన్ని నాటకాలు ప్రదర్శనలో మాత్రమే గొప్పగా వుంటవి. కాని 'మా భూమి' నాటకం చదువుటకూ, ప్రదర్శనకూ అనువైన గొప్ప నాటకం.


**విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**

చంద్రం బిల్డింగ్స్, చుట్టుగుంట, విజయవాడ - 520002. ఫోన్ : 0866 2430302.